VISALAANDHRA VIJAYAWADA PHONE No. 376

8 పేజీలు 13 నయాపైసలు రిజిష్టరు నెం. 203 A

'విశాలాంధ్ర' పత్రిక

చందా వివరాలు

	ఏజంటుద్వారా		పోస్టుద్వారా
సంవత్సరం ...	28.00	...	30.00
ఆరు మాసాలు ...	14.00	...	15.00
మూడు మాసాలు ...	7.00	...	7.75
ఒక మాసం ...	2.40	...	2.60

విశాలాంధ్ర

౧౦౬౨౭౦

సంపుటి 12 | విజయవాడ • 23 సెప్టెంబరు 1962 • ఆదివారం [సంచిక 168

కట్టడపు పనుల నిర్వహణకు సహకార సంస్థలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22

కట్టడపు పనులనిర్వహణకు కార్మికుల సహకార సంఘాలకు అప్పగించేపనుల స్వభావంపై నాగపూర్‌లో సెప్టెంబరు 26 న అఖిల భారత గోష్టి జరుగుతుంది. ఈ గోష్టిని కేంద్ర సమాజ వికాస మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్నది. తృతీయ ప్రణాళికలో ప్రతిరాష్ట్రంలోనూ ఇలాంటి సహకార సంఘాలను వందకు పైగా నిర్మించడానికి అవకాశమున్న దేమో ఈ గోష్టిలో పరిశీలిస్తారు.

తూర్పాసియాలో అమెరికా తెచ్చిపెడుతూన్న ప్రమాదకరస్థితి

ఐరాస మహాసభ చర్చలో సోవియట్ విదేశాంగ మంత్రి ఆండ్రీ గ్రోమికో హెచ్చరిక

ఎరువు ఫ్యాక్టరీలపై మంత్రుల పరస్పర విరుద్ధ ప్రకటనలు

హైదరాబాదు, సెప్టెంబరు 21

కొత్తగూడెం, విశాఖపట్టణాలలో స్థాపింపబడనున్న ఎరువుల ఫ్యాక్టరీలలో దేనిపని సాఫీగా సాగిపోతున్నదీ? దేనిపని నిల్చిపోయింది? ఈ విషయమై రాష్ట్ర మంత్రులు శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, శ్రీ లక్ష్మీనరసయ్యా పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నారు.

పరిశ్రమల మంత్రి శ్రీ యం. లక్ష్మీనరసయ్య నేడు విలేకరులలో ప్రసంగిస్తూ కొత్తగూడెం ఎరువుల ఫ్యాక్టరీ పని అనుకొన్న ప్రకారం సాగిపోతున్నదన్నారు. ఆంధ్ర సుగర్స్ లిమిటెడ్ విదేశ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొన్నదనీ, కేంద్ర ప్రభుత్వం ఆమోదంకోసం ఎదురు చూస్తున్నదనీ అన్నారు.

కొత్తగూడెం ఎరువుల ఫ్యాక్టరీ 1965 ఆఖరుకు ఉత్పత్తి ప్రారంభించ గలదనే విశ్వాసం తనకున్నదన్నారు. ఈ ఫ్యాక్టరీ పని సాఫీగా సాగిపోతుండగా విశాఖపట్నం ఎరువుల ఫ్యాక్టరీ పని సంతృప్తికరంగా సాగడం లేదన్నారు.

కొన్ని రోజులక్రితం ఆర్థికమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి విలేకరుల ప్రశ్నలకు సమాధానం చెప్తూ "కొత్తగూడెం ఫ్యాక్టరీ నిర్మాణం ఎప్పుడు ప్రారంభమయ్యేదీ దేవునికే ఎరుక" అని అన్నారు. విశాఖపట్నం ఎరువుల ఫ్యాక్టరీ సంగతినిగురించి ప్రశ్నించగా "దానికేమి దాని పని భేషుగ్గా సాగిపోతున్నది. నిర్ణీతకాలంలో దాని నిర్మాణం జరుగుతుంది" అన్నారు.

ఈ ఫ్యాక్టరీ ఫ్యాబ్రికేషన్ మేనేజిమెంటు క్రింద వుంటుందనే విషయం పాఠకులకు విదితమే.

ఈ ఎరువుల ఫ్యాక్టరీలను గురించి రాష్ట్రమంత్రులు ఇలా పరస్పర విరుద్ధమయిన ప్రకటనలు చేయడానికి కారణమేమో తెలియదు.

బ్రిటన్‌లో ఎన్నికలు జరపాలి

ఉమ్మడి మార్కెట్ సమస్యపై ట్రేడ్ యూనియన్ నాయకుని డిమాండ్

లండన్, సెప్టెంబరు 21

పశ్చిమ యూరప్ ఉమ్మడిమార్కెట్‌లో బ్రిటన్ చేరేవిషయమై దేశంలో జనరల్ ఎన్నికలు జరపాలని 13 లక్షల మంది రవాణా - జనరల్ వర్కర్సు యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ ఫ్రాంక్ కజిన్స్ నేడుడిమాండ్ చేశారు.

ఉమ్మడిమార్కెట్‌లో ప్రవేశించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని బ్రిటిష్ ప్రజలు బలపరుస్తున్నారని తాను భావించడంలేదని ఆయన అన్నారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా ఇటువంటి నిర్ణయం చేయడానికి ప్రభుత్వానికి హక్కు లేదన్నారు.

విజయవాడ ఛైర్మన్‌గా శ్రీ ఖుద్దూస్ ఎన్నిక

విజయవాడ, సెప్టెంబరు 22

కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ ఎస్. ఎం. ఎ. ఖుద్దూస్ గారు విజయవాడ మునిసిపల్ ఛైర్మన్‌గా ఎన్నికైనారు.

విజయవాడ మునిసిపల్ ఛైర్మన్ ఎన్నిక నేడు యిచ్చట మునిసిపల్ కార్యాలయంలో జరిగింది.

ప్రత్యేకాధికారి, సబ్ కలెక్టర్ శ్రీ ఎం. వి. గిరిగారు యీ ఎన్నిక కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

సభ్యుల ప్రమాణ స్వీకారానంతరం కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ యస్. యం. ఎ. ఖుద్దూస్ పేరును శ్రీ కండేటి సత్యనారాయణ గారు ప్రతిపాదించారు. శ్రీమతి అచ్చాయమ్మగారుబలపరిచారు. పట్టణఅభివృద్ధి సమితి అభ్యర్థిగా డాక్టర్ జంధ్యాల దక్షిణామూర్తిగారి పేరును శ్రీ ఉప్పలపాటి రామచంద్ర రాజుగారు ప్రతిపాదించగా శ్రీ పి. వి. రాఘవయ్యగారు బలపరిచారు.

ఓటింగు రహస్యంగా జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ ఖుద్దూస్ గారికి 19 ఓట్లు, శ్రీ దక్షిణామూర్తిగారికి 15 ఓట్లు వచ్చాయి. అభ్యర్థులిద్దరూ ఓటింగులో పాల్గొనలేదు.

శ్రీ ఖుద్దూస్ ఎన్నికయ్యారనగానే శ్రీ డాక్టర్ దక్షిణామూర్తిగారు ఆయన్ను కలిసి అభినందించారు.

ఛైర్మన్‌గా తనను ఎన్నుకున్నందుకు శ్రీ ఖుద్దూస్ కాంగ్రెస్ కౌన్సిలర్లకు ధన్యవాదాలర్పించారు. పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సమితి తరఫున శ్రీయుతులు దక్షిణామూర్తి, పి. వి. రాఘవయ్యగార్లు అభినందనాలు చెప్పి, పట్టణ అభివృద్ధికి చేసే కృషిలో తమ పూర్తి సహాయ ముంటుందని తెలియజేశారు.

కమిషనర్ శ్రీ బషీర్ అహమ్మద్ స్టాఫ్ తరఫున, తన తరఫున అభినందనలు తెలియజేశారు.

శ్రీ ఖుద్దూస్ ఛైర్మన్‌గా ఎన్నిక కాగానే పూలమాలలు వేసి అభినందించారు. (వి. వి.)

కాంగోలో ఐరాస విమాన ప్రమాదంలో మరొకరి మృతి

స్టాక్‌హోం, సెప్టెంబరు 22

కాంగోలో కూలిపోయిన ఐరాస విమానంలోని క్షతగాత్రులలో మరొకరు నేడు ఆస్పత్రిలో మరణించినట్లు స్వీడిష్ రక్షణశాఖ ప్రకటించింది. భూమిమీద నుండి విమానంపైన వారు కాల్పులు కాల్చినందునే ఈ ప్రమాదము జరిగినట్లు తెలుస్తున్నది.



పద్మశ్రీ స్థానం షష్టిపూర్తి సన్మానం నేడే

విజయవాడ, సెప్టెంబరు 22

పద్మశ్రీ స్థానం నరసింహారావుకు హైదరాబాదులో షష్టిపూర్తిసన్మానం రేపు 23వ తేదీన జరుగుతుంది. ఈసందర్భంలో లక్షరూపాయలనిధిని ప్రోగుచేసి, హైదరాబాద్‌లో ఒక థియేటర్ కట్టడానికి సన్మాన సంఘంతలపెట్టింది.

రోషనార, చిత్రాంగి, మధురవాణి మున్నగు స్త్రీ పాత్రలను ధరించి అనేక దశాబ్దాలుగా నాటక రంగానికి శ్రీ స్థానం ఎనలేని సేవచేశారు.

ఎర్రకాల్వ వరదలకు 40 వేల ఎకరాలముంపు

40 గ్రామాల రైతుల భయాందోళనలు

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 21

పశ్చిమ గోదావరిజిల్లాలో ప్రవహిస్తున్న ఎర్రకాలువ గత 20 రోజుల నుండి వరదలలో వుంది. దీనివలన అధికంగా నష్టపడ్డ తాలూకాలు తాడేపల్లిగూడెం, కొవ్వూరు తాలూకాలు. ఇందు 40 గ్రామాలు (మారంపల్లి-నందమూరు మొదలుగాగల) గ్రామముల పల్లపు ప్రాంతాలు జలమయముగుటే కాకుండా 40 వేల ఎకరములు గత 20 దినముల నుండి జలమయమై వున్నవి. వరిపైరు మీద, 6 అడుగుల పైబడి నీరుంది. వరదనీరు తీయునాటికి పూర్తిగా వరి కుంగడమంత కుళ్ళిపోగలదని రైతులు, వరద ప్రాంతాలు తిరుగుచున్న "విశాలాంధ్ర" విలేకరితో అన్నారు. వరద ప్రాంతాలలో నిసుమారు 25 వేల పశువులు పచ్చగడ్డికై బాధపడుచున్నవి.

అగ్నికి ఆజ్యము తోడైనట్లు నిడదవోలు దగ్గర ఏలూరు కాల్వలో కలియు రాళ్ళ మడుగు (మురుగు కాల్వ) పొంగుటవలన, గోదావరినది వరద ప్రమాద సూచికకు దగ్గరపడుట మూలమున "ఏలూరుకాల్వ హెడ్ స్లూయిస్" ద్వారా కట్లు పొర్లి పోయేట్లు నీరు వచ్చుచున్నందు వలన రాళ్ళ మడుగు నీరు, గోదావరి నీరు కలసి మామూలు ఎర్రకాల్వ నీటికంటె మరింత ఎక్కువ నీరు ఎరకాల్వలో శెట్టిపేట వద్ద కలియుచున్నది. (వి. వి.)

పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ కెనడాలో 4 రోజుల పర్యటనకు ఈనాడు ఒట్టావా చేరుకొన్నారు.

బ్రెజ్నేవ్ బెల్గ్రేడ్ పర్యటన

సెప్టెంబర్ 24న ప్రారంభం

బెల్గ్రేడ్, సెప్టెంబరు 21

సోవియట్ యూనియన్ అధ్యక్షుడు లియోనిడ్ బ్రెజ్నేవ్ అధికార పర్యటన నిమిత్తం ఈ నెల 24వ తేదీన బెల్‌గ్రేడ్ (యుగోస్లావియా రాజధాని)కి రానున్నారు.

బ్రెజ్నేవ్ యుగోస్లావియాలో 10 రోజులు పర్యటిస్తారు. యుగోస్లావియా అధ్యక్షుడు టిటో ఆహ్వానంపై ఈయన వస్తున్నారు. అనేక రంగాలలో అభివృద్ధి చెందుతున్న సోవియట్-యుగోస్లావియా సహకారానికి బ్రెజ్నేవ్ పర్యటనకూ సంబంధం వుందని యుగోస్లావియా దేశాంగశాఖ ప్రతినిధి అన్నారు.

అయితే, మరో ప్రపంచయుద్ధాన్ని నివారించగల శక్తి నేటి ప్రజలకున్నదని పునరుద్ఘాటన

ఐరాస, సెప్టెంబరు 21

తూర్పాసియాలో పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉన్నదని, చైనామీదా, తదితర సోషలిస్టు దేశాలమీద దాడిచేయటానికి తైవాన్‌ను అమెరికా సైనిక వేదికగా మార్చి వేసిందని సోవియట్ విదేశాంగ మంత్రి గ్రోమికో ఐరాసలో నేడు ప్రపంచ వ్యవహారాలపై సాధారణ చర్చలో ప్రసంగిస్తూ అన్నారు. అయితే మూడో ప్రపంచయుద్ధం అనివార్యం కాదనీ, దానిని నివారించగల శక్తి ప్రపంచ ప్రజలకున్నదని నేడు సోవియట్ ప్రజల దృఢవిశ్వాసమని గ్రోమికో పునరుద్ఘాటించారు.

ప్రపంచ వ్యవహారాలపై ఇది రెండవ నాటి చర్చ.

పశ్చిమ రాజ్యాలవారు యుద్ధ సన్నాహాలను మానలేదు. రాకెట్ అణ్వాయుధాలతో యుద్ధానికి సన్నాహాలు రోజురోజుకి పెరుగుతున్నాయి. అటువంటి యుద్ధప్రమాదం కూడా పెరుగుతూంది.

తూర్పాసియాలో పరిస్థితి చాల ప్రమాదకరంగా ఉంది. చైనామీదా, ఇతర సోషలిస్టు దేశాలమీదా దెబ్బ తీయడానికి తైవాన్ దీవిని అమెరికా తన సైనిక వేదికగా మార్చివేసింది. దక్షిణ కొరియాను కూడా అమెరికా తన సైనిక స్థావరంగా చేసుకొని, అక్కడ తన సేనల్ని నిలపడం, తూర్పాసియా పరిస్థితిని మరింత ప్రమాదభరితం చేస్తూంది.

ఈ సమస్యలను నిర్మాణాత్మకంగా పరిష్కరించడం తూర్పాసియాలో పరిస్థితిని మెరుగుపరచడానికి ఎంతగానో తోడ్పడగలదని గ్రోమికో అన్నారు.

చైనా ప్రజారిపబ్లిక్‌ని ఐరాస గుర్తించాలనీ, ఐరాస లోని చైనా స్థానాన్ని దానికి అప్పగించాలనీ, ఆయన మరోకసారి నొక్కిచెప్పారు.

యుద్ధం అనివార్యంకాదు

ఆయన ప్రసంగంలో ఇంకా ఈ క్రింది అంశాలు ఉన్నాయి:

సోషలిస్టు దేశాల కామన్వెల్తు మహాశక్తివంతమయినది. ప్రపంచ జనాభాలో నాలుగో వంతు, ప్రపంచ భూభాగంలో మూడోవంతు ఇందులో ఉంది.

ఈ సోషలిస్టుదేశాలన్నీ తమ పరపతి సంతటినీ, యావత్తు శక్తినీ, శాంతి కోసం జరిగే పోరాటానికై వినియోగిస్తున్నాయి.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం, ఎల్బనదికి తూర్పుగా, ఒక శాంతికాముక జర్మన్ రాజ్యంకూడా వెలిసింది.

నానాజాతి సమితి అనుభవం

పూర్వపు నానాజాతి సమితి అనుభవాన్ని జ్ఞాపకం చేస్తూ గ్రోమికో ఇలా అన్నారు:

తుప్పుపట్టిపోయిన లోహ నిర్మాణంలాగా ఆ సంస్థ కూలిపోయింది. అభివృద్ధి నిరోధకశక్తులు, దాని పునాదులకు దెబ్బ తీయడమే అందుకు కారణం. నిజంగా శాంతిని కాపాడగల సంస్థగా అది అభివృద్ధి కాకుండా ఆ శక్తులు అడ్డు తగిలాయి.

అందులో నుంచి జపాను ముందు నిష్క్రమించింది. ఆ తరువాత హిట్లరు జర్మనీ, చివరకు ఫాసిస్టు ఇటలీలు అందులో నుంచి వెళ్ళిపోయాయి.

దురాక్రమణను అరికట్టి, ప్రపంచ యుద్ధాన్ని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా అప్పుడు సోవియట్ ప్రతిపాదించింది. కాని, నానా జాతి సమితి ఆ ప్రతిపాదనను లక్ష్యపెట్టలేదు. ఘోర విపత్తును నివారించేందుకు ఏమాత్రమూ ప్రయత్నించలేదు.

ఆనాటి పరిస్థితితో పోలిక

ఐరాస లోని ప్రస్తుత స్థితికీ, ఆనాటి నానాజాతి సమితి స్థితికీ పోలిక చూపవచ్చు. శాంతి, శాంతియుత సహజీవనాన్ని కోరే వారికందరికీ, ఐరాస లోని ప్రస్తుత స్థితి ఆందోళన కలిగించక తీరదని ఆయన అన్నారు.

కెన్నెడీ ప్రగల్భాలు

అమెరికా అధ్యక్షుడు కెన్నెడీ, ఈ నెల 13వ తేదీని, క్యూబా విషయమై చేసిన ప్రకటనను గ్రోమికో

(మిగతా 2వ పేజీలో)

పెట్టుబడిదారీ-కమ్యూనిజాల మధ్య అంతరం తగ్గుతోందట

ప్రధాని నెహ్రూ అభిప్రాయం

పారిస్, సెప్టెంబరు 21

కమ్యూనిజానికీ, పెట్టుబడిదారీ విధానానికీ మధ్య అంతరం కొంత తగ్గినట్లు భారత ప్రధానమంత్రి నెహ్రూ నేడిక్కడ చెప్పారు. అయితే ఈ రెండు విధానాలమధ్య పెద్ద వైరుధ్యమే ఉన్నదన్నారు.

ప్రధాని నెహ్రూ మూడు రోజులపాటు ఫ్రాన్స్‌లో గడపనున్నారు. ఈ సందర్భంలో ఆయన ఐరాస విద్యాసాంస్కృతిక సంస్థ సమావేశంలో మాట్లాడుతూ పైవిధంగా చెప్పారు.

"పెట్టుబడిదారీ విధానం ప్రతీ విషయంలో తన పూర్వపద్ధతుల్ని మార్చుకున్నదనీ, యింకా మార్పు చెందుతోందనీ, ప్రతీ ఆలోచనాపరుడికీ తెలుసు. కమ్యూనిజం సరికొత్త మార్గాల్లో అభివృద్ధి చెందుతోంది. కాబట్టి ఒక విధంగా పెట్టుబడి దారీ విధానానికీ - కమ్యూనిజానికీ మధ్య అంతరం తగ్గిపోతున్నట్లే చెప్పవచ్చు.

"ఈ నాటి ప్రపంచానికి నిరాయుధీకరణ కన్నా పెద్ద అవసరమేమీ లేదు. క్రమేణా మెట్టుమెట్టుగానే మనం నిరాయుధీకరణ లక్ష్యం వైపుగా సాగిపోవచ్చు. మనం వేసే ప్రతీముందడుగూ ఆతర్వాత అడుగు వేయడానికి అనుకూల పరిస్థితులు కల్పిస్తుంది.

"భయం, విద్వేషాలు తగ్గినకొలదీ నిరాయుధీకరణ వస్తుంది. విష వలయం నుండి మనంబయటపడ్డం ఎలాగ? ఇందుకు భారతదేశంలో మాకు సమాధానాలు దొరకవు. అలాగే ఇతరులు ఏమిచేయాలో చెప్పేందుకు మేము పూనుకోము.

"మానవులమనస్సులో నే యుద్ధాలూ, ఘర్షణలూ ప్రారంభమవుతాయి. ముందు అక్కడ శాంతి నెలకొల్పుకోవాలి.

"ఆసియా-ఆఫ్రికాలలోని ఇతర దేశాలలో వలెనే మేము భారతదేశంలో కూడా దారిద్ర్యానికి స్వస్తిచెప్పి, మంచిజీవన ప్రమాణాలకోసం కృషి చేస్తున్నాం. శాస్త్ర విజ్ఞానం, ఆధునిక సాంకేతికాభివృద్ధి కాకుండా ఇది సాధించడం కష్టం."

తూర్పు పాకిస్తానులో రంగ్‌పూర్‌లో ఆచార్య వినోబా భావేకు [illegible] ఎకరాల భూదానం లభించింది

అణ్వస్త్ర పరీక్షలను నిరసిస్తూ ఢిల్లీలో వారంరోజులు సభలు

గాంధిజయంతినాడు ఊరేగింపు, పెద్ద బహిరంగసభ ఏర్పాటుకు పౌర కమిటీ నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21

అణ్వస్త్ర పరీక్షలను ఖండిస్తూ, ప్రపంచ నిరాయుధీకరణకై విజ్ఞప్తి చేస్తూ ఢిల్లీలో సెప్టెంబరు 25 నుండి వారం రోజులపాటు వీధి మొగ సభలు జరపాలని ఢిల్లీ అణ్వస్త్ర వ్యతిరేక పౌరకమిటీ నిర్ణయించింది. ఆ తరువాత అక్టోబరు 2న పెద్ద బహిరంగసభ జరుపుతారు. అందులో ప్రసంగించవలసిందిగా రాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని నెహ్రూ, శ్రీ డాంగే, మొదలగు ప్రముఖులకు విజ్ఞప్తులు పంపారు.

25 నుండి వారం పొడుగునా ప్రభాతభేరీలు, వీధి మొగసభలు జరుగుతాయి.

చివరిరోజున, అంటే గంధీ జయంతి నాడు నిరాయుధీకరణ దినోత్సవం జరుపుతారు. ఆరోజు పెద్ద ఊరేగింపు కూడ ఏర్పాటు చేస్తున్నారు.

నేడు జరిగిన పౌరకమిటీ సమావేశానికి కాంగ్రెస్ మాజీఅధ్యక్షుడు శ్రీ యు. యన్. ఢేబర్ అధ్యక్షత వహించారు.

కేంద్ర భారత్ సేవక్ సమాజ్ జన జాగరణ విభాగ కార్యదర్శి శ్రీ చక్రధర్ అగర్వాల్‌ను, అఖిలభారతశాంతిసమితి ప్రధాన కార్యదర్శి శ్రీ రమేశచంద్రను కమిటీసమావేశకర్తలుగా నేటి సమావేశంలో నిర్ణయించారు.

తిరుపతి కో. అ. స్టోర్సులో రు 30 వేల లోటు

తిరుపతి, సెప్టెంబరు 19

చిత్తూరుజిల్లా తిరుపతి టవున్ కో ఆపరేటివ్ స్టోర్సులో ఆడిట్ చేసినప్పుడు రు 30,000 లోపించినట్లు తెలియవచ్చినది.

గుంతకల్లు నూలుమిల్లులో ఐఎన్‌టియుసి.దౌర్జన్యాలకు జనరల్ మేనేజర్ రక్షణ

ప్రభుత్వం కలుగజేసుకొని శాంతి నెలకొల్పాలని ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుని విజ్ఞప్తి

గుంతకల్లు, సెప్టెంబరు, 20

గుంతకల్లులోని ఆంధ్ర కో-ఆపరేటివ్ సొసైటీకి చెందిన నూలుమిల్లులో, ఐ. ఎన్. టి. యు సి. కి అనుబంధించిన నేషనల్ టెక్స్‌టైల్ వర్కర్సు ఫ్రంటు రౌడీలు బాకులు, ఆయుధాలు ధరించి మిల్లులోనూ, పరిసరాల్లోనూ దౌర్జన్యాలకు తలపడి భయ వాతావరణాన్ని కల్గిస్తున్నందున ప్రభుత్వం కలుగజేసుకొని అరికట్టాలని కోరుతూ, గుంతకల్లు టెక్స్‌టైల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు శ్రీ ఎ. కె. ఆదినారాయణరెడ్డి ఎం. ఎల్. ఏ. గారొక ప్రకటన చేశారు.

వారి ప్రకటనలో యిలా వుంది:

"ఈ నెల 10 వ తేదీ నుండి గుంతకల్లులోని ఆంధ్ర కోఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లు దగ్గర రిజర్వు పోలీసులు పహరా వుంటున్నారు. ఆరోజు రాత్రి రెండవ షిఫ్ట్‌నుండి ఇంటికి వస్తున్న బికారి పాటును ఐ. ఎన్. టి. యు. సి. కి అనుబంధించబడిన నేషనల్ టెక్స్‌టైల్ వర్కర్సు ఫ్రంట్ రౌడీలు తమ సంఘానికి డబ్బు ఇవ్వలేదని బాకుతో పొడిచారు. ఆ రౌడీలు తప్పతాగి బాకులు పట్టుకొని మిల్లు గేటు ముందు నిలబడి నానా హంగామా, చేసి నట్లు, ఒక సూపర్‌వైజర్‌ని చంపుతామని బెదిరించినట్లు తెలిసింది. రెండవ సంఘానికి చెందిన కార్మికులు భయపడి అదనపు పోలీసు సహాయమువచ్చిన తరువాతగాని బయటికి రాలేదు. ఈ ఘటనలలో ప్రధాన పాత్రవహించిన నేషనల్ టెక్స్‌టైల్ వర్కర్సు ఫ్రంట్ నాయకుడు గంగారాం అనే వ్యక్తి 31-1-62 నుండి పోలీసులకు పట్టుబడకుండా వుంటున్న విషయం గమనార్హం. ఇతనిపై అరెస్టు వారంటు కూడా వున్నది.

ప్రస్తుత వాతావరణం మిల్లులో చాలా భయోత్పాతంగా వుంది. ఈ అల్లర్లు తగ్గిపోతాయనే విశ్వాసం పట్టణప్రజలలో ఎవరికీ లేదు.

నేషనల్ ఫ్రంటుకు చెందిన కొందరు తప్పతాగి మిల్లులో పనిచేయుటానికి వచ్చి నిత్యమూ కార్మికులను కొడుతున్నారు. బాకుతో నిర్భయంగా పొడుస్తున్నారు. సూపర్‌వైజర్లుకూడా తిరుపని నిర్వహణలో ఈ రౌడీలకు లొంగి వుండక తప్పడంలేదు.

జనరల్ మేనేజర్ పాత్ర

ఈ ఘటనలు అన్నీ ప్రస్తుతమున్న జనరల్ మేనేజరుకు తెలుసు. కార్మికులు వ్రాతపూర్వకంగా కూడా ఈ ఘటనలనుఅతనికి తెలియజేసుకొన్నారు. ఇంత అరాచకము జరుగుతున్నప్పటికీ, జనరల్ మేనేజరు తీవ్రచర్యలు తీసుకోవడానికి నిరాకరించడమే గాక ఆ దౌర్జన్యాలకు అన్నివిధాల రక్షణ కలుగజేస్తున్నారు.

మిల్లులో ప్రస్తుత వాతావరణము చాలా అపాయకరంగావుంది. ఏ క్షణాన్నైనా తీవ్రపరిణామాలకుదారితీస్తుంది. ఈ మిల్లులో శాంతి యేర్పడాలంటే (1) ప్రభుత్వం తక్షణం ప్రస్తుత జనరల్ మేనేజరును అక్కడినుండి తొలగించి, అతని ప్రవర్తనను గురించి బహిరంగ విచారణ జరపాలనీ, (2) మిల్లులో శాంతి యేర్పడడానికి ప్రభుత్వముపూనుకోవలసిందిగాను కోరుతున్నాను."

ఫ్రంట్ కార్యకర్త రాజీనామా

ఫ్రంట్ మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. పి. వీరయ్యగారు, ఫ్రంట్ దౌర్జన్య చర్యలకు విసిగి అందులోని తన ప్రాథమిక సభ్యత్వానికి 16 వ తేదీన రాజీనామానిస్తూ ఒక కరపత్రం ప్రచురించారు (వి. వి)

'శ్రీ నెహ్రూతో సమావేశానికి సిద్ధంగా వున్నాను'

అయూబ్‌ఖాన్ ప్రకటన

ఒట్టావా, సెప్టెంబరు 21

కాశ్మీర్ 'వివాద' పరిష్కారానికి ప్రధాని నెహ్రూను ఎప్పుడు పడితే అప్పుడు కలుసుకొని సంభాషించడానికి తాను సిద్ధంగా వున్నానని పాక్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ నేడిక్కడ పత్రికలవారితో అన్నారు.

"శాంతియుత మార్గాలు మన స్వాధీనంలో వుండగా దీర్ఘకాలంగావున్న వివాదాన్ని పరిష్కరించేందుకు రెండు ఇరుగుపొరుగుదేశాలు యుద్ధానికి పూనుకోవనే ఆశిస్తున్నానన్నారు".

మిడతలదండు

లండన్, సెప్టెంబరు 21

మిడతలదండు దక్షిణ పర్షియా, ఇరాన్, ఓమన్, తూర్పు సౌదీ అరేబియాల పైకి దాడి వెడలవచ్చునని ఐరాస సమాచారశాఖ నేడిక్కడ ప్రకటించింది. అక్టోబర్ నవంబర్ మాసాల్లో భారత-పాకిస్తాన్‌లలో ఈ దండు ఎక్కువగా గుడ్లు పెట్టవచ్చునని కూడా ఆ నివేదికలో వుంది.

మా తండ్రిగారు శ్రీయుత గోగినేని వెంకట సూర్యనారాయణగారు ది 20-9-62వతేది గురువారం ఉ॥ గం॥ 1.45 లకు స్వర్గస్థులైరి. ది 29-9-62 తేదీ శనివారం మానికొండలో పెద్ద కర్మ జరుగును.

ఇట్లు,

గోగినేని గోవర్ధనరావు

అందరూ మెచ్చుకొంటున్న చిత్రం.

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ చిత్రం..

కులగోత్రాలు

కథ-దర్శకత్వం: K. ప్రత్యగాత్మ * నవయుగ

తిరుతెన్నులు

"దొంగతనంలో దొరతనంలో భాగ్యవంతున కేదైన బాధలేదు"

క్యాన్సర్ వ్యాధికి మామూలు ఆపరేషన్ పనికిరాదు. ఆ పనిజరిగితే అది విజృంభిస్తుంది. కంచెయే చేను మేసినట్లు మనిషితనే ఆహారాన్ని అదే తిని పెరుగుతుంది. అవసానదశలోగాని దాని వికృతరూపం వికటాట్టహాసం కనుపించవు.

అలాగేవున్నది నేడు సమాజాన్ని పీడిస్తున్న వ్యవస్థ. సంస్కరణలు, సంస్కరణలని తెలపోసి తెలపోసి ప్రజలపై ప్రేమలొలకపోసి చేసినవన్నీ ఆచరణలో బూడిదలోపోసిన పన్నీరుగా తయారవుతున్నాయి.

పెరిగినవి చాలా వున్నాయి సమాజంలో. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశానికి గౌరవం పెరిగింది. దేశంలో జనం పెరిగారు. పరిశ్రమలూ, పంటలూ పెరిగాయి. ఆదాయం పెరిగింది. కాని వాటితోటే పెరిగాయి కష్టాలు. పరిపాలనా వ్యయం పెరిగింది. పన్నులూ, ధరలూ పెరిగాయి. అన్నింటినీ తలదన్ని పెరిగింది అవినీతి. ధర్మం నాలుగు పాదాల అమలు జరగాలని ఊహించారు పూర్వీకులు. మనమూ కోరుకుంటున్నాము దాన్నే. నాలుగుపాళ్లు గాదు మూడు పాళ్లు అమలుజరిగినా మురిసిపోవచ్చు మనం. అర్థపాలు జరిగినా ఆత్మసంతృప్తి కలగవచ్చు పాలకులకు. కాని అదీ ఇదీ వృథ్యమే. ఇప్పుడు ఒక పాలు జరుగుతున్నదా అన్నదే సందేహం.

విజ్ఞానానికి విలువ హెచ్చింది. నాగరికత పెరిగింది. కాని వాటిని ఆదుకొనే న్యాయం, వ్యవస్థా ఏర్పడలేదు. అజ్ఞానం అధికం అవుతోంది. పెట్టుబడిదారీ వ్యవస్థపట్టి పీడిస్తోంది, సమాజాన్ని. వెనకటి కాలంలో పెట్టుబడిదారీ విధానం పెరుగుతున్నకొలదీ అందరూ బాగుపడకపోయినా అదొక నూతనత్వం వైపుకు మరలుతున్నామనైనా ఆనాటి ప్రజలనుకొనేవాళ్లు. ఆ కాలం గడిచిపోయింది గతశతాబ్దంతోటే. అప్పుడు పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేసిన పాశ్చాత్య దేశాలకే దక్కింది దాని ఫలితం. ఇప్పుడు అక్కడే గాదు ప్రపంచంలో ఎక్కడున్నా పెట్టుబడిదారీ విధానం మొత్తంగా సంక్షోభంలో వుంది. దానిలో భాగంగానే వున్నాం మనం. నూతన జ్యోతి సోషలిష్టు విధానంలో వెలుగుతోంది. ఆ వెలుగును ప్రజలకు చూపి పబ్బం గడుపుకో చూస్తున్నది పెట్టుబడిదారీ విధానం. అందుకే కాకి నెమలియీకలు ధరించినట్లు సోషలిస్టు నామధేయంతో పెట్టుబడిదారీ పద్ధతి నాట్యమాడాలని ప్రయత్నిస్తోంది. కాని దాని బ్రతుకు తెలియందెవరికి! క్షీణదశలోనున్న పెట్టుబడిదారీ విధానం యవ్వనంలో పాశ్చాత్య దేశాల్లో నాట్యమాడినట్లు నాట్యమాడగలదా? అందుకే అది నేడు నాట్యంగాకాక వికృతంగా మన సమాజంపై వికటాట్టహాసం చేస్తోంది నేడు.

అంతఃకరణ అదృశ్యం

"అంతఃకరణ నేతోల్లోయినవాడికి లోని విలువంటూ ఏమీ లేదన్నాడు" ఒక మహనీయుడు. ప్రస్తుతం మన సమాజమూ అదేఅవస్థ పాలైనట్లున్నది.

మహాకవి గురజాడ గారి శతాబ్దం క్రితలోనూ, యీ శతాబ్దారంభంలోనూ ఆ నాటి సమాజంలోగల కుళ్లంతటినీ వెదికిపార వేయడానికి కలం పట్టారు. నీతి పేరిటగల అవినీతినీ, ఆచారం పేరిట జరిగే అనాచారాన్నీ, న్యాయం పేరిట జరిగే అన్యాయాన్నీ 'కన్యాశుల్కం'లో చిత్రించి చూపెట్టారు. నేడు అలాంటివే ఎన్నో జరుగుతున్నాయి దేశంలో.

ఆమధ్య దాపుడుబంగారంపై ఆర్థిక మంత్రి మొరార్జీ తమ కన్ను వేశారు. దాగిన బంగారం బైటకు రావచ్చునన్నది ఆయన ఆశ. కాని లోకానుభవం గల వారప్పుడే చెప్పారు దానికి జోస్యం. మొరార్జీ ఆమాట అననే అన్నారు గనుక ఇదివరకు అలంకారయుతంగా వడివీధిలో తిరిగే బంగారం కాస్తా అండర్ గ్రౌండుకు పోవాలని పిలుపు ఇవ్వడంగా దాన్ని జమకట్టారు.

మద్యపాన నిషేధం అమలు జరగాలన్నది సంస్కరణ. కాని దాని మూలంగా పెరిగింది మద్యపానం. మంచి మద్యంపోయి దొరుకుతోంది దొంగసారా. అందుమూలంగా పెరుగుతోంది లంచగొండితనం. దానివల్ల రోగులకు దొరక్కుండా పోతోంది అమోనియా. ఒకమద్యపానాన్ని చట్టం ద్వారానిషేధిస్తే అనేకవిధాలుగా నీతి చట్టాలు ధిక్కరించ బడుతున్నాయి. నేరం తగ్గుతుందని వాదన. అది పెరిగింది సత్యం. పవిత్రమైన నీరా త్రాగమని పర్మిట్లు ఇస్తే అదంతా కల్లుగా వర్ధిల్లుతోంది. త్రాగుడు ఆగిందెక్కడో, పాలకుల బుర్రల్లో తప్ప.

ఒకటేమిటి? ఏరంగం లోపల ఏ అంశాన్ని తీసుకున్నా ప్రదర్శితమవుతుంది యీ దృశ్యం. కట్నాలపై నిషేధం వున్నది; కాని, వర్ధిల్లుతున్నవి కట్నాలే.

అంటరానితనంపై నిషేధంవున్నది; కాని,అది పూర్తిగా పోయిందని చెప్పకునేందుకు యీ దేశంలో "పట్టుమని పది గ్రామాలున్నాయా" అని సవాల్ చేస్తున్నారు శ్రీ జగజీవనరాం.

"పేరుగొప్ప, ఊరుదిబ్బ"

పంచాయతీ రాజ్యానికి పేరు మహాగొప్పగావుంది. ఆంధ్ర దేశంలో అది ముందు అమల్లోకి వచ్చిందని మనం మురిసిపోతే పండిత నెహ్రూగారు పరమానంద భరితులయ్యారు. ఈనాడు మన దేశంలో సకలవిలక్షణధారిగా వెలిసింది "పంచాయతీ రాజ్యం"అన్నట్లులండన్ లోకే శ్రీ నెహ్రూ ప్రకటించారు.

కాని ఆ పంచాయతీ రాజ్యమున్నది అధ్వాన్నంగా వున్నదనీ, దానిలో ప్రజలపాత్ర, శ్రద్ధా సన్నగిల్లిందనీ రాష్ట్ర ప్రణాళికమంత్రి శ్రీ చెన్నారెడ్డి ప్రసంగించారు. ఈ విషయాన్ని కొంచెం లోతుగా పరిశీలిద్దామని విశాలాంధ్ర విలేకరి నల్లగొండజిల్లాలో తిరిగి స్పష్టమైన ఫోటో సేకరించి మనముందుంచాడు. "మేడిపండుచూడ మేలిమైయుండు" నన్న వేమన వాక్యము స్ఫురణకు తెస్తోంది పంచాయతీ రాజ్యం నడుస్తున్నతీరు.

ఓట్లుకొనడంతో పంచాయతీలు యీసారి ప్రారంభమైన విషయం జగద్విదితం. వేలతోకొన్న ఓటువున్నది. లక్షలు ఖర్చుచేసిన గ్రామాలువున్నాయి. సమితులకు సభ్యులను దాచి, కొని, కో-ఆప్టుచేసుకొని ఎన్నికలు జరిగాయి. ఇన్ని అవాంతరాలూ దాటి ప్రతిపక్షం సంఖ్యాబలాన్ని సాధిస్తే సమితి ఎన్నికలకే వీలులేకుండా పెట్టినట్లు తెలిసింది. జిల్లా పరిషత్తుల్లో తమ స్థానాలు తగ్గి రెండు లవుతాయనుకుంటే ఇల్లుటానికి పంపిన అభ్యర్థులతో, ఎకుమతి చేసిన బానిసలతో పెద్దాదిన్నా తాగలిమ్యాం లేకుండా పెద్దమనుషుల్నే ఏ జిల్లావాడనిగాక, వీటిల్లాలో తమకు మెజారిటీ కొంతగా వుండో చూసి, అక్కడి పరిషత్తులో సభ్యత్వం కల్పించిన కథలు గుర్తుండే వుంటాయి.

ఇన్ని చేసినా పర్యవసానం ఏమైనా ప్రజకు అనుకూలంగా వుండాలన్నదే మన ఆవేదన. అదే కొరతగావుంది ఆచరణలో.

డబ్బులుమ్మేందుకు అనేక రూపాలేర్పడ్డాయి. కాని ఫలితాలు ముట్టడం దాకే ఖజానా మాత్రం ఖాళీ అవుతూంటుంది. బావులకు సబ్సిడీలు, బావులు రిపేరుకు సహాయాలూ తక్కావి అప్పులూ, రకరకాలా వున్నాయి. కాని పలుకుబడి వున్నవాడికి పాతబావితోనూ పనిలేదు, కొత్త బావిని తవ్వే అవసరమూలేదు. అన్ని అప్పులూ ముడుతూంటాయి.

కోళ్ల పెంపకానికో కొక్కిరాయిల పెంపకానికో అప్పులు అని ఇవ్వడం ఒక పాతిక మంది పేర్లతో ఒక్కడే దాన్ని పుచ్చుకొని కోడిలేదు కొక్కిరాయీలేదు, పశువుల్ని కొనుక్కోవడం జరిగిందని విన్నాం.

పేరు దంపుడు బియ్యం. కాని ఆ పేరిట ఒంటిపట్టు మిల్లు బియ్యం ఇవ్వని చోటు దొరకదు. శుద్ధఖద్దరుకు కావలసినంత నిధిసమర్పణలున్నాయి. కాని శ్రీ ఖద్దరు దొప్ప దొరకదు. అంతకంటె ప్రేమ దేమమంటే అసలు ఖద్దరు భాండారమే ప్రభుత్వ బొక్కసానికి తూట్లు పొడిచే బండారంగా తయారైంది. నేతసాపై టీలకు రిబేట్లు ఇస్తే, అసలు వస్త్రం తయారచేది లేకుండానే జమాఖర్చు లెక్కలు జూపి రిబేట్లు పుచ్చుకున్న ఉదంతాలుబోలెడు.

కల్తీఅనేది ఖద్దరులో ప్రవేశించడమే గాదు. ఒనరులు జాస్తియనకొలది దేశభక్తులలోనే కల్తీ ఏర్పడ్డది. మాన్యం దొరుకుతుందనో, ధరణం వస్తుందనో, జైలుకు పోకపోయినా పోయినట్లు దొంగ సర్టిఫికెట్లు పుచ్చుకున్నవారెందరోలేరు.

పంచాయతీ కృషిలో ప్రజల సహకారం అన్నది పెద్దగా మారుమోగింది. తీరా చూస్తే నూటికి కోటికి ఒక్కటో అరో విషయానికి మినహాయిస్తే శ్రమదానమూ లేదు; భూదానమూ లేదు. ఎక్కువ అంచనా వేయడం, ఎక్కువని జరిగినట్లు లెక్క చెప్పడం అందుకు ప్రభుత్వం నుండి వచ్చిన డబ్బుతోనే, ప్రజల భాగంతో నిమిత్తం లేకుండా, పని ముగించుకోవడంసర్వసామాన్యం. ఏదో ఒక రూపంలో పని జరిగిందని సంతోషించవచ్చుకాని అవినీతి పెరుగుతోందిగదా! ప్రజలకు లేనిపుణ్యాన్ని ఉన్నట్లు చూపి పైనుంచి ఊరకు గొట్టడం జాస్తి అవుతోందిగదా!

యోగ్యతతో పంచాయితీ ప్రెసిడెంటుగా కాలంగడపాలనుకున్న వాడికి అసమర్థుడన్న బిరుదు రాకుండా పోయేస్థితి ఒకటి తయారైంది. పర్మిట్ కూడా లంచమిస్తేగాని చిక్కదు. చేతికి రాదు. అగ్గిస్తేగాని పనిజరగదు. ఇవ్వని వని ఛీకొడుతుంటే పని జరిగేదీలేదు. పైగా పైన చెప్పిన బిరుదూ తప్పదు. కంత ద్రవ్యంగా వున్నది వాళ్లపని.

రాష్ట్రంలో రసాయనిక ఎరువులకోసం తహతహ జాస్తయింది. అవంగునే ఆ ఎరువుల్లో కల్తీ కలిపి పంపుతున్నారు, టోకు వ్యాపారులు. సమితులు సొసైటీలద్వారా పంపకం జరుగుతుందని చూస్తే అన్నిటితంతుగానే, అక్కడే చోట్ల స్వార్థపరులు కొన్నేసి సింధంగా దొంగమార్కెట్టులో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రభుత్వానికి స్థానిక అధికార శాఖలున్నట్లే, పాలకవర్గ పార్టీకి పైనుంచి క్రింది దాకా శాఖోపశాఖలుగా పనిచేస్తున్న ఏజంట్లు ఏర్పడ్డారు. అధికారంలో యీ ఏజన్సీలకు భాగం దొరికింది. అదే వికేంద్రీకరణ అని చలామణీ అవుతోంది.

సోవియట్ యూనియన్ లో కమ్యూనిస్టు పార్టీ కూడా ప్రభుత్వాంగాలకు యీ విధంగానే తోడుగా వుంటుందిగదా అనవచ్చు ఎవరైనా. కాని ఉన్నదొకే తేడా. అక్కడ కమ్యూనిస్టు పార్టీ శాఖలు సమిష్టిగా నిర్ణయించి శాసనాలను అమలు జరపడానికి తోడ్పడతాయి. ఎవరికి వారు వ్యక్తిగా కొట్టివేయడానికి అవకాశాలు లేవు. సమిష్టి నిర్ణయాలు సంఘ శ్రేయస్సుకు తోడ్పడకుండా వుండవు. కాని ఇక్కడో పాలకవర్గ పార్టీని అంటిపెట్టుకొని పైనుండి క్రిందిదాకా పానకాలరాయుళ్ళు తయారయ్యారు.

ప్రభుత్వయంత్రాంగాలను మామూలు పద్ధతిలో సాగనివ్వకపోవడం, అధికారంలో పాలు పంచుకోవడం, అధికారులను వశంచేసుకోవడం, వాళ్ళూ వీళ్ళూ కలిసి అధికారాన్ని దుర్వినియోగం చేయడం జోరుగా సాగిపోతోంది.

"ధనమూల మిదం జగత్తు"

ధనం కొద్దిమంది చేతుల్లో గుట్టలు పడుతోంది. పెట్టుబడిదారీ సమాజంలో "మనిషికీ మనిషికీ మధ్య డబ్బుకు మించిన బాంధవ్యం ఏదీ లేద"న్నాడు మార్క్స్ మహాశయుడు. "ధనమూల మిదం జగత్తు" అన్నారు మన పెద్దలు ఇప్పుడు. డబ్బుంటే సరి, కొండమీద కోతి దిగివస్తోంది. అదిలేని వాడు నయాపైసాకు కొరగాకుండా వున్నాడు. ఎక్కువ డబ్బున్నవాడు తక్కువ డబ్బున్నవాణ్ణి పెద్ద చేప చిన్న చేపను మింగినట్లు అట్టే మింగేసే వేయడానికి అవకాశాలు ఏర్పడ్డాయి.

పెట్టుబడి పెట్టగలవాడికే పరిశ్రమ పెట్టే వీలుంది. లంచమిచ్చినవాడికే లైసెన్సు. డబ్బున్నవాడికే పలుకుబడి వుంది. పరపతీ వుంది. ప్రభుత్వమూ అప్పిస్తుంది. ఇదంతా కలుపుకొని ఎంత పెద్దవాడైతే అంత ఎక్కువగా విదేశీ గుత్తకంపెనీలు అతనితో చేతులు కలిపి వ్యాపారం చేయడానికి సిద్ధం. తాతా బిర్లాలకున్న అవకాశాలు ఇంకెవరికి కలుగుతాయి. ఎక్కువ పెట్టుబడిగలవాడి ముందు తక్కువ పెట్టుబడిగలవాడెందుకు పనికివస్తాడు? అందుకే ఆ పెట్టుబడిని సంపాదించడంలో ఈనాడు దయా, దాక్షిణ్యం, స్నేహం, బంధుత్వం ఏవీ పనికిరావడంలేదు. అందుకు ఉపయోగించేది మోసం. అదే వర్ధిల్లుతోంది దివ్యంగా.

డబ్బున్నవాడిదే రాజ్యం. అదే అన్ని రంగాల్లోనూ వ్యక్తమవుతోంది. డబ్బున్నవాడే లంచమివ్వగలడు లంచాలు మరిన వాడికి డబ్బున్నవాళ్లే కన్నులపండుగ. వాళ్ళమాటే వీళ్ళ వీనులకు ఇంపు. అందుకే ఒనరులు వాళ్ళ స్వాధీనంలోకే వస్తాయి. చివరకు జీవితమే వ్యాపారం అయిపోయింది.

ధర్మ ఆస్పత్రులన్నీ పేరుకే గాని డబ్బుంటేనే అక్కడా వెంటనే వైద్య చికిత్స దొరుకుతుంది.

అందరూ చదువుకోవచ్చు శాస్త్రం ప్రకారం. తిండికే లేనివాడు బిడ్డకు చదువెలా చెప్పిస్తాడు? చెప్పించినా మామూలుజీతం కాక ట్యూషన్ ఎక్కడి పెట్టిస్తాడు? అసలు చదువుకంటె ట్యూషను చదువుకే మార్కులు ఎక్కువ వస్తున్న రోజుల్లో సామాన్య విద్యార్థికి మార్కులెలా వస్తాయి? ఆ మార్కులు రాకుండా కళాశాలల్లో సీటెలా వస్తుంది? చాలని మార్కులు వచ్చినా సీటు సంపాదించడానికి అతనికి డొనేషన్ కట్టే సత్తాను ఎవడు కలిగించేట్టు? ఇవన్నీ లేకపోగా సామాన్యులెందరు సమాజంలో పైకివస్తారు?

కనుక దరిద్రుడికి అన్నీ బాధలే. "దొంగతనములో దొరతనములో భాగ్యవంతున కేదైన బాధలేదు." అదే నేటి సమాజం వర్ధిల్లుతున్న విధం!

—రవి

గురజాడ శతజయంతి ఉత్సవాలు ప్రారంభం

మహాకవి ప్రతిభా విశేషాలను కీర్తిస్తూ పలువురి ప్రసంగాలు

హైదరాబాదు, సెప్టెంబరు 21

గురజాడ వారి శతవార్షికోత్సవం నేటి సాయంత్రం రవీంద్ర భారతిలో ప్రారంభమయింది.

దేశభక్తి గీతంతో సభ ప్రారంభమయింది.

శ్రీ దేవులపల్లి రామానుజరావు సదస్యులకు స్వాగతం చెప్తూ యిలా అన్నారు:

"గత సంవత్సరం దేశమంతా రవీంద్రుని జయంత్యుత్సవాలు జరిపాం. ఈ సంవత్సరం, ఆయన సమకాలికుడు, సమాన ప్రతిభావంతుడు అయిన శ్రీ గురజాడ అప్పారావుగారి శతజయంత్యుత్సవాలు జరుపుకున్నాం.

ఒక తెలుగుకవి జయంత్యుత్సవాలు జరపడం ఇదే ప్రథమం. ఇది ఆంధ్ర ప్రజానీకానికంతటికీ గర్వకారణం"

తరువాత శ్రీ బూర్గుల రామకృష్ణారావు గురజాడ వారి చిత్రపటానికి కర్పూర నీరాజనాలందించి సభకు ప్రారంభోత్సవం జరిపారు.

ఆయన తన ప్రసంగంలో ఇలా అన్నారు:

"శ్రీ గురజాడ ఉత్సవంజరపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవడం ముదావహం. అందుకు ఉభయ ప్రభుత్వాలను అభినందిస్తున్నాను.

మహాత్ములలో వెనుక చూపువారు, ముందుచూపువారు ఉంటారు. వెనుక చూపువారు గతాన్ని గురించి ఆలోచిస్తారు. ముందు చూపువారు భవిష్యత్తునుగురించి ఆలోచిస్తారు. వారే ప్రజలకు దారి చూపగలరు. అప్పారావుకు ముందు చూపువుంది. దానికి "దేశమును ప్రేమించుమన్నా" అనే గేయమే తార్కాణం.

తరువాత సభాధ్యక్షులు శ్రీ అప్పారావు ప్రసంగించారు.

సభ దిగ్విజయంగా జరగాలని రాష్ట్రపతి డా॥ రాధాకృష్ణ సందేశం పంపారు.

జయంత్యుత్సవ సంఘ కార్యదర్శి శ్రీ బోయి భీమన్న వందన సమర్పణతో సభ ముగిసింది.

నారాయణగుడ బాలికల పాఠశాలలో

హైదరాబాదు, సెప్టెంబరు 21

నారాయణగూడ బాలికల ఉన్నత పాఠశాలలో గురజాడ శతజయంత్యుత్సవాల సందర్భంలో సభ జరిగింది. సభకు రచయిత, ఆంధ్ర విశ్వసాహితీ అధ్యక్షుడు శ్రీ పోతుకూచి సాంబశివరావు అధ్యక్షత వహించారు.

శ్రీ సాంబశివరావు తమ ప్రసంగంలో గురజాడ ప్రతిభావ్యుత్పత్తులను గూర్చి ప్రసంగిస్తూ, ఆయన తన రచనల ద్వారా ఆంధ్రిలో సాంఘిక విప్లవానికి, సాంస్కృతిక పునరుజ్జీవనానికీ పాటుపడిన మహాపురుషుడని ఉగ్గడించారు.

రాష్ట్ర శాసనమండలి అధ్యక్షుడు శ్రీ మాడపాటి హనుమంతరావు మొదలగు ప్రముఖులు సభకు వచ్చారు.

అంతకుముందు విద్యార్థి యూనియన్ అధ్యక్షురాలు కుమారి సన్నలత సదస్యులకు స్వాగతం చెప్పారు.

పాఠశాల విద్యార్థినులు కన్యాశుల్కంలోని కొన్ని రంగాలు ప్రదర్శించారు.

యూనియన్ కార్యదర్శి కుమారి అరుణశ్రీ వందన సమర్పణతో సభ ముగిసింది.

విశ్వాంతరాళంలో రేడియేషన్

అమెరికా అణుశక్తి సంఘ ప్రకటన

వాషింగ్టన్, సెప్టెంబరు 21

జూలై 9న పసిఫిక్ ప్రాంతంలో భూమికి చాలపైన ఎత్తున అమెరికా జరిపిన అణుపరీక్షవల్ల విశ్వాంతరాళంలో సరికొత్త రేడియోధార్మిక శక్తి మండలం ఒకటి ఏర్పడిందని ఇది 14 లక్షల టన్నుల టి. ఎన్. టి. శక్తిగల పేలుడు పదార్థంతో సమానమని అమెరికా అణుశక్తి కమిషన్ నేడు ప్రకటించింది.

అక్టోబరు 15 చర్చలకు భారతప్రభుత్వ సంసిద్ధత

పశ్చిమసరిహద్దులో యథాతథస్థితి పునరుద్ధరణ చర్చనీయాంశంగా ఉండాలని చైనాకు సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21

"గత కొద్దిఏళ్ళలో బలప్రయోగం ద్వారా మార్పుచేయబడిన పశ్చిమరంగం (లడఖ్ సరిహద్దు – సం॥) యథాతథ స్థితిని పునరుద్ధరించే చర్యలను నిర్వచించడానికి, ఆ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న ఉద్రిక్తతలను తొలగించడానికి సముచితమైనస్థాయిలో చర్చలు జరపడానికి భారత ప్రభుత్వం సిద్ధంగా ఉంది. యథాతథస్థితి పునరుద్ధరణ చర్యలను అమలు పరచడం ఉభయ ప్రభుత్వాలమధ్య విశ్వాస వాతావరణాన్ని కల్పించి, సరిహద్దు సమస్యపై రెండు ప్రభుత్వాల మధ్యగల విభేదాలను అధికారులు నివేదిక ఆధారంగా పరిష్కరించడానికి నిర్మాణాత్మకమైన చర్చలు సాగించడం సాధ్యం చేస్తుంది"అని భారతప్రభుత్వం చైనాకు తాజాగా పంపిన జవాబులో పేర్కొన్నది.

"యథాతథస్థితి పునరుద్ధరణ చర్చలను అక్టోబరు 15 నుంచి మొదట పెకింగ్ లోను ఆ తరువాత ఢిల్లీలోను జరపడం భారత ప్రభుత్వానికి అంగీకారయోగ్యమే. పై పేరాలోని ప్రతిపాదనలకు చైనాప్రభుత్వంఆమోదం తెలిపిన తరువాత చర్చల వివరాలను సముచితమైన దౌత్యమార్గాలద్వారా చర్చించి పరిష్కరించడానికి భారతప్రభుత్వం చర్య తీసుకొంటుంది" అని భారత పత్రంలో ఉంది.

సెప్టెంబరు 13వ తేదీన చైనాప్రభుత్వం పంపిన పత్రానికి భారతప్రభుత్వం తన జవాబును సెప్టెంబరు 19న ఢిల్లీలోని చైనా దౌత్య ప్రతినిధికి అందజేసింది. భారత ప్రభుత్వ జవాబు పూర్తి పాఠం క్రింది విధంగావుంది:

"సెప్టెంబరు 13వ తేదీనాటి చైనా ప్రభుత్వ పత్రంలోని విషయములు, ధోరణి భారత ప్రభుత్వానికి ఆశాభంగం కలిగించాయి. భారతప్రభుత్వం ఆగస్టు 22వ తేదీ పత్రంలో చేసిన నిర్మాణాత్మక సూచనలను అర్థంచేసుకొనడానికి, మెచ్చుకొనడానికి చైనా ప్రభుత్వం చైనా ప్రయత్నం చేయకపోవడం విచారకరమైనవిషయం. పైగా, చైనా ప్రభుత్వం దౌత్య విరుద్ధమైన భాషను ప్రయోగించింది. బలప్రయోగం బెదిరింపులనుకూడ చేసింది.

చైనా పత్రంలోని ధోరణి, విషయాలదృష్ట్యాను, ఇంతవరకు ప్రశాంతంగాఉన్న భారత చైనా సరిహద్దు తూర్పురంగంలో ఉద్రిక్తతను కల్పించడానికి సాగుతున్న ప్రయత్నాల దృష్ట్యాను, చైనా ప్రభుత్వం శాంతియుత పరిష్కారంకోసం తమ ప్రచారాలను పునశ్చరణ చేస్తూ, తమదురాక్రమణ కార్యకలాపాలను కొనసాగించడానికి, ఏకపక్షంగా సరిహద్దు యథాతథస్థితిని బలప్రయోగం ద్వారా మార్పుచేయడానికి కృతనిశ్చయమై ఉన్నట్లు కనిపిస్తున్నది. తమ దురాక్రమణ విస్తరణ ఉద్దేశాలను నెరవేర్చుకొనడానికి సంభాషణలను చర్చలను కేవలం ముసుగుగా వినియోగించేటట్లు కనిపిస్తున్నది.

చైనాపత్రంలోని రెండవ పేరాలో సరిహద్దు యథాతథస్థితిని చైనా ప్రభుత్వం కాపాడినట్లు వాదించబడిఉంది. ఆగస్టు 22వ తేదీ భారత పత్రంలోని మూడవ పేరా ఈవిషయంలో వాస్తవిక స్థితిని సంగ్రహంగా వివరిస్తుంది. చైనా భారత సరిహద్దు వెంబడి యథాతథస్థితిని భారతదేశంఖచ్చితంగా పాటించిందని, చైనాప్రభుత్వమే ఏకపక్షచర్య ద్వారా, దురాక్రమణ కార్యకలాపాల ద్వారా ఈ యథాతథ స్థితిని మార్పు చేసిందని చెప్పడంలో భారతప్రభుత్వానికి ఏమాత్రమూ సందేహంలేదు. యథాతథస్థితిని'వాస్తవిక ఆధిపత్యంరేఖ'గా చైనా ఇప్పుడు పిలవడం అవాస్తవికం. పరిస్థితిలోని వాస్తవ విషయాలను "నిందా ప్రచారం" లేక "పూర్తిగా అసంబద్ధాల"ని త్రోసిపారవేయడం ద్వారా మార్చలేము.

"ప్రతిదేశానికి తన వైఖరిని వివరించే స్వాతంత్ర్యం, హక్కు ఉంటాయి. సరిహద్దు సమస్యపై చైనా వైఖరిని భారతదేశం ఆమోదిస్తే కాని చర్చలు ప్రారంభం కావడానికి వీలులేదని చైనాప్రభుత్వం ఎన్నడూ చెప్పలేదు" అని చైనా పత్రంలోని ఆరవ పేరాలో చెప్పబడి ఉంది.

నిరాక్షేపణీయమైన ఈ సూత్ర ప్రకటన జరిగినప్పటికీ, గత కొద్ది సంవత్సరాలలో చైనా వారి దురాక్రమణ కార్యకలాపాలద్వారా నెలకొల్పబడిన "వాస్తవిక ఆధిపత్యపు రేఖ"ను ఆమోదించాలని చైనా పత్రంలో చివరంటా వాదించబడి ఉంది. భారత భూభాగంపై రక్షణ కార్యకలాపాలను భారత బలగాలు నిలిపివేయాలని, చైనా తనవని వాదించిన ప్రాంతాలనుండి అవి ఉపసంహరించుకోవాలని సూచించబడింది.

సరిహద్దు సమస్యపై చైనా వైఖరిని ఆమోదించాలని తాము ముందుగా షరతులు పెట్టడం లేదని తాము చేస్తున్న ప్రచారంతో చైనాప్రభుత్వపు ఈ వాదన ఎలా పొసగుతుంది?

తన వైఖరిని వివరించే స్వాతంత్ర్యం హక్కు ప్రతిదేశానికి ఉన్నాయని భారత ప్రభుత్వం అంగీకరిస్తుంది. వాస్తవానికి ఈ పనినే ఉభయదేశాల అధికారులు 1960 నాటి తమ చర్చలలో చేశారు. ఈ పని జరిగిన తరువాత రెండు ప్రభుత్వాలమధ్య విభేదాలు పరిష్కారం కావడానికి చర్చలు ప్రారంభం కావాలంటే ఏకపక్షంగా యథాతథ స్థితిని మార్పు చేయడంవల్ల చెదిరిపోయిన విశ్వాసాన్ని రెండు ప్రభుత్వాలమధ్య పునరుద్ధరించాలి. సరిహద్దు ఉద్రిక్తతను తొలగించాలి. ఉభయపక్షాలు 20 కిలోమీటర్ల (సుమారు 12 మైళ్ళు) వెనుకకు తమ సాయుధ బలగాలను ఉపసంహరించాలని ఈ విషయమై చైనా పత్రం 7వ పేరాలో చేయబడిన ప్రతిపాదనలో తీవ్రమైనదోషం ఉంది. గత కొద్ది సంవత్సరాలుగా ఏకపక్ష చర్యద్వారా యథాతథ స్థితిని మార్పుచేసిన దురాక్రమణదారుడి స్వాధీనంలో దురాక్రమణ ఫలాలను ఉంచివేయడమే ఆ ప్రతిపాదనలోని లోపం. దీనివలన ఉభయ ప్రభుత్వాలమధ్య విశ్వాసవాతావరణం, సుహృద్భావం ఏర్పడజాలవు. సరిహద్దు సమస్యపై రెండు ప్రభుత్వాలమధ్య విభేదాలు పరిష్కరించేందుకు ఫలప్రదమైనచర్చలు జరపాలంటే అట్టి విశ్వాసవాతావరణం, సుహృద్భావం ముందుగా ఏర్పరచడం అత్యవసరం.

భారత ప్రభుత్వం ఆగస్టు 22వ తేదీ పత్రంలో చేసిన సూచనలను చైనా ప్రభుత్వం నిర్మాణాత్మక భావంతో పరిశీలించగలదని భారత ప్రభుత్వం ఆశిస్తున్నది. దౌత్య విరుద్ధమైన భాషా ప్రయోగంద్వారాకాని,బలప్రయోగపు బెదిరింపులద్వారా కాని, "వాస్తవిక ఆధిపత్యపురేఖ"గూర్చి అవాస్తవిక వాదన చేయడంద్వారా కాని సమస్యలను గందరగోళ పరచడానికి చైనా ప్రభుత్వం ప్రయత్నించదని ఆశిస్తున్నది. ఏకపక్ష దురాక్రమణ చర్యద్వారా, అనాదిగా ఉన్న సంప్రదాయ సరిహద్దు యథాతథ స్థితిని మార్చడంద్వారా "వాస్తవిక ఆధిపత్యపురేఖ" నెలకొల్పబడినట్లు ప్రతివారు చూడగలరు. సరిహద్దు సమస్యపై చర్చలు జరపడానికి భారతదేశం నిరాకరిస్తున్నదని చైనా పత్రంలో చేయబడిన నిరాధార ఉద్ఘాటనను భారత ప్రభుత్వం ఖండిస్తున్నది. చైనాప్రభుత్వంతో శాంతియుతమార్గాలద్వారా తమ విభేదాలను పరిష్కరించుకోవాలనీ, ఉభయదేశాల ప్రభుత్వాల మధ్య, ప్రజలమధ్య శాంతియుత, ఇరుగుపొరుగు సంబంధాలను పెంపొందించడానికి శాయశక్తులా కృషిచేయాలని భారత ప్రభుత్వం మనసారా వాంఛిస్తున్నది. కాని భారతదేశ ప్రాదేశిక సమైక్యతను నిర్లంఘనీయంగా కాపాడాలనే భారత ప్రభుత్వపు దృఢనిశ్చయాన్ని నైతిక ప్రవచనాలు, బలప్రయోగపు బెదిరింపులు సడలించలేవు.

గత కొద్ది ఏళ్లుగా బలప్రయోగం ద్వారా మార్పుచేయబడిన పశ్చిమరంగం యథాతథస్థితిని పునరుద్ధరించే చర్యలను నిర్వచించడానికి, ఆ ప్రాంతంలో ప్రస్తుతంవున్న ఉద్రిక్తతను తొలగించడానికి సముచితమైన స్థాయిలో చర్చలు జరపడానికి భారత ప్రభుత్వం సిద్ధంగా ఉంది. యథాతథ స్థితి పునరుద్ధరణ చర్యలను అమలు పరచడం ఉభయ ప్రభుత్వాలమధ్య విశ్వాస వాతావరణాన్ని నెలకొల్పి, సరిహద్దు సమస్యపై రెండు ప్రభుత్వాలమధ్య గల విభేదాలను అధికారుల నివేదిక ప్రాతిపదికపై పరిష్కరించడానికి నిర్మాణాత్మకమైన చర్చలు సాగించడం సాధ్యం చేస్తుంది.

ఛిడాంగ్ ప్రాంతంలో సాయుధ సంఘర్షణపై చైనా నిరసన లేఖ

పారిస్, సెప్టెంబరు 21

ఛిడాంగ్ (ధోలా) ప్రాంతంలో నేటి ప్రభాత కాలంలో భారత-చైనా దళాలమధ్య జరిగిన సాయుధ సంఘర్షణపై చైనా భారత ప్రభుత్వానికి అధికార పూర్వక అసమ్మతి లేఖను పంపినట్లుగా చైనా వార్తాసంస్థ ప్రకటించిన వార్తద్వారా ఇక్కడ తెలియవచ్చింది.

భారత ప్రభుత్వం ఈ సాయుధ దాడులను విసర్జించి, ఛిడాంగ్, ఛిజావో సంతేన ప్రాంతాలనుండి తన దళాలను వెంటనే ఉపసంహరించుకోవాలని చైనా ఈ లేఖలో డిమాండు చేసింది.

భారత ప్రభుత్వంనుంచి ఈ సంఘటనపై క్షమాపణ, నష్టపరిహారాలు కోరడానికి తనకు హక్కున్నదని చైనా ఈ లేఖలో తెలియజేసింది.

భారత ప్రభుత్వం వెంటనే ఈ కోర్కెలను మన్నించనట్లయితే, ఛిజావో సంతేన్ పశ్చిమ ప్రాంతంలో వున్న చైనా సరిహద్దు దళాలను రక్షించడానికి, వెనుక భాగాన వున్న దళాలతో సంబంధాలు తిరిగి ఏర్పాటు చేసుకోడానికి, చైనా ప్రభుత్వం తగు రక్షణ చర్యలు తీసుకోవలసి వుంటుందని ఈ లేఖలో హెచ్చరిక చేసింది.

భారతదళాలు ముట్టడి కాల్పులు సాగించినట్లయితే, చైనాదళాలు ఆత్మరక్షణ చేసుకొంటాయనీ, ఇందుకు భారత ప్రభుత్వమే సంపూర్ణమైన బాధ్యత వహించాల్సి వుంటుందని చైనా ఈ లేఖలో తెలియజేసింది.

పశ్చిమ ఇరియన్ ఒప్పందానికి ఐరాస ఆమోదం

ఐరాస, సెప్టెంబరు 21

పశ్చిమ ఇరియన్ విషయమై ఐరాస ప్రధాన కార్యదర్శి యూథాంట్ అధ్వర్యాన ఆగస్టు 15వ తేదీని జరిగిన ఒడంబడికను అమలు జరిపించే అధికారం ఐరాసకిస్తూ ఐరాస సర్వసభ్య సమావేశం నేడొక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని హాలెండు (డచ్), ఇండోనీషియా దేశాలు కలిసి ప్రతిపాదించాయి.

పశ్చిమ ఇరియన్ పై పరిపాలనాధికారాన్ని హాలెండు ప్రభుత్వంనుండి ఇండోనీషియా ప్రభుత్వానికి మార్చేలోగా ఆ పరిపాలనాధికారాన్ని ఈ తీర్మానం ప్రకారం ఐరాస నిర్వహిస్తూ ఉంటుంది.

ఐరాస తరఫున వేయిమంది పాకిస్తాన్ సైనికులు, పశ్చిమ ఇరియన్ లో స్థానిక పాపువన్ పోలీసులతో కలిసి, శాంతి భద్రతల సంరక్షణ బాధ్యతను నిర్వర్తిస్తారు.

ఈ తీర్మానానికి ఐరాస సర్వసభ్య సమావేశంలో 89 మంది అనుకూలంగా ఓటు చేశారు. ఎవ్వరూ వ్యతిరేకించలేదు. 14 మంది తటస్థులు. తటస్థంగా ఉన్నవారిలో ఆఫ్రికాలోని మునుపటి ఫ్రెంచి వలసదేశాల ప్రతినిధులు ఎక్కువమంది ఉన్నారు.

పోర్చుగల్, దక్షిణాఫ్రికా దేశాల ప్రతినిధులు, మరో మూడుదేశాల వారూ గైరుహాజరయారు.

ఈ తీర్మానంపై ఓటింగు జరగడానికి ముందు ఇండోనీషియా విదేశాంగ మంత్రి డాక్టర్ సుబాండ్రియో ప్రసంగిస్తూ, "అంతర్జాతీయ సంబంధాలను మెరుగుపరచేందుకు పశ్చిమఇరియన్ ఒడంబడిక ఎంతో దోహదకారి" అని అన్నారు.

ఈ ఒడంబడిక ఐరాసకు మరో విజయం చేకూర్చి, ఈ సంస్థ ప్రతిష్ఠను పెంచిందనికూడా ఆయన అన్నారు.

నిరుడు ఈ సమస్యపై తానే మహాసభలో మాట్లాడాననీ, అప్పుడా సమస్యపై సంఘర్షణ వున్నదనీ అన్నారు. ఇప్పుడు తాను తిరిగి ఈ విషయంపై మాట్లాడుతున్నాననీ, ఇప్పుడు సమస్య హాలెండు, ఇండోనీషియాల మధ్య శాంతియుతంగా పరిష్కారమయిందనీ అన్నారు.

ఈ శాంతియుత పరిష్కారాన్ని సాధించేందుకై నిర్విరామకృషి జరిపినందుకు ఐరాస ప్రధాన కార్యదర్శి యూథాంట్ ను ఆయన అభినందించారు.

భారత రక్షణమంత్రి కృష్ణమీనన్ ప్రసంగిస్తూ, పశ్చిమ ఇరియన్ ఒడంబడికను ప్రశంసించారు. పూర్తికాని పని భారతదేశానికి కూడా ఒకటి ఉన్నదనీ, భారతదేశం దీనిని ఏదో ఒకవిధంగా పరిష్కరించుకుంటుందనీ, కృష్ణమీనన్ అన్నారు. ఇదేమిటో ఆయన వివరించలేదు.

పాఠ్యగ్రంథ ముద్రణాలయం కార్మికులపై కక్ష

యూనియన్ నిరసన

హైదరాబాదు, సెప్టెంబరు 21

హైదరాబాదులోని పాఠ్యగ్రంథ ముద్రణాలయం కార్మికులను అధికారులు పెడుతున్న బాధలను, అధికారుల కార్మిక వ్యతిరేక కార్యకలాపాలను తీవ్ర నిరసన తెలియజేస్తూ ప్రభుత్వ ప్రెస్ కార్మికుల యూనియన్ తీర్మానించింది.

యూనియన్ ఆధ్వర్యాన ఖైరతాబాదులో ఈనెల 20న పెద్దసభ జరిగింది. సభకు యూనియన్ అధ్యక్షుడు డా॥ రాజబహదూర్ గౌడ్ అధ్యక్షత వహించారు.

పాఠ్యగ్రంథ ముద్రణాలయంలో కార్మికులను వారి వారి ఉద్యోగాల్లో ఇంకా ఖాయపరచలేదు: 1961 లో నియమింపబడిన ప్రత్యేక కమిటీ కార్మికుల వేతనాలపై చేసిన సూచనలను కూడా ఇంతవరకు అమలు జరపలేదు. ప్రమోషన్ల విషయంలో సీనియారిటీని ఖాతరుచేయడంలేదు. పైఉద్యోగాలకు కొత్తగా బయటివారిని నియమిస్తున్నారు. కార్మికులను డిస్పెన్సరికి వెళ్ళనివ్వటం లేదు.

కార్మికులను ఈ విధమైన ఇబ్బందులకు గురిచేయకుండా వారికోర్కెలను ప్రభుత్వం లక్ష్యపెట్టి మన్నించాలని సభ తీర్మానించింది.

గుండేరు-లక్కబండ ముంపు రైతుల మహాసభ ఈ నెల 23వ తేదీ పగలు 2 గంటలకు బందరు బుట్టాయిపేట హాలులో జరుగుతుంది. బందరు పార్లమెంటు సభ్యులు శ్రీ మండల వెంకటస్వామిగారు అధ్యక్షత వహిస్తారు.

గ్రోమికో ప్రసంగం

(1వ పేజీ తరువాయి)

ప్రస్తావించి ఇలా అన్నారు:

ఐరాస స్థాపక సభ్యులలో అమెరికా ఒకటి. ఆర్థికంగాను, సైనికంగానూ, పెట్టుబడిదారీ దేశాలన్నిటిలోకీ ఎక్కువ బలంకల దేశమది.

ఇటువంటి దేశమూ, దాని పరిపాలకులూ, ఐరాసప్రణాళికను ప్రత్యేకంగా గౌరవించి, తమ విధానాలను తదనుగుణంగా రూపొందించుకోవలసి ఉంది. కాని, క్యూబా విషయమై కెన్నెడీ ప్రకటన అందుకు భిన్నంగా వుంది.

క్యూబాపై దండయాత్ర జరపాలనే వారితో అమెరికా ప్రభుత్వం బహిరంగంగా విభేదించింది. అయినప్పటికీ కెన్నెడీ ప్రకటనను బట్టి చూస్తే, క్యూబాపై దాడి జరిపే హక్కును అమెరికా ఉంచుకుంటున్నదని తేలుతూంది. ఈ దాడి జరపవలసిన అవసరం ఎప్పుడు ఏర్పడేదీ నిర్ణయించే అధికారం కూడా అమెరికా ప్రభుత్వమే ఉంచుకుంటూంది.

ఐరాస ప్రణాళికకు విరుద్ధ ప్రవర్తన

ఇతరదేశాల అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కలిగించుకో కూడదు అనే బాధ్యతను, ఐరాస ప్రణాళిక కింద, అన్ని దేశాలతో పాటు అమెరికా ప్రభుత్వం కూడా స్వీకరించింది. ఆబాధ్యత ఇప్పుడు ఏమయిందని అడగవలసివస్తూంది.

క్యూబా పట్ల అమెరికాలో రెచ్చగొడుతూన్న యుద్ధోన్మాదం గురించి ప్రతినిధులందరికీ తెలిసేఉంటుంది.

ఐరాసలోని ఒక సభ్యదేశంపై దండయాత్ర జరిపే హక్కు తనకు ఉన్నది అని మరొక సభ్యదేశం బాహాటంగా ప్రకటించుకుంటూవుంటే ఐరాస చూస్తూ వూరుకోగలదా?

ఏ దేశమూ కూడా ఇతర దేశాల అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోకూడదు. ఇతర దేశాల్లో, వ్యవస్థలనూ, జీవన విధానాన్నీ అన్ని దేశాలూ మన్నించాలనే నిబంధనే ఐరాసకు ముఖ్యమయిన పునాది. అమెరికా వైఖరి ఈ మూల సూత్రానికే భంగకరం.

యూరప్ ఉమ్మడి మార్కెట్టుపై విమర్శ

యూరప్ ఉమ్మడి మార్కెట్ గురించి ప్రస్తావించి, గ్రోమికో దానిని తీవ్రంగా విమర్శించారు.

"ఆయుధపోటీని తీవ్రం చేయడానికీ, పశ్చిమ జర్మనీలోని ప్రతీకారవాదులను బలపరచడానికీ, ప్రధానంగా ఉపయోగిస్తున్న ఆర్థిక కూటమి ఇది" అనీఆయన అన్నారు.

"వెనుకబడిన దేశాలఆర్థికజీవితాన్ని సామ్రాజ్యవాద దేశాలకు ముడి పెట్టేందుకూ, వెనుకటి వలస దోపిడీ పాలన వారసత్వంగా ఆ దేశాలకు సంక్రమించిన ముడిసరుకులను మాత్రమే ఉత్పత్తి చేసే దుస్థితిలోనే ఆ దేశాలను అట్టిపెట్టి ఉంచడానికి కూడా ఈ యూరప్ ఉమ్మడి మార్కెట్ ని ఒక సాధనంగా ఉపయోగించజూస్తున్నారు. ఈ వెనుకబడిన దేశాలు నిజమైన స్వాతంత్ర్యాన్ని సాధించుకోకుండా, ఈ ఉమ్మడి మార్కెట్ ద్వారా అడ్డుపడజూస్తున్నారని గ్రోమికో అన్నారు.

ప్రపంచవాణిజ్య సమావేశం

ఒక అంతర్జాతీయ వాణిజ్య సంస్థను ఏర్పరచేందుకు అంతర్జాతీయ సమావేశాన్ని జరపవలసిన అవసరం చాల కాలం క్రితమే ఏర్పడిందనీ, ఏలాంటి వివక్షలేకుండా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలూ, అన్ని దేశాలూ ఆసంస్థలో భాగస్వాములుగా ఉంటాయనీ, ఆయన అన్నారు.

జర్మనీ సమస్య

గ్రోమికో తన ప్రసంగంలో జర్మనీ సమస్యగురించి కూడా ప్రస్తావించారు.

జర్మనీ శాంతిసంధిపై సంతకాలకు సోవియట్, తూర్పుజర్మనీ, తదితర దేశాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. తూర్పుజర్మనీకిగల న్యాయమైన హక్కులను ఈ దేశాలు ఎన్నడూ భంగంకలుగనివ్వవన్నారు. అంతేకాదు. సోషలిస్టు దేశాలపై అట్లాంటిక్ సైనిక కూటమి తల్పెంపు చర్యలకు పడమటి బెర్లిన్ ను వేదికగా ఉండనివ్వమని కూడా అన్నారు. పడమటి బెర్లిన్ లో పశ్చిమ రాజ్యాల ఆక్రమణ పాలన కొనసాగడాన్ని, అక్కడ వాటిసేనలు స్థిరపరచుకొని ఉండడాన్నీ కూడ ఈ దేశాలు సహించవన్నారు.

శాంతిసంధిపై సంతకాలు జరిగిన తరువాత, పడమటి బెర్లిన్ తో రవాణా మార్గాలన్నిటిపైనీ తూర్పుజర్మనీ ప్రభుత్వానికే సర్వాధికార మవుతుందని, గ్రోమికో స్పష్టం చేశారు.

ఈ సమస్యను అందరూ కలిసి అంగీకారంతో పరిష్కరించుకోవడమే తమ కోరిక అని సోవియట్ ప్రభుత్వమూ, వ్యక్తిగతంగా ప్రధాని క్రుశ్చేవ్ పదేపదే స్పష్టం చేశారని ఆయన జ్ఞాపకం చేశారు. అందరికీ అంగీకారయిన పరిష్కారం కుదరనప్పుడే, తాము పైని పేర్కొన్న చర్యలు తీసుకోవలసి వస్తుందన్నారు.

మధ్యప్రదేశ్ ప్రజాసోషలిస్టుపార్టీ నుండి వి. వై. తామ్హన్కర్ రాజీనామాయిచ్చి మరికొందరితోసహా కాంగ్రెసులో చేరారు.

పార్లమెంటు వర్షరుతు సమావేశ సమీక్ష

రైలుప్రమాదాలు, వరదబీభత్సం, కల్తీమందుల వల్ల ప్రజలలో భయాందోళనలు

పార్లమెంటు వర్షాకాలపు సమావేశం సెప్టెంబరు 7 వ తేదీతో సమాప్తమైంది. ఈ సమావేశం ముందుకు వచ్చిన సమస్యలు, వీటిపట్ల ప్రభుత్వం అవలంబించిన ఊగిసలాట గమనించదగ్గవి.

శ్రీ కె. పి. సుబ్రహ్మణ్య మీనన్

(పార్లమెంటరీ కమ్యూనిస్టుపక్ష కార్యాలయ కార్యదర్శి)

ఈ సమావేశం నానాటి పెరిగిపోతున్న పన్నులకూ, జీవితావసర వస్తువుల ధరలకూ వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజల నిరసనలు సాగుతున్న సందర్భంలో జరిగింది. మరీ విశేషమేమంటే పార్లమెంటు సమావేశం ప్రారంభమైన రోజున అంటే ఆగస్టు 6 వ తేదీనే లోక్‌సభ సభ్యుడైన శ్రీ హోమీదాజీ (మధ్యప్రదేశ్) ఈ నిరసన పరంపరలో భాగంగా అరెస్టుకావడం. పన్నుల వ్యతిరేకోద్యమంలో పాల్గొన్నందుకు ఆయనను శిక్షించారు. అలాగే యింకా అనేక మంది శాసన సభ్యులు దేశమంతటా అరెస్టయినారు కూడా.

ఇంతకుముందు పార్లమెంటు సమావేశానికి ఈ సమావేశానికి మధ్య వ్యవధిలో దేశంలో అనేక రైలు ప్రమాదాలు జరిగాయి. వందల మంది చనిపోయారు. అనేక మంది గాయపడ్డారు; అంగవైకల్యం పొందారు. దానితో రైల్వేలకూ, దాన్ని నడిపే ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ప్రజల క్రోధాగ్ని మరింత జ్వలించింది. అయినా పార్లమెంటు సమావేశం ప్రారంభంనాడు ఈ విషయాలపై వాయిదా తీర్మానాన్ని పట్టుబట్టడం జరగలేదు. స్పీకర్ భాష్యంతో కూడుకున్న లోక్‌సభ అవకతవక నిబంధనలు సభ్యుల క్రోధాగ్నిని చల్లబర్చేందుకు మాత్రమే పనిచేశాయి.

ఏమైనప్పటికీ, ప్రారంభ సమావేశం తరువాత కొన్ని వారాలకు రైల్వేమంత్రి సర్దార్ స్వరణ్‌సింగ్ ప్రతిపాదించిన అధికార తీర్మానంపై రైల్వే ప్రమాదాల్ని గూర్చి పార్లమెంటు ఉభయ సభలలోనూ చర్చ జరిగింది.

లోక్‌సభలో చర్చను ప్రారంభించిన శ్రీ దినేన్ భట్టాచార్య రైల్వే శాఖ పనిచేస్తున్న తీరును చాలా ఘాటుగా విమర్శించారు. రైల్వే పనివారలపై ప్రభుత్వమూ, ఇతర్లు చేస్తున్న అసంబద్ధమైన దాడిని ఆయన ఖండించారు. పాత నిరంకుశాధికార ధోరణిలోనే వ్యవహరిస్తున్న రైల్వే మంత్రిత్వశాఖ విధానాలు సమూలంగా మార్పు చెందినంత వరకూ రైలు ప్రమాదాల సంఖ్యను తగ్గించడం సాధ్యం కాదని శ్రీ భట్టాచార్య స్పష్టం చేశారు.

రాజ్యసభలో ఇదే సమస్యపై జరిగిన చర్చలో పాల్గొన్న శ్రీ పి. కె. కుమారన్ (ఈయన రైల్వే కార్మిక నాయకులలో ఒకరు) రైలు ప్రమాదాలకుగల కారణాలను విపులంగా వివరించారు. రైల్వే అధికారుల నిర్లక్ష్యపు ధోరణి క్షమించరాని అలసత్వం, వారి కార్మిక వ్యతిరేక విధానాల మూలంగా రైలు ప్రమాదాలెలా సంభవిస్తున్నాయో వివరించారు.

ప్రాముఖ్యతలేని సమావేశం

ఏమైనప్పటికీ పార్లమెంటు ఉభయ సభల్లో చర్చలవల్ల వచ్చిన ఫలితం బహు తక్కువ. చర్చకు మంత్రి యిచ్చిన సమాధానాలు చూస్తే రైల్వేశాఖలో హృదయ పరివర్తన వచ్చినట్లు సూచన ప్రాయంగానైనా అవుపించదు. పైగా రైల్వే ప్రమాదాలపట్ల ప్రభుత్వం అతి నిర్లక్ష్య వైఖరిని, తనకు న్యాయధర్మబద్ధులం లేనట్లు బూటకపు అభిమానాన్ని, పెడసరి వైఖరినీ ప్రదర్శిస్తోందన్న అభిప్రాయం సభ్యులలో బాగా ఏర్పడింది.

1956 లో రైల్వేమంత్రి శ్రీ శాస్త్రి తన పదవికి రాజీనామా ఇవ్వడానికి అంగీకరించారు. కాని 1962 లో రైల్వేమంత్రి ముఖంలో, తన శాఖ అసమర్థతకూ, నిర్లక్ష్య వైఖరికి గాను సిగ్గు ఛాయలన్నా అవుపించలేదు.

ఈ మధ్య కాలంలో, సభ్యుల పార్లమెంటరీ ప్రవర్తనా 'సభ్యత' లను గూర్చి ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ ఎంత మొరపెట్టుకొన్నా ఆయన నాయకత్వాన వున్న ప్రభుత్వమే పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి వార్ధక్యం తెచ్చిపెట్టి, దాన్ని నవ్వుల పాల్జేయ చూస్తున్నది.

అలాగే దేశంలోని విద్యుచ్ఛక్తి కొరత ముఖ్యంగా రాజధాని నగరం ఢిల్లీలో ఈ సమస్య తీవ్రతను గూర్చి చర్చ జరిగినప్పుడు పార్లమెంటు ఎంతటి అసహాయస్థితిలో వున్నదీ తేలింది.

జూలై 25 నుండి సుమారు నెల రోజులపాటు ఢిల్లీ నగర విద్యుచ్ఛక్తి కొరతకులోనైంది. ఈ తీవ్ర పరిస్థితి నగరవాసుల్ని పార్లమెంటు సభ్యుల్ని కూడా కోపోద్రిక్తుల్ని చేసింది. కాని వింతేమిటంటే, ఈ విషయంపై స్పీకర్ వాయిదా తీర్మానాన్ని చర్చకు తీసుకోవడానికి ఆమోదించినా, తీర్మానాన్ని ఆమోదించడానికి సభలో పట్టుమని 50 మంది సభ్యులైనా లేరు!

ఇక విద్యుచ్ఛక్తి శాఖ మంత్రిగారు రాజ్యాంగాన్నే మరచిపోయారు. ఆయన మట్టుకు ఆయన ముందు ఎట్టి బాధ్యతా లేకుండా చేతులు కడుక్కొంటున్నారు. (రాజ్యాంగం ప్రకారం ఢిల్లీతో సహా కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలనా బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే) చివరకు ఈ విషయమై చర్చ వచ్చినప్పుడు ఈ విద్యుచ్ఛక్తికొరతకు బాధ్యతను అధికారులు ఎవరికివారు మరొకరిపై పెట్టుకోవడానికి ప్రయత్నం జరిగింది. ఈ విషయమై విచారణ సంఘాన్ని వేస్తున్నామని అధికార ప్రకటన వెలువడింది.

ఆహార పదార్థాలకొరత, కల్తీమందుల సంఖ్య పెరిగిపోతుండడాన్ని గూర్చి విషాహారంవల్ల అనేక మంది మృతిచెందుతున్న విషయమై దేశమంతటినుండీ వచ్చిన వార్తలు ప్రజలలో భయాందోళనలు కల్గింపుతున్న సమయంలో పార్లమెంటు సమావేశమైంది.

ఈ విషయాలపై లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొన్న శ్రీ హోమీ దాజీ, ఈ ఆందోళనకర వ్యవహారాలన్నింటికీ ప్రధానంగా ప్రభుత్వానిదే బాధ్యత అని స్పష్టంచేశారు.

ఏమంటే, మందుల పరిశ్రమకు చెందిన అత్యంత కీలకశాఖలను పైపైకి చేస్తున్నట్లు అవుపించే విదేశీ కంపెనీలకు అప్పగించడం జరిగిందని శ్రీ దాజీ వివరించారు. "అద్భుత మందుల ధరల్ని నిరంకుశంగా కృత్రిమంగా నిర్ణయించేందుకు అమెరికన్ గుత్తసంస్థలు కుట్ర పన్నాయని రుజువు చేయడానికిగాను శ్రీ దాజీ అమెరికన్ పార్లమెంటు విచారణ సంఘం నివేదిక నుండి ఉదాహరణలు ఉటంకించారు.

మోసాలు

ఈ గుత్తవ్యాపార సంస్థలు మంచి కంటె ఎక్కువ హానికలిగించే అనేక నిరుపయోగమైన మందుల్ని వైద్యులపై రుద్దుతున్నాయి.

దేశంలోకి దిగుమతి అయిన ఒక గ్రామ్ "ఆరోమైసిన్" ఖరీదు రు. 1.20లు కాగా దానిని మార్కెట్‌లో రు. 13 లకు అమ్ముతున్నారు. ఈ మందునే ప్రభుత్వరంగంలో ఉత్పత్తి చేసినట్లయితే అదే గ్రామ్ "ఆరోమైసిన్" ఖరీదు 0-50 నయాపైసలు మాత్రమే వుంటుంది. ముఖ్యమైన మందుల విషయంలో సాగుతున్న ఈ లాభార్జన పద్ధతి కల్తీ మందుల తయారీకి దారితీస్తుంది.

అంతేగాదు, మందుల పరిశ్రమను మందులను తనిఖీచేసే యంత్రాంగం లోపభూయిష్టంగా, అసమర్థంగా, అవినీతిగా పని చేస్తోందని కూడా శ్రీ దాజీ చెప్పారు. ఈ చెడుగులన్నింటికీ ఒకే ఒక మందు ఉందన్నారు. అదే - మొత్తం మందుల పరిశ్రమల్ని జాతీయం చేయడం. అసలు మందులు మార్కెట్‌లోకి అమ్మకానికి వెళ్ళే ముందు అధికార స్థాయిలో తనిఖీ జరగాలని శ్రీ దాజీ డిమాండు చేశారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు:

"సకల ఫ్యాక్టరీల్లో తయారు కాబడిన కల్తీ మందులవల్ల ప్రజలు చనిపోయినట్లయితే, అది ఉత్త హత్య మాత్రమే కాదు. అది జాతి జాతినే మట్టుపెట్టడంతో సమానమవుతుంది. అందువల్ల ఈ రకమైన చర్యల్ని అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకొనే ఎట్టి పకడ్బందీయైన శిక్షనైనా అన్ని వర్గాల వారూ పూర్తిగా ఆమోదిస్తారు. కాని అన్నింటికన్న ముఖ్యంగా ప్రభుత్వం, ఈ చెడుగుల్ని తొలగిపోయేటట్లు మాత్రమే గాకుండా మందులలో కల్తీ వ్యాపారజాడ్యాన్ని సమూలంగా నాశనంచేసేటట్లు కూడా చూడాలి."

ఈ విషయంలోకూడా డాక్టరయిన ఆరోగ్యమంత్రిగారిచ్చిన సమాధానం అస్పష్టంగానూ, బాధ్యతలేకుండానూ వుంది. అంతేగాదు; ఆరోగ్యశాఖా మంత్రిణి కల్తీమందులు ఎక్కువ కావడానికి పార్లమెంటు సభ్యుల్ని శాసన సభ్యుల్ని నిందించింది కూడా! క్షమించరాని ఈ బాధ్యతారాహిత్యం ఇంకా వెర్రితలలు వేస్తుందా? ఈ బాధ్యతారాహిత్యాన్ని కప్పిపెట్టుకునేందుకు ఆమె మందుల వ్యాపారం చేసే బడా బడా విదేశీ గుత్తవర్తకులను పొగిడింది.

ఇదే విషయమై వచ్చిన మరో ప్రశ్నలో, పశ్చిమ బెంగాల్, అస్సాంలలో అనేక వందలమందికి విషాహారం కలగటంలో అమెరికా గోధుమపిండి పాత్ర వెల్లడైంది. అలాగే అమెరికా నుండే వచ్చిన పాలపొడి కలిపిన పాలు పుచ్చుకున్న ఒరిస్సాలోని అనేక మంది స్కూలు పిల్లలపై విషాహార ప్రభావం పడింది.

ఈ విధంగా విషపూరితమూ, ప్రమాదకరమూ అయిన మందులూ, దిగుమతిచేసిన గోధుమపిండీ, పాలపొడీ (ఇవన్నీ ఉదారమైన అమెరికా భూమి నుండి వచ్చినవేసుమా!) మన దేశ ప్రజల్ని భయవిహ్వలుల్ని చేశాయి.

వరద బీభత్సం

ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరమూ దేశంలో వరద పరిస్థితుల్ని గూర్చి సభలో చర్చ జరిగింది. ప్రతి సంవత్సరం ఈ వరదలకు అనేక వందల మంది ఆహుతి అవుతూనే వున్నారు. పంటలూ, పశువులూ, ఆస్తులూ కొట్టుకుపోతూనే వున్నాయి. కాని వరద బాధిత ప్రజలకు సహాయం చేస్తామని హామీలు ప్రకటించడం, కొద్దిమంది మంత్రులు విమానాల మీద వెళ్ళి వరద ప్రాంతాల్ని చూచి రావడం మినహా, వరదలు రాకుండా శాశ్వతంగా తీసుకోవాల్సిన చర్యలలో యింతవరకూ అభివృద్ధి ఏమీ లేదు.

పెట్టుబడిదారీ అర్థికాభివృద్ధి దేశాన్ని పరస్పర విరుద్ధమయిన వైరుధ్యాల్లోకి దింపుతోంది భారత బూర్జువా వర్గం, సామ్రాజ్యవాద దోపిడీని ఎదిరించ నిష్టంలేక తన ఆగ్రహావేశాల్ని ప్రజలపై వెలిగక్కుతోంది. రైతాంగాన్ని అధోగతి పాల్జేసి, సాధారణ కొనుగోలు దారుల్ని, కార్మికుల్ని దోపిడీచేయడం ద్వారా ఈ బూర్జువావర్గం పెట్టుబడులను కూడ కట్టుకో జూస్తోంది.

ఖర్చులు

ఈ విషయాలు అనేక తఫాలు సభా చర్చల్లో వచ్చాయి. ఉదాహరణకు ఎగుమతులకు ప్రోత్సాహమివ్వడాన్ని గూర్చి మనం చాలా విన్నాం. కాని ప్రశ్నల్లా ఏ ఖర్చుకి, ఎవరి ఖర్చుమీద?

ఈ విషయమై ఒక చిన్న ప్రశ్నతో సభ్యుల కివ్వబడ్డ వివరాలలో అనేక వాస్తవాలు బయటపడ్డాయి. చక్కెర ఎగుమతుల వ్యవహారాన్ని "చక్కెర ఎగుమతి ప్రోత్సాహక చట్టం" క్రింద భారత చక్కెర మిల్లుల సంఘం చూస్తోంది.

రు. 12.75 కోట్ల విదేశీ మారక ద్రవ్యం సంపాదించిపెట్టే 3.5 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెరను విదేశాలకు ఎగుమతి చేసేందుకు ప్రభుత్వం రు. 13.5 కోట్లు ఫక్తు సబ్సిడీగానూ, రు. 16 కోట్లు ఎక్సైజు డ్యూటీ క్రింద, చెరకు కొనుబడి పన్ను క్రింద ఇవ్వుకోవాల్సి వుంది.

ఈ విధంగా భారత ప్రభుత్వ కన్సాలిడేటెడ్ నిధినుండి రు. 29 కోట్ల 10 లక్షల 26 వేల మేరకుగల మొత్తం పద్దునూ, అతిస్వల్పమైన రు. 12.75 కోట్ల విదేశీమారక ద్రవ్య సేకరణకుగానూ సభవారు ఆమోదించారు!

(అంతర్జాతీయ మార్కెట్ లో చక్కెర ధర టన్ను ఒక్కింటికి రు. 290 లు. ప్రపంచ మార్కెట్‌లో గోధుమకన్నా చక్కెర చవుక! సామ్రాజ్యదేశాలకూ, చక్కెర ప్రధాన ఉత్పత్తిదార్లయిన బడుగుదేశాలకూ మధ్య అసమ వ్యాపార సంబంధాలకు ఇది చక్కటి నిదర్శనం.)

ఈ నష్టంలో చక్కెర మిల్లులు కొంతభాగం పంచుకోకూడదా?-1955-59 సంవత్సరాలలో అంటే నాలుగు సంవత్సరాలలో చక్కెర పరిశ్రమ రు. 51 కోట్లు లాభాలు గడించింది. కాని ప్రభుత్వం ఈ లాభాల్ని ముట్టదు. కాని కొనుగోలు దార్లు, పన్నులు చెల్లించే ప్రజలు మాత్రం భారత మార్కెట్ లో చుక్కలంటుతున్న చక్కెర ధరలు పడిపోకుండా అట్టిపెట్టేందుకు తమ డబ్బు గుమ్మరించాల్సి వస్తోంది.

ఇట్టి పరిస్థితులలో ప్రభుత్వ వ్యాపార సంస్థ (స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్) ఎగుమతి వ్యాపారాన్ని తన చేతుల్లోకి ఎందుకు తీసుకోదు?

ఎగుమతులను ప్రోత్సహించే విషయమై తయారయిన ముదలియార్ కమిటీ నివేదికపై చర్చ సందర్భంలో శ్రీ పి. రామమూర్తి మాట్లాడుతూ, ఎగుమతులను ప్రోత్సాహపరచడమంటే ఎగుమతుల ప్రోత్సాహానికై పెట్టుబడిదారులకు ఉత్సాహాకరంగా సౌకర్యాలు కల్పించడం మాత్రమే కాదని చెప్పారు.

ఈ సందర్భంలో ఆయన, జౌళి పరిశ్రమాధిపతులకిచ్చిన సౌకర్యాలవల్ల గత 8 సంవత్సరాలలో ఒక్కగజం గుడ్డన్నా ఎక్కువ ఎగుమతి కాకుండా పోయిన విషయం ఉదహరించారు. వాస్తవానికి వస్త్రాల ఎగుమతులు తగ్గిపోతున్నవని చెప్పాలి. 1959 లో 81 కోట్ల 40 లక్షల గజాలగుడ్డ ఎగుమతి అయితే 1960 లో ఇది 69 కోట్ల 40 లక్షల గజాలకు, 1961 లో 57 కోట్ల 40 లక్షల గజాలకు తగ్గిపోయింది.

కాని అదే సమయంలో ఉదాహరణకు బొంబాయి జౌళి మిల్లులు పొందిన లాభాలు అపరిమితం. 1959 లో ఈ మిల్లులు తీసిన లాభం రు. 1232 లక్షలు కాగా: అది 1960 లో రు. 2,100 లక్షలకు, 1961 లో రు. 2,400 లక్షలకూ పెరిగింది. కోటీశ్వరులు దేశభక్తికన్నా లాభాలకే ప్రాముఖ్యత నిస్తారు. ఈ విధంగా వీరు సాధారణవినియోగదారుడ్ని దోపిడీ చేసినంత కాలమూ తమ సరుకుల ఎగుమతుల్ని గూర్చి బాధపడాల్సిన అవసరం ఏముంది?

పట్టణాలలోవుండే పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగానూ, ప్రభుత్వం అనుసరించే గుత్తవర్గాల అనుకూల విధానాలకు నిరసనగానూ రైతాంగంలో పెరుగుతున్న భయాందోళనలు, భూముల సేకరణ (సవరణ) బిల్లు, చెరకు కంట్రోల్ బిల్లుపై చర్చలో స్పష్టమైనాయి.

రైలుప్రమాదాలగూర్చి, వరదలు, విద్యుచ్ఛక్తి కొరత వగైరా సమస్యలను గూర్చి ప్రభుత్వం బాధ్యతలేకుండా తప్పించుకుంటూ తప్పించుకోవచ్చుగాని, రైతాంగ ఆస్తిహక్కులపై తాను చేసే ప్రత్యక్ష దాడియత్నాల్లో చేతులు కాల్చుకోకుండా తప్పించుకోలేదు.

పార్లమెంటులో గ్రామీణప్రాంతాలకు చెందిన సభ్యులు అధికంగానే వున్నారు. వారిలో అనేకమంది స్వతహాగా తగినంత భూవసతిగలవారున్నారు. వారంతా గుత్తవర్గాల ప్రతినిధియైన ఆహార వ్యవసాయశాఖా మంత్రికి కొరకరాని కొయ్యలుగానే వున్నారు! వాస్తవానికి అసలు బిల్లు తీసుకువచ్చిన తీరుచూస్తే దాన్ని ఆమోదించడం యెవరికైనా సిగ్గుచేటుగానే వుంటుంది.

ఈ బిల్లుపై ప్రారంభంలో విమర్శించిన శ్రీ హోమీదాజీ ఈబిల్లుకొకసారి చట్టరూపం వచ్చినట్లేతే, ప్రైవేట్ పరిశ్రమాధిపతుల సౌకర్యార్థం ఈ బిల్లు ఉపయోగపడనున్నదో ఆ పరిశ్రమాధిపతుల భూముల ఏజెంట్లుగానే ప్రభుత్వ రెవిన్యూ అధికారులు వ్యవహరించాల్సి వస్తుందని శ్రీ దాజీ స్పష్టం చేశారు.

మాజీ ఆహార మంత్రి శ్రీ ఎ. పి. జైన్ కూడా విమర్శించడంలో మిగతా కాంగ్రెస్ సభ్యులుకూడా ఈ బిల్లును విమర్శించడం ప్రారంభించారు. బిల్లును సమర్థించిన వ్యక్తల్లా కాంగ్రెసు సభ్యుడు శ్రీ రాంరత్నం గుప్తయే (కాన్పూర్). ఈయన సౌకర్యార్థమే ఈ తతంగం అంతా జరిగింది.

చివరకు మంత్రిగారు కొంత తగ్గి, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలోనూ, ప్రతిపక్ష పార్టీల నాయకులలోనూ వారం రోజులపాటు సమాలోచనల అనంతరం బిల్లులోని విస్తృతాధికారాల్ని, తగ్గించడం జరిగింది.

ప్రభుత్వం తన ప్రజావ్యతిరేక విధానాలను గుర్తించేటట్లు పార్లమెంటు ప్రభుత్వాన్ని లొంగతీసిన బహుకొద్ది ఉదాహరణలలో బహుశా ఇది కూడా ఒకటి కావచ్చు. కాని ఇక్కడ గమ్మత్తేమిటంటే అనేకమంది కాంగ్రెసు

(మిగతా 8 వ పేజీ)



మధురసంగీతంతో శ్రోతలను మైమరపిస్తున్న హంగరియన్ పోస్టుకార్డు

'సౌండు మాగజైన్' పత్రికను తయారుచేసిన హంగరియన్ శాస్త్రజ్ఞుడు, అలాదార్ కిట్జార్ తన సహచరులతో బుడాపెస్టు కార్యాలయంలో ప్రథమ ప్రతిని పరిశీలిస్తున్న దృశ్యం.

ఈ పత్రిక మనోహరమైన రంగురంగుల బొమ్మలతో వార్తలతో నిండివుంటుంది. 32 పేజీలు గల ఈ పత్రికలో 6 పేజీలు మధురసంగీతాన్ని ప్రసారం చేస్తాయి.

సంగీతాన్ని ప్రసారం చేసే పత్రికను కనిపెట్టిన ఘనకీర్తి ఈ విధంగా హంగరీకి దక్కింది.

విశాలాంధ్ర

వ్యావహారిక సత్యమే జీవిత సత్యమని ప్రతిపాదించిన "లవణరాజు కల"

[మిథ్యావాదాన్ని త్రోసిపుచ్చి, పారమార్థిక సత్యం కన్నా వ్యావహారిక సత్యమే జీవిత సత్యమన్న అద్వితీయ మానవతావాది మహాకవి గురజాడ తన "లవణరాజుకల"లో రూపకల్పన చేశారు. జీవితం నీటి బుడగవంటిదని, సౌందర్యం అశాశ్వతమని సిద్ధాంతాలు చెప్పే వేదాంతుల సూక్తులనే అప్పరాయకవి తన ఈ కథాత్మక ఖండ కావ్యంలో పటాపంచలు చేశారు.] —వం.

డాక్టర్ సి. నారాయణ రెడ్డి

గురజాడవారి 'ముత్యాలసరాల' సంపుటిలో నాలుగు కథాత్మక ఖండకావ్యాలున్నవి. ఒకటి పూర్ణమ్మ. రెండోది డామన్‌పిథియాస్, మూడోది కన్యక, నాల్గోది లవణరాజు కల.

జ్ఞాన వాశిష్ఠంలోని లవణోపాఖ్యానము లవణ రాజుకలకు మూలం. ఈ మూలకథ రామునికి వశిష్ఠునికి జరిగిన సంవాద సమన్వయంగా చెప్పబడింది. వశిష్ఠుడు రామునికి మనోలక్షణాన్ని వివరిస్తూ స్వప్న స్వరూపాన్ని చెబుతాడు. స్వప్నాదుల్లో మనస్సంకల్పంవల్ల గోష్పదంమేర అనేక యోజనాలు దూరమవుతుందని, అనేక యోజనాల ప్రదేశం గోష్పద మాత్ర మవుతుందని, బ్రహ్మకల్పం క్షణమాత్రంగా క్షణం బ్రహ్మకల్పంగా అవుతాయని విశదీకరిస్తాడు. ఇంద్రజాలం స్వప్నాదులలోనిదే అని స్పష్టపరుస్తాడు. జగద్రూపమైన ఈ యింద్రజాలం మనస్సులో ఏ రకంగా వుంటో వివరించడానికే లవణోపాఖ్యానం చెప్పబడిందనవచ్చును.

ఈ మూలకథ ప్రధానంగా వేదాంత పరంగావుంది. వర్ణనా బహుళంగా కూడావుంది. గురజాడవారు తమ రచనలో వర్ణనలను చాలావరకు తగ్గించి కథాసంబంధమైన ఘటనలను పెంచారు. మూలకథ శాంతరసప్రధానంగావుంటే, దానిని శృంగార రసప్రధానంగా మార్చారు. ఆ అంగి రసానికను గుణంగావున్న వర్ణనలను మాత్రమే ఒకటి రెండుచోట్ల చేశారు. గురజాడవారిది ప్రధానంగా కథాదృష్టి. ఆ కథాకథనం వెనకవారికున్న లక్ష్యం వేరు; మూలకర్త దృష్టివేరు. వీరు మూల కథలో ఏ యే మార్పుల్ని ఏ దృష్టితో చేశారో, అవి యెంతవరకు ఔచితీగర్భితంగా వున్నాయో వివరిస్తాను.

1. మూలకథ మనోలక్షణాన్ని, సంకల్ప లక్షణాన్ని వివరించడానికి ఉద్దేశింపబడిందని ముందే చెప్పాను. గురజాడవారు ఈ విషయాన్ని స్వీకరించ సూటిగా కథతో ప్రారంభించి, ప్రతి పాద్యవస్తువు వేదాంత సంబంధమైంది కాదని, కేవలం కథానుబద్ధమైనదని వ్యక్తంగా సూచించారు.

2. మూలకథ ఆరంభంలో కావ్య సంప్రదాయాల దృష్ట్యా రాజుగారి వర్ణన ఈ రకంగా చేయబడింది. కేవలం సంప్రదాయికంగా వున్న యీ వర్ణనం కథ కంతగా అవసరం కాదని గురజాడవారు దీనిని వదలిపెట్టి 'నిండుకొలువున లవణుడను రాజుండె' అని ప్రారంభించి, వెంటనే 'ఇంద్రజాలికున్ని ప్రవేశపెట్టారు.

3. ఇంద్రజాల ప్రభావంతో లవణరాజు గుఱ్ఱమెక్కి అడవిలో తిరిగి, తిరిగి, చివరకొక చెట్టుకొమ్మ నంటి పెట్టుకున్న తీగను పట్టుకు వ్రేలాడుతాడు. గుఱ్ఱం ఎక్కడికో వెళ్ళిపోతుంది. రాజు స్నానపానాదులు లేక, చలికి గజగజ వణుకుతూ, పండ్లు పటపట కొరుకుతూ, 'పక్కాకులు' చేస్తూ ఆ రాత్రి వేగించినట్లు మూలంలో వుంది. ఈ సన్నివేశంద్వారా జీవి యొక్క దుస్థితిని నిరూపించడం మూల గ్రంథ ఉద్దేశ్యం. గురజాడవారి దృష్టి అదికాదు. లవణుడు ముందు ముందు కనిపించనున్న మాలెతను పెండ్లాడడమే వీరి ప్రధాన వస్తువు. అందు చేతనే రాజు దుస్థితినిగూర్చి చెప్పక ఆయన కొంతసేపు నిదురించి కనువిప్పి నంతనే కన్నెదుట వింతలోకం వెలసిందని తెలిపి, రమ్యమైన వాతావరణ సృష్టికై పద్యం సిద్ధం చేశారు. మూలంలో లేని సంధ్యా ప్రకృతి వర్ణనల్ని చేర్చి ముందు జరగనున్న శృంగార కళాపానికి రంగమేర్పరిచారు. చల్లగాలులకు జల్లుజల్లునరాలే పూలను చూస్తుంటే రాజు ఉల్లం అలరిందని వర్ణించారు. ఈ చిత్తాహ్లాదంతో పాటు క్షుత్తుగూడా కలిగిందని స్ఫురింపించి వదిలారు.

4. 'పరన ధారిణి' యను చండాల కన్య కనిపించగా రాజావిడను అన్నం పెట్టమని అడిగినట్లు, 'నా తండ్రికోసం ఈ అన్నం తీసుకుపోతున్నాను, నన్ను పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకుంటే

(మిగతా 4 వ పేజీలో)

అద్వైతం

శ్రీ గజ్జల మల్లారెడ్డి

దేశమంటే మట్టికాదని
గ్యాసు కోస్తే లాభమేమోయ్
మోసులెత్తే సత్యభావ వి
లాపముల గమనించవోయ్
కాంగ్రెసూ దేశమ్ము వేరను
కారుకూతల నమ్మకర్రోయ్
రాజకీయాద్వైత తత్వం
రంగు నిగ్గుల గాంచవోయ్
ఎదుటిపక్షపు వారి మాటలు
ఎండమావుల్లోని నీళ్ళోయ్
కాంగ్రెసనియెడి కల్పవృక్షం
కామితార్థము లిచ్చునోయ్
సకలవిధ అధికారములు మా
చంకలోపల దాగినాయోయ్
ఎదురు తిరిగిన మూఢబుద్ధుల
కిహపరమ్ములు దూరమౌనోయ్
వివిధ వాదవివాద భంగో
ద్విగ్న జలనిధి త్రచ్చినామోయ్
సామ్యవాదపు టమృతభాండం
గ్రామికుల తలకెత్తినామోయ్
ప్రజల తీర్పుకు బద్ధులంగా
పదవులను తలదాల్చినామోయ్
పగలు రాతిరి యనక మీకై
దిగులుపడి కృషియించినామోయ్
మంత్రులంతా రాజభోగం
మరిగినారని దూరవద్దోయ్
భోగి కానిదె యోగి కాడను
ఆగమార్థమ్మరయవోయ్
పాలకుల లోపాలు వెదికే
పాడుబుద్ధిని విడుచుకోవోయ్
ఇసుక పాతర త్రవ్వితే నీ
క్షేమఫలితం దక్కునోయ్
సొంతలాభం కొంత యుంచుకు
సొంతమే మా కేమి నామోయ్
ఆలుపిల్లల పేరనేవిన
ఆస్తి వివరాలెంచబోకోయ్
లంచగొండులు వంచకులు మా
పంచ గాస్తే యేమితప్పోయ్
భక్తిసులభులమైన మాకీ
శాఖ లెప్పుడు తప్పవోయ్
నాయకుల వైయక్తికములౌ
నడతలను ప్రశ్నించ తగదోయ్
వ్యక్తిస్వేచ్ఛకు అడ్డుదగిలే
వైఖరిని సహియించబోవోయ్
పన్నులను తెగపెంచినామని
పంతులు మాటల దండుగేనోయ్
సామ్యవాద సమాజమునకై
దారులున్నాం మాయకలెనోయ్
ధనికులింకా ధనికులైరని
మనసు మాద్యక బాధపడకోయ్
పరులకలిమికి కాలిపోయే
కోపలకు సుఖమబ్బదోయ్
పస్తులుంటే నష్టమేమిటి?
బాగుపడు నారోగ్యమేనోయ్
తిన్న దరుగక మేము సైతం
టిఫిను మానేయడము కద్దోయ్
ధరలు చుక్కల చేరినాయని
పరిహసించుట కాకిలితనమోయ్
దేశసౌభాగ్యాభివృద్ధిని
తెలుసుకొను మాత్రమ్ము లేనోయ్
ఆంధ్రరాష్ట్రం వెనుకబడెనను
అల్లరిని తగ్గించవలెనోయ్
గతమహోన్నత చరిత్రపునరా
వృత్తమై వెలుగొందెనోయ్
అఖిలభారత నాయకత్వం
ఆంధ్రయువకుల వలచినాదోయ్
ముట్లుడిగిన ముద్దరాలికి
మొగుడు మరి తెలుగోడు యాదోయ్

స్వర్గలోకంపు గిరీశం
సిగ్గుతో తలవంచినాదోయ్
గుమపులకు నామాలుదిద్ది
గౌరవం మా కబ్బినాదోయ్
ఎన్ని చెప్పిన కొన్ని గొప్పలు
ఇంకనూ మిగిలున్నవోయ్
అన్నిటిని వర్ణించు పని ఏ బ
యారు చారణ కోటిదోయ్
మూకలింగా లేచు కొండలు
కీడులను వారించు లేవోయ్
ఆస్తికత్వపు భావములతో
అందరూ వర్ధిల్లవలెనోయ్
మామహోపన్యాసమామని
మాకగందరుకన్న మిన్నోయ్
భక్తితో పానమ్ము చేసిన
భుక్తిముక్తులు దక్కునోయ్

ఏజెంట్లు కావలెను

ఆకర్షణీయమైన డిజైనులలో మాకే ఆఫ్‌సెట్ క్యాలెండర్లకు ఆర్డర్లు బుక్ చేయుటకు ఏజెంట్లు కావలెను. మంచి కమీషను. వివరాలకు వ్రాయండి.

Ajanta Art Calendar Mfg.,
P. B. 255, Madras-1.



నాకాస్

నేటినుండి ఉబ్బసపు వ్యాధితో బాధపడనవసరంలేదు. ఈ వ్యాధి నిర్మూలనకుగాను 30 సం॥ల పరిశోధనా ఫలితంగా లభ్యపరచుకొనబడి, పరమహంస క్రియలకు మూలికలతో తయారైన ఆయుర్వేదౌషధం. ఎంత ముదిరిన వ్యాధికైననూ తక్షణమే బాధ నివారింపజేయుటయేగాక కొంతకాలము సేవించిన తిరిగి దూపెట్టదు.

8 డో॥ రు. 3-75, పోస్టేజి ప్రత్యేకం.
ఇండియన్ మెడిసన్‌హౌస్,
విజయవాడ-2.

హెచ్చరిక

కిర్లోస్కర్ యింజన్లు సమర్థవంతముగా పనిచేస్తాయి. దాని విడి భాగములు సరసమైన ధరలకు దొరుకుతాయి. ఈ ఇంజన్లు కొన్న వారికి మరమ్మతులు, ఓవరు హాలింగులకు సౌకర్యా లున్నాయి.

కిర్లోస్కర్ యింజన్లు ఇలా ప్రజలకు అభిమానపాత్రం అవడంపట్ల దురాశగల వ్యాపారస్థులు. స్థానికంగా నకిలీ విడిభాగములు తయారు చేయించి యింజన్లు బిగించి అసలు కిర్లోస్కర్ ఇంజన్లుగా చలామణిచేసి అమ్ముచున్నారు.

ఇలాంటి నకిలీ ఇంజన్లు కొని నష్టపోగొట్టుకొని ఇబ్బందులపాలు కాకుండా ఉండేందుకుగాను రిజిష్టర్డు డీలరుదగ్గరే అసలు కిర్లోస్కర్ యింజన్లు కొనండి.

ఇంజన్లు, విడిభాగాలు స్టాకులో తయారుగా ఉన్నాయి.

తెలంగాణాకు డిస్ట్రిబ్యూటర్లు:
గుంటి అండ్ కంపెనీ,
(ప్రైవేట్ లిమిటెడ్) సికింద్రాబాదు.

సీరియల్

చెఱసాల

శ్రావణశ్రీ

పూర్వకథ

రాజు నిరుపేద. తల్లి చావు బ్రతుకులమీద ఉంది. డాక్టరు ఇంజెక్షను తెమ్మన్నాడు. వేత చిల్లిగవ్వలేదు. దారినపోయే ఓంకారయ్య పర్సు కొట్టేశాడు. పట్టుకోబోతే పలాయన మంత్రం పఠించాడు. ఓంకారయ్య కూతురు లలిత పుణ్యమా అంటూ పట్టుబడకుండా బయటపడ్డాడు. మందుకు కావలసిన డబ్బుమాత్రం తీసుకొన్నాడు. మిగతాదంతా అక్కడే వదలిపెట్టాడు. కిందట్టూ మీదట్టులతో ఇంటికొచ్చేసరికి తల్లి చనిపోయి వుంది. దిగులుతో కుంగిపోయాడు. ఇంజెక్షను తిరిగి షాపువాళ్ళకిచ్చివేశాడు. ఆ డబ్బు ఓంకారయ్యకు తెచ్చి ఇచ్చాడు. తల్లి వ్రాసివుంచిన కడసారి ఉత్తరం చూసుకున్నాడు. కష్టానికి తగిన ప్రతిఫలం దొరక్క అగర్భ దరిద్రంతో కుమిలిపోతున్న కూలి జనాన్ని కూడదీయాలనుకున్నాడు. రెండున్నర మైళ్ళ పొడవు రోడ్డు కాంట్రాక్టును ఓంకారయ్య కొట్టేయజూచాడు. కాని రాజు లేబర్ సొసైటీకి కాంట్రాక్టు సంపాదించాడు. ఓంకారయ్య ఉగ్రుడై కరణం, మునసబుల సాయం కోరాడు. ఫలితం! శిస్తు చెల్లించలేదని కూలివాళ్ళ పశువులను అక్రమంగా జప్తుచేశారు. కూలీలు వాటని బందెలదొడ్డినుండి విడిపించుకు వచ్చారు. పుట్టినరోజు సందర్భంగా లలితను మాట్లాడించవెళ్ళిన రాజును, అదివరకేపట్టుకొన్న కోటయ్యనూ ఓంకారయ్య కట్టివేయించి తన్నించాడు. కూలీలు ఒకటిగానిలబడి వారిని విడిపించారు. మళ్ళీ పనుల కాల మొచ్చినప్పుడు కూలీరేటుపై తగాదా వచ్చింది. ఓంకారయ్య పొరుగూళ్ళనుండి కూలీలను తెప్పించి కొట్లాట జరిపించాడు. ఆ సందర్భంలో లలితకు దెబ్బతగిలింది. తిరిగి పంటకోతల దగ్గర కూడా ఓంకారయ్య మనుషులు కూలీలతో తగాదా వేసుకొన్నారు. కూలీలకు రైల్వే లైన్ పని దొరికింది గాని, దాన్ని కూడా ఓంకారయ్య చెడగొట్టాడు.

"చేయగాని శే! తొందరపడద్దండీ. గాలిలో దీపం పెడితే తట్టుకోలేక ఆరిపోతుంది. అదే అగ్నిగోళమై పొగలతోనూ, సెగలతోనూ వెలుగుతున్నప్పుడు అడ్డువచ్చిన ప్రతిదాన్ని దహించి వేస్తుంది! అప్పుడు పరమశత్రువైన ఆగాలే దానికి మిత్రమౌతుంది" అన్నది లలిత వున్నట్టుండి.

ఆ మాటల అంతరార్థమేమిటో ఓంకారయ్య గ్రహించలేకపోయాడు. కన్నకూతురులో యింత అడంబరం పెచ్చుపెరిగిపోతోందేమిటా అని మాత్రం ఆలోచించసాగాడు. క్షణంలో అతనికళ్లు ఎఱ్ఱబడ్డాయి. ముఖం వికృతరూపందాల్చి కందిరీగలా తయారైంది.

"హద్దుమీరి మాట్లాడుతున్నావ్! జాగ్రత్త! తండ్రిని కాదని అలగావెధవలతో కలసి పనిచేస్తావ్? నీకు సిగ్గూఎగ్గూ, చీమూనెత్తురూ వుంటే అలా వెళతావా?"

"ఏముందీ చేస్తే! అమ్మాయి కలా చెయ్యడం యిష్టమైంది, చేస్తోంది"

"రేపునువ్వూ వెళ్ళిచేస్తానంటావ్. అందరూ ఒక్కసారి దొమ్మరాళ్ళలో కలసిపొండి. పీడా వొదిలిపోతుంది."

"అన్నంతా అయితేగాని తెలిసి రాదా?" అంది చంద్రమతి.

దాంతో ఓంకారయ్య కోపం విజృంభించింది. తన భార్య తెగబడి అడ్డు చెప్పడం యిదే మొదలు. ఒళ్ళు మండిపోయింది. ఒక్కసారిగా భార్యపై విరుచుకుపడ్డాడు. "ఏమన్నావ్"— అంటూ జుట్టుపట్టి కుదిపి అలా విసిరి పారేశాడు. ఆమె ఆ విసురు తాగలేక కుప్పలా కూలిపోయింది.

"చంపండి! కిందపడేసి నిలబడ్డారే!! మీదపడి త్రొక్కి చంపండి. నాతో పాటు దీన్నికూడా చంపేసెయ్యండి. ఒడిక్కె పేపుట్టికట్టుకొనివేళ్ళాడొచ్చు—" అంది క్రిందపడి లేచిపోయిన కోపంతో లేవబోతూ.

"ముండదానివి దొరికావ్. కొట్టినా కోపినా లాభంలేదు—"అంటూ వెనక్కి తిరిగాడో లేదో ఇంతలో హఠాత్తుగా కరణంశాస్త్రి "శరణుశరణంటూ" వచ్చి ఓంకారయ్యను అంగలేసుకొన్నాడు. అతని నెత్తి చిల్లుపడి కణతమీదినుంచి బుగ్గలమీదుగా నెత్తురు వొరవడి కారుతోంది. ఓంకారయ్య కంగారుపడ్డాడు. ఏమిటని అడిగేసావకాశం అయినా లేకుండా పుల్లిగాడు లచ్చుమమ్మ కొప్పు పట్టుకొని బడబడా యీడ్చుకొంటూ అక్కడికొచ్చాడు. అలా లాక్కొస్తుంటే అది కుయికయి మనడం లేదు.

"ఏమిట్రా పుల్లీ, దాని కొప్పు విడవరా! పూడిపోయేట్టు పట్టుకొన్నావ్" అన్నాడు ఓంకారయ్య.

"దొరా, ఇది చెడుముండయిపోయింది. పట్టపగలే ఆ నాయాలుతో కసాట్లో కులుకుతుందాది" అంటూ దాన్ని వదలి ఓంకారయ్య దగ్గరున్న కరణం శాస్త్రిమీదికి ఉరకబోయాడు.

"ఆగరా! అంత రౌద్రం దేనికిరా? ఇంతలోకే కొట్టాలట్రా? చూడు. ఇతనికి నెత్తురెలా కారుతుందో?" అన్నాడు.

"కొట్టాలా కళ్ళెయ్యాలా? అడెవుడు! అడెవుతి! దాని తోలికొళ్ళాడంటే నాకళ్ల ముందే - తూత్..." అంటూ మళ్ళీ మీద కెళ్ళబోయాడు. ఓంకారయ్య వాణ్ణి వెనక్కి నెట్టాడు.

"నే నెట్టా సత్తే ఆడికేటిదొరా. వూరికే మీదకొచ్చి కొడుతుండాడు?" అంది లచ్చుమమ్మ అందుకుని.

"ఈ యింటో ఇట్టాటియి సాగుతుంటే తవుట్టా వూరుకుంటారు. చెప్పండి దొరా. దూలానికి కట్టెయ్యండి. బొయిక విరగ బొడుత్తా" అన్నాడు.

ఓంకారయ్య ఆలోచనలో పడ్డాడు. కరణం శాస్త్రి తన కన్ని విధాలా సహాయకారి. ఆయన్ని ఏమనడానికీ వీల్లేదు. అట్లని పుల్లిగాడి మాటా తోసెయ్యకూడదు. ఈ యింటిలో యిలాంటి ఆగడాలు జరుగుతుంటే లోకులకు తనే పలచనౌతాడు. పోనీ లచ్చుమమ్మను గద్దించి పొమ్మందామంటే, యింటి పనంతా కష్టంగా అదొక్కటే యీడ్చుకొస్తా వుంది. ఇంతకూ యీ అల్లరంతా పుల్లిగాడే చేసుకొస్తున్నాడని తనకి తెలుసు. లేకపోతే దీన్ని గురించి కరణంశాస్త్రిని కొట్టవలసినపనివాడికేముంది; వాడికదీనిమీద కన్నుపడింది. కాని వాడి ఆటలు దాని ముందు సాగడంలేదు. అదీ వాడి వుక్రోషమల్లా.

"పుల్లీ! దాన్నలా ఈడ్చుకురావడానికి నీ కేమధికారముందిరా?" అన్నాడు—

"తిప్పరి!" అనుకొంది చంద్రమతి కసిగా.

"అదా! నాకాబోయే పెళ్లాం—"

"ఛీ పో" అంది లచ్చుమమ్మ ముఖం చిట్లించి—

"దానికిష్టం లేనప్పుడు నీ పెండ్లామెట్లా అవుతుందిరా. అటువంటి ఆశ మానుకో. వాళ్ళిలా క్రిందా మీదా పడితే నీకెందుకు? ఏమయ్యా యీ కరణం శాస్త్రీ! నువ్వుకూడా వెళ్లు. ఈ ఆవరణం వుండగా దానితో నువ్వేం మాట్లాడవద్దు" అన్నాడు ఓంకారయ్య.

పుల్లిగాడు ఎగిరెగిరిపడుతూ వెళ్ళిపోయాడు. ఇప్పుడింకా పంపించడం మంచిదికాదని శాస్త్రిని తన గదిలోకి తోసుకొనివెళ్ళాడు ఓంకారయ్య. ఏమీ స్పష్టంలేనట్లు భార్యను పిలచి శాస్త్రి ఐడిన్ తెచ్చి ఈయన నెత్తిన తగలెయ్యమన్నాడు. "వేసుకో" అంటూ చంద్రమతీ, లలితా కిందకెళ్ళిపోయారు. లచ్చుమమ్మను వెయ్యమంటే 'నాకేటి సంబంధం' అని అదీ వెళ్ళిపోయింది. ఓంకారయ్య పళ్లుపటపటా కొరికి తనే ఆపని శాస్త్రిచేసి ఆయన్ని నెమ్మదిగా సాగనంపి తిరిగివచ్చేసరికి పుల్లిగాడు చంద్రమతీ, లలితమ్మలతో మాట్లాడుతున్నాడు. ప్రక్కనే లచ్చుమమ్మకూడా నిలబడివుంది. ఏమిటో విందామని గోడపక్కకుజరిగి చెవి నిక్కబెట్టి వింటున్నాడు.

"లచ్చీ! నీకా కోతిమూతి తప్పించి పుల్లిగాడు నచ్చలేదటే" అన్నది చంద్రమ్మ గొంతు—

"ఆమాట చెప్పలేనమ్మగోరూ. ఆడే కత్తికంకుపడుతుండాడు — ఆ కరణమయ్య కాలుకాలిన పిల్లిలా సాయంట పడుతుండా మాటియ్యాలా?" అన్నది లచ్చుమమ్మగొంతు—

"ఏంరా! మరి నువ్విట్లా కొట్టుకొంటున్నావ్?"

"ఇది ఒట్టి కిలాడమ్మగోరు. తమ వొద్ద అట్టనే అంటది."

"ఏం లచ్చి! నిజమేనా?"

"వుత్తిదమ్మ. పుల్లిగాడు నా కేమైన కావడితే- ఏదో తప్పు చేస్తుందానకే పడతాడుగాని, ఎప్పుడూ నోరిజారి అడగలా."

"ఏంరా?"

"నిజమే కానమ్మగోరు; ఎట్టా అడగాలో తెలవలా."

"అంతా నీదగ్గరే వుంచిన్న మాట - ఏమే లచ్చి నీకు పుల్లిగాడంటే యిష్టమేనన్న మాట!"

"అదే మాట పుల్లిని కూడా అడగండి!" అంటూ చెంగున వెన్ను పుల్లిగాడి డొక్కలో మోదేత్తో పొడిచి ఒక్క గంతేసి బయటకు పరుగుతీసింది. పుల్లిగాడు ఎగిరిపడి వెంటబడ్డాడు. ఇంతవరకూ దాగివున్న ఓంకారయ్య గబగబా లోనికి వెళ్ళి "అన్నిటికీ తగినోయారు!" అన్నాడు. వుక్రోషంతో -

"దొమ్మరివాళ్ళకు ఆ మాత్రం లేకపోతే ఎట్లా?" అంది చంద్రమతి.

ఓంకారయ్య మారు మాట్లాడకుండా బుసలు కొట్టాడు.

19

కోతలు కోశారు. కుప్పలు వేశారు. కాని రాందాసూ వాళ్ళు మాత్రం పని దొరక్క అల్లాడిపోతున్నారు. ఇప్పటికే కొంతమంది వలస పోయారు. వున్న వాళ్ళు వూపిరి బిగబట్టి పళ్ళబిగువున నిలబడ్డారు. ఐనా వాళ్ళలో సత్తువ లేదు. ఒట్టి అస్థిపంజరాల్లా వున్నారు. వాళ్ళను చూస్తుంటే ప్రాణం తరుక్కుపోయేస్థితి కొచ్చారు. ఎంత పంతం పట్టి నిలబడినా రైతులు కన్నెత్తి చూడ్డంలేదు. ఎందుకు చూస్తారు? కోతలూ కుప్పలు కూడా పొరుగూరి జనాన్నే రప్పించి వేయించుకొన్నారు. రేపో మాపో కుప్పలు దించి నూర్చడానికి కూడా ఆ జనాన్నే అట్టిపెట్టుకున్నారు. పొట్టకొరకు దేవులాడే తమలోనే యింత ఐక్యతలేనప్పుడు ఎవరేం చెయ్యగలరు? వాళ్ళకెంత బోధించినా వదిలిపెట్టి వెళ్లలేదు. పైపెచ్చువాళ్లు శాశ్వతంగా యిక్కడే వుండి పోయేదానికోసమని ఓంకారయ్య ఇళ్లూ-వాకిళ్లూ ఏర్పాటు చేస్తున్నట్లు వినికిడయ్యింది. ఇలాంటి అగాజం ఎంతకాలం కొనసాగిస్తాడో! ఆఖరికి తను ఆడమన్నట్లల్లా ఆడిన పుల్లిగాడికికూడా బాగా బుద్ధి చెప్పాడు. వాడీమధ్య లచ్చుమమ్మని దక్కించి పెళ్లిచేసుకుని కాపురం పెట్టాడు. ఓంకారయ్య చావట్లోనే ఓమూల దడికట్టుకొని సంసారం సాగిస్తున్నాడు. ఒంటిగావున్నప్పుడు ఏమి ఎగిరిపడ్డా, తోడు వచ్చేసరికి కొత్త కాపరానికి కావలసిన సరంజామా ఏర్పాటు చేసుకోడం తలకు మించిన పనైంది పుల్లిగాడికి.

ఒకనాడు "ఇవ్వాళ పొయిమీది పిల్లి లేచేటట్టు కన్పడటం లేదు. ఇదేం సంసారమయ్యా! ఇంటో బియ్యం లేవు! ఏమి వండను" అంది లచ్చుమమ్మ మొయిముపుగా పుల్లిగాణ్ని ఎత్తిపొడుస్తూ.

పుల్లిగాడు మీసం మెలేశాడు. అదెంతభాగ్యమన్నాడు. ఓంకారయ్య వద్దకొచ్చి 'గింజలు' కావాలిదొరా!" అని అడిగాడు.

"నా దగ్గిర గింజలిప్పుడు లేవురా. కుప్ప లెలాగూ నూరుస్తాంగా. అప్పుడు కొలిపించుకొందువులే ఎన్ని కావాలో" అన్నాడు ఓంకారయ్య.

"అట్టాకాదొరా. ఈ పూటకేమీ లేవు. కొలిపిచ్చాల్సిందే—" అన్నాడు ఖరాఖండిగా.

"కొలతాలన్నా యిప్పుడొక్క గింజ లేదు. కొట్లో వున్న వడ్లన్నీ నిన్ననే బేరమిచ్చేశా."

"ఇత్తే ఇయ్యొచ్చు, ఇప్పుడు నాకు రావాల్సినవన్నీ కొలవాల్సిందే—" అన్నాడు కర్రపోటు వేసి.

"అంత పట్టుదలగా అడుగుతున్నావు గనుక గింజ కొలిపేదేలేదు" అన్నాడు ఓంకారయ్య.

"కొలవవురా?" అని పుల్లిగాడు పొగలు గ్రక్కుతూ వెళ్ళిపోయాడు. లచ్చుమమ్మ మేడమీదికొస్తూ, ఎదురైనా ఏ సంగతీ చెప్పకుండా తల వంచుకొని ఆదేపనిగా వెళ్ళిపోయాడు. ఆ వాలకాన్నిబట్టే గింజ లివ్వలేదన్న సంగతి లచ్చుమమ్మ పసిగట్టి ఓంకారయ్యగారివద్ద కొచ్చింది.

"దొరా! తపురంతా చెప్పబట్టి ఆడితో కాపురానికి దిగా. ఇంటో గింజల్లేవు కొలిపిద్దురూ!" అంది.

"లేవని వాడితో చెప్పాను గదూటే!"

"ఆడి జీతం లేవన్నారు సరే. నాకియ్యాల్సిన వన్నా యియ్యండి."

"వాడికివ్వనప్పుడు నీకు మట్టు కెక్కణ్ణుంచివస్తాయే? నీకూవాడితో పాటే కొలుస్తాను—"

లచ్చుమమ్మకింక మాట్లాడడానికి వీలులేకపోయింది. ఇంకా పడిగాపులు పడి ఆయన ఎదుట నిల్చుండడం దండుగని మెల్లగా వెనక్కి తిరిగింది. అంతలోనే కరణం శాస్త్రి రొప్పుకొంటూ అక్కడికొచ్చాడు. పట్టరాని కోపంలో ఎదురుగా వున్న లచ్చుమమ్మ ముఖాన తుపుక్కున వూసి "అష్టంలేముండా" అంటూ ఓంకారయ్య దగ్గరకొచ్చి—

"కొంప మునిగింది, వుత్తరప్పొలాన వంక తాటివగ్గర కుప్పెవరో నూర్చుకుపోయారు."

"నిజమేనా?" అంటూ ఓంకారయ్య ఎగిరిపడి దడదడలాడుతూ అడిగాడు.

"నిజం. నలిపినగడ్డి, కుప్ప చుట్టూ చిందరవందరగా పడివుంది. ఓ రెండు మూడు బస్తాలవరకూ నలుపుకుపోయి వుంటారు."

"నువ్వక్కడి కెందుకెళ్ళావ్!—"

"ఇవ్వాళ ఉదయం అక్కడికే చేను మసాయిదా చెయ్యడానికని వెళ్ళాను."

ఈ కబురు వినేసరికి ఓంకారయ్య ఆగలేకపోయాడు. ఆ సంగతి లలితా, చంద్రమతులకు తెలిసినా ముభావంగా వుండిపోయారు. ఎటుతిరిగీ ఓంకారయ్యకే వళ్ళంతా తేళ్లు కుట్టినట్లయి నిలువలేకపోయాడు. కరణం శాస్త్రిని తీసుకొని అంగలుపంగలు వేసుకొంటూ వుత్తరప్పొలం వంక తాటివద్ద కొచ్చాడు. కుప్ప కొపిరినుంచి అడ్డంగా క్రిందకు పడవేసి 'బోడిగా' వుంది. సగం సగం నలిగిన వడ్ల కంకులు కుప్ప కిన్నివేపులా పడివున్నాయి. దీనికి ఓ యిరవై గజాలు అవతల రాందాసు కుప్ప తణుకూ బెణుకూ లేకుండా నిలబడి గర్వంగా తన కుప్పను వేళాకోళం చేస్తోందా అన్నట్లు వుంది. ఎందుకో ఓంకారయ్య కళ్లు కసిగా అరమోడ్పు పడ్డాయి.

"శాస్త్రీ! ఇదెవరు చేసుంటారో నీకేమైనా అనుమానం వుందా?"

"ఇంకెవరండీ! ఆ రాందాసూ, ఏసోబుగాళ్లే. వాళ్ళకు తోడు వుసికొలపటానికి ఆ రాజుగాడొకడు తద్దినమయ్యాడుగా?"

అదీ నిజమేననుకొన్నాడు ఓంకారయ్య. ఈ పనోళ్ళు తప్పించి మరెవరూ చెయ్యరని గట్టినమ్మకం యేర్పడిపోయింది. వాళ్ళే పనిచెయ్యలేదనుకోవడంమాత్రం ఎలా?

ఓవేపు రాందాసుగాడికుప్ప సజావుగానే వుందాయె. పొరుగు దొంగలైతే వాడికుప్పవదిలి తన కుప్పపైనే ఎందుకు పడతారు? ఇది వాళ్లు చేసినపనే. లేకుంటే తన చేలో కాలు మోపడానికి ఇంకెవరికీ దమ్ములుండవనుకున్నాడు.

"కరెక్టుగా ఆలోచించి చెప్పావయ్యా—"

"అదేనండీ! నిన్న చీకటేల రాందాసూ ఏసోబూ మా యింటి ముందుగా యిటువేపు రావడం చూశాను!"

"ఇంకేం వాళ్లే! ఆ వెధవల్ని వుత్తినే వదిలిపెడితే వీడి పేరు ఓంకారయ్యే కాదు" అంటూ ప్రతినబూని, శాస్త్రి చెవిలో ఏదో వూదాడు.

"ఏం! అర్థమైందా? నువ్వీ పనిచెయ్! ఆ తర్వాత నే చూసుకొంటాను"

"అలాగే!"

ఇద్దరూ యింటికి తిరిగి వచ్చేశారు. ఓంకారయ్య కానేపు పిచ్చెత్తినట్లు వరండాలోనే పచార్లుకొట్టి చప్పున సబ్ పోస్టాఫీసుకొచ్చి పోలీసులకొరకు ఫోన్ చేశాడు. — ఫోనుచేసిన ఓగంటన్నరకల్లా పదిహేనుమంది సాయుధ పోలీసులు వ్యాన్‌లో వచ్చి వాలారు.

"ఎవరండీ మా కుప్ప నలిపినవాళ్లు అని అడిగాడు హెడ్.

ఎంతమందిమీద చెప్పాలా అని ఓంకారయ్య ఆలోచించసాగాడు. రాందాసు, ఏసోబు, ఆఖరు రాజుమీద కూడా చెప్పడం మంచిదేమో అనుకొన్నాడు. కానీ, యిలా ముగ్గురు మీద ఒకేసారిచేస్తే పాత కక్షల్ని పురస్కరించుకొని చేసినట్లవుతుందనుకొన్నాడు. అలాగా రాజును వదిలి వాళ్ళిద్దరిమీదే పులిమితే ఎలా వుంటుదా? అని ఆలోచించాడు. అదే బాగుందనుకున్నాడు. వాళ్లిద్దరూ ఒట్టి గడగ్గాయలు. ముందు వాళ్ళ పీడ వదలాలి. మూడోవాడిగతి తరవాత పడదామనుకున్నాడు.

ఈ విషయం చెప్పబోతుండగా, భార్య పిలుస్తున్నట్లు లచ్చుమమ్మ వచ్చి చెప్పింది.

"ఎందుకే పిలిచావట!" అన్నాడు చిరాకుగా.

"కుప్ప నలిపితే నలిపారు, మీ కవ్వరిమీదా రిపోర్టు చెయ్యవద్దు" అంది ప్రాధేయపూర్వకంగా.

'నువ్వొవద్దంటే ఆగే ఘటం కాదిది. వాళ్ళకు తగిన శాస్తి జరగాల్సిందే?"

"ఐతే వాళ్ళు నలపడం మీరు చూశారా?" అంది లలిత.

"లేదు. వాళ్ళమీద నాకు పూరా అనుమానముంది. వాళ్ళే చేసుంటారు తప్పకుండా."

"వాళ్ళలా కక్కుర్తిపడే రకం కాదని నేను గట్టిగా చెప్పగలను. నమ్ముతారా?" అంది లలిత.

"నమ్మను—వాళ్ళే చేశారు" అంటూ అక్కణ్ణుంచి విదిలించుకొని వచ్చేశాడు.

పోయేకాల మొచ్చినపుడు అంతేలే అంటూ ఆవేశపడి, ఐనా ఏం చెపుతాడో విందామని తలుపుదగ్గరకొచ్చి నిలబడింది.

"చివరికెవరెవరున్నారో తేల్చి చెప్పండి" అని అడిగాడు మళ్ళీ హెడ్డు విసుగ్గా.

"ఇద్దరిమీద నాకు బాగా అనుమానముంది. వాళ్లు తప్ప యీ పని ఇంకెవరు చేసివుండరు.

"వాళ్లెవరండీ?"

"ఒకడు రాందాసు, ఇంకొకడు ఏసోబు."

ఇద్దరి పేర్లు వ్రాసుకొన్నాడు హెడ్.

వెంటనే తన ఆధీనంలో వున్న పోలీసు కానిస్టేబుళ్ళకందరికీ ఏమో సంజ్ఞ చేశాడు. అందరూ లాటీలం కుక్కిన ప్రక్కన తొడలనుంచి మోకాళ్ళ క్రింది వరకూ అన్నిపట్టి అటెన్షన్ ఆర్డర్‌లో నిలబడ్డారు. ముద్దాయిలెవరో వాళ్ళక్కూడా చెప్పి పట్టుకోమని ఫర్మాయించాడు. అలాగేనంటూ వాళ్ళు కాళ్యాటికొట్టి ఇరుకుబారిన గుండెలు మరింత బిగిన పట్టుకొని టిక్కు టిక్కుమని నడక సాగారు. ఆ నడకలో ఇనపనాడాల బూట్ల తాకిడికి భూదేవి తట్టుకోలేక అదరి పోతోంది.

"వాళ్ళను వెంటనే పోల్చి పట్టుకోడం కష్టం. ఎవరైన్నా పంపిస్తారా మాతోపాటు" అన్నాడు హెడ్.

ఓంకారయ్య పుల్లిగాడికోసం కబురు చేశాడు. వాడివ్వాళ ఎందుకనో తన కంటికగపడలేదు. ఎక్కడికి వెళ్ళిందీ తెలీదు.

"ఎవరో ఎందుకు! నేనే వస్తాలెండీ—" అంటూ ఓంకారయ్య వాళ్ళతోపాటు బయలుదేరాడు. కొంత దూరం వెళ్ళినతర్వాత వాళ్ళురావడం కోటయ్య కనిపెట్టి ఏదో ముంచుకొనం జరగనున్నదని భయపడ్డాడు. ఒక్కపరుగున రాజువద్దర కొచ్చాడు. అక్కడే రాందాసూ, అతని కూతురూ, ఏసోబూ వుండి మాట్లాడుకొంటున్నారు. కోటయ్య ఆకస్మికాగమనానికి వాళ్ళు కాస్త తొట్రుపాటు పడ్డారు.

గట్టుగానే కోటయ్య చెప్పేశాడు.

"బాబూ యాందో కొంప మునిగేట్టుంది. ఓంకారయ్య పోలీసోళ్ళవెంటేసుకొత్తుండాడు. నా మాటిని యీణ్ణుంచి పారిపొండి" అన్నాడు.

రాజు వెటకారంగా నవ్వి—

"మనమేం తప్పుచేశాం వాళ్ళు మనదగ్గరకు రావడానికి?" అన్నాడు.

"అదే తెలవటంలా బాబూ"

"సరే, రానీ తెలుస్తుందిగా. ఇంతమాత్రానే జడిసి పారిపోవలసిన ఖర్మేం పట్టింది?"

"అంతేబాబూ! అళ్ళుకువడి సేవడు డీరోజుల్లో" అంటూ అందుకొన్నారు రాందాసూ ఏసోబులు.

"ఎందుకు జడవడం చూస్తాం.మజా" అంటూ హెడ్‌తో సహా పదిమంది యింట్లోకి దూసుకువచ్చి చుట్టువేశారు.

"మీ రెందుకొచ్చారో మాకు తెలీదు. ఏదన్నావుంటే బయటకు పిలిచి అడగండి. చెప్పకుండా చెయ్యకుండా ఇలా ఇంట్లోకి రావడం సబబూ కాదు; చట్టమూ కాదు"అన్నాడు రాజు తారాజువ్వలా లేచి.

"దొంగల్ని పట్టుకోడానికి మాకన్ని అధికారాలూ వున్నై. ఇదేం చట్టవిరుద్ధం కాదు" అని హెడ్డు దబాయించాడు.

"దొంగలా? ఎవరు?" రాజు విస్తుబోయి అడిగాడు.

"ఇందులో రాందాసూ, ఏసోబూ ఎవరు"న్నాడు హెడ్డు.

"అదేం! ఓంకారయ్యగారు తోడు వచ్చారుగా. చెప్పమనండి!"

ఓంకారయ్య చెయ్యెత్తి వాళ్ళిద్దర్నీ చూపించాడు. నలుగురు పోలీసులూ వాళ్ళని పట్టుకొని చేతులకు బేడీలు తగిలించారు.

ఈ అక్రమదండనకు రాజు ఉగ్రుడై "మీరు వాళ్ళ చేతులకు బేడీ లెందుకు వేస్తారు? విప్పండి" అంటూ కొట్టబోతున్న వాడిలా పోలీసుల్ని సమీపించాడు.

"త్వరపడకు మిస్టర్. వీళ్ళు పచ్చి దొంగలు, ఓంకారయ్యగారి కుప్పనలిపి వడ్లు దోచుకుపోయారు."

"చిత్రంగా వుందే మీరు చెప్పేది. వాళ్ళాపని చెయ్యలేదని నేను హామీ యిస్తా. విడిచిపెట్టండి"

"కుదరదు మిస్టర్ - అలా అని ఓంకారయ్యగారు రిపోర్టు చేశారు. దోషి దోషే - దొంగ దొంగే!"

రాజు కళ్లు ఎఱ్ఱబడ్డాయి, ఓంకారయ్య కేసి చూచి,

"మీ రిపోర్టు సత్యమైందేనా ఓంకారయ్యగారూ. ముసముసలాడుతూ అన్న మో రామచంద్రా! అని అలమటిస్తున్న సమయంలోనే మీ గాదెల్లోని ధాన్యం నిక్షేపంగా వుందే! ఇప్పుడు ఆ కుప్పజోలికెందుకు వస్తారు? నిజం చెప్పండి! వీళ్ళేనా మీ కుప్పనలిపింది?" అని ఆవేశాన్ని అణచుకొంటూ అడిగాడు.

"ఔను" అని ఓంకారయ్య నిమ్మకూర్తిగా జవాబిచ్చాడు.

"ఛీ ఎంత పాపాని కొడిగొట్టావు? మేం నీకేలోకొచ్చి నీ కుప్పలు నలుపుకొంటామా? నూనుకొండి మాయిల్లంతా సోదా. ఆ పాపతు ఒక్క గింజుంటే కాల్చెయ్యండి" అంటూ బలవంతాన బేడీలతోనే చేతులు లేపుతూ ఓంకారయ్యమీదికెళ్ళబోగా ప్రక్కనున్న పోలీసులు ఆపారు. ఇంకా ముదురుతుందేమోనని హెడ్డు వాళ్ళని తొందరించి తీసుకుపోతూంటే రమణమ్మ గబాలున వెళ్ళి తండ్రిని కౌగలించుకొంది.

"నాన్నా" అంటూ ముప్పిరిగొన్న దుఃఖంతో భోరునఏడ్చింది. రాందాసు కళ్ళల్లో నీరు తిరిగినా ఆపుకొన్నాడు.

"తల్లీ! నీకేం బయంలేదు. నేనెక్కడుండా, నాకన్నా ఎక్కువగా నూసుకోనేరాజు బాబుండాడు. వూరుకో తల్లీ!" అన్నాడు రాందాసు. ఆమెనతిబలవంతాన ప్రక్కకులాగ వాళ్ళిద్దరినీ తీసుకుపోయారు పోలీసులు.

"జాగ్రత్తగా మెసులుతూ వుండండి బాబోయ్! ఆయన కునమీన పగపట్టి నట్టుండాడు" అంటూ కోటయ్య తాత కొలికిల్లోని కన్నీటిబిందువుల్ని పంచె కద్దుకొన్నాడు.

"పట్టి; చూద్దాం!" అంటూ రాజు రమణమ్మ వెంటచేరి ఓదార్చసున్నాడు. కానీ ఆమె ఏడ్పుకట్టడంలేదు. అసలే తల్లిలేనిది. అందులో మళ్ళీ తండ్రి దూరాన - ఈ రెండూ ఆమెను దుఃఖార్ణవంలో ముంచివేశాయి. ఆమె దీనావస్థకు రాజు కళ్లుకూడా చెమ్మగిల్లాయి. ఐనా పైకిమాత్రం కనపడనియ్యలేదు.

"రమణీ! ఏడ్చి లాభమేముంది? అంతటికీ లేని ఆవేశంతప్ప - నేనున్నా నుమీ నాన్న వచ్చేవరకు" అన్నాడు రుద్ధకంఠంతో. రమణమ్మ కళ్లుతుడుచుకొని, రాజుముఖంలోకి చూచింది. ఆ ముఖంలోని ఔదార్యం ఆ కళ్ళలో కానవస్తున్న నిస్వార్థ ప్రేమ, ఆమెకు వూరట కలిగించాయి.

"మళ్ళీ నాన్నెప్పుడిడికి వడతా రాజూ?" అని అతి అమాయకంగా అడిగింది. బుగ్గలపై పారేలు కట్టిన కన్నీరు కొంగుతో తుడుచుకొంటూ "చెప్పలేము" అంటూనే రాజు అలా మూసేసరికి లచ్చుమమ్మ పుల్లిగాణ్ణితోసుకుంటూ లోనికి వచ్చింది.

"శెప్పు. రాజుబాబుకు తప్పు శెప్పి శెమించమని ఏడుకో" అంది.

రాజుకీ రమణమ్మకీ ఏమీ అర్థం కాక తికమకపడుతున్నారు. కోటయ్య తాతపరిస్థితికూడా అలాగేవుంది. అపరాధిలా నిలబడివున్న పుల్లిగాడేం తప్పుచేశాడో ఎవరికీ బోధపడడంలేదు.

"బాబూ ఓంకారయ్యకుప్పనలిపింది నేనే. జీతం వడ్లు యియ్యమంటే యియ్యలా. ధైర్యంచేసి కుప్పనలిపి వాటిని కోమిటి కొండయ్యకమ్మేశా. పేటకెళ్లి కావలసిన కంచరసామాను కొనుక్కొని యిప్పుడే వొచ్చా. లచ్చి సెప్పింది ఇట్టా రాందాసునూ ఏసోబునూ పట్టుకుపోయారని. నన్ను శెమించండి బాబు - చేసింది నేనే - ఎల్లియిడిపించి ఆ జైల్లో నే నేవుంటా" అన్నాడు పశ్చాత్తప్త హృదయంతో.

రాజుఆశ్చర్యానికి, కోపానికి అంతులేకపోయింది. కోటయ్య రమణమ్మ కూడా అలాగే విస్తుపోయారు. గతంలో వీడి కుతంత్రాలు చూచి గుంజకు వురితీయాలని తీర్మానించి కూడా తాత మాట విని విడిచి పెట్టేశాడు. అంతలోనే మేలు మరచి ఓంకారయ్యతో కలసి ఎదురు తిరిగాడువాడు. ఈ నాటికీ ఓంకారయ్య చేసే మోసపు ఎత్తుగడలకు భుజమేసుకొంటూనే వున్నాడు. అందుకని కోపం వస్తున్నా, వాడిలో ఇంతటి అనూహ్య పరివర్తన కలగడం రాజుకు ఆశ్చర్యంగానేవుంది. వాణ్ణి వెనకటిలాగా పట్టి కట్టెయ్యడంగానీ, వురి తీయడమన్న వూహాగానీ లేదు రాజుకిప్పుడు. ఒకనాటికి కాకపోయినా మరోనాటికైనా వాడి తప్పు వాడే గుర్తించక తప్పదన్న నిర్ణయాని కొచ్చాడు.

"పుల్లీ! క్షమించడమనేది మాశక్తికి మించిన వ్యవహారం. చేసింది నువ్వే కావచ్చు. కానీ వాళ్లెలాగూ దోషులై వెళ్ళిపోయారు. మధ్యలో నువ్వు తలదూర్చటం దేనికి? నువ్వు యథేచ్ఛగా వెళ్ళి నీ పని చూసుకో. వాళ్ళ సంగతేమీ ఆలోచించకు"

"అంతేనంటారా బాబు?" అని దీనముఖంతో అడిగాడు.

"అంతే..."

"ఐతే నేను తడుకుచేసిన అన్యాయం."

"అదేం చెప్పకోకు - నీ తప్పును నువ్వు తెలుసుకొన్నావ్, అదే మేం కోరేది!"

"బాబూ! శెస్సేసిన దుర్మార్గానికి తపుకట్టా మెల్లెయ్యాలో తెలీటంలా. శెప్పండి శేత్తాను"

"అది నే చెప్పితే తెలిసేదికాదు. మనసుకేది మంచిదని తోస్తే అది చెయ్యటమే." పుల్లిగాడింక మాట్లాడలేదు. లచ్చిని తీసుకొని తోటకు వెళ్ళిపోయాడు. ఇంతవరకూ ఏదో పరధ్యానంలో వున్న రమణమ్మా,

మిగతా 6వ పేజీలో

కరంకరం కలపండి!

రచన: పోచన రామిరెడ్డి

స్వాతంత్ర్యం సాధిస్తిమి
షోడశాబ్ది విచ్చేసెను
ఇన్నేండ్లుగ మనదేశం
సాధించిందేమి సఖా!

అంగలలో అభ్యుదయం
అంకెల చదరంగములో
అంగుళమాత్ర పురోగతి

సాధించిన సంపత్తిని
స్వల్పసంఖ్య అపహరించ
కుబేరునకు కుచేలునకు
మదహస్తికి మశకానికి
మించిన అంతర మేర్పడె!

ధనికవర్గ జెగజెట్టీల్
టక్కుల్లో టెక్కు మిగిలి
తమ పన్నులనెగవేస్తూ
తైతక్కల నాడుచుండ
అందినంత ప్రజాధనం
స్వాహాయన స్వార్థపరులు

అంబరాన్ని చుంబించే
అధికధరల వలయంలో
గ్రామిక జనజీవనాడి
బిగిసికుదిసి పోతున్నది

విపరీతం పన్నులభారం
అపరిమితం అప్పులబాధ
హద్దులేదు అవినీతికి
భరియింపగ లేక ప్రజల

దేశంమూల్గులు పీల్చుతు
మతవాదం మితవాదం
కుళ్ళుకంపు కులతత్వం
అదనుచూచి కదంత్రొక్కె

ప్రజలు సహస్రాక్షులగుచు
కరం కరం కలిపిపట్టి
సోషలిజం కావాలని
పయనిస్తేనే మోక్షం
పయనిస్తేనే మోక్షం నేస్తం!

లవణరాజు కల

(మూడవ పేజీ తరువాయి)

అన్నం పంచిస్తా'నని ఆవిడ రాజుతో అన్నట్లు మూలంలో వుంది. గురజాడ వారిక్కడ చక్కని మార్పు చేశారు. లవణునికి మొదట వింతగాన మేదో వినిపిస్తుంది. అది చెవులకు సోకగానే అతనికి 'పూర్వవాసన పిలిచి' నట్లవుతుంది. అప్పుడు రాజు ఆకలిమరుస్తాడు. ఇడుములు మరుస్తాడు అంతలో శ్యామలాంగియైన ఓ జవని కనిపిస్తుంది. ఆవిడ పాటను తొలుత వినగానే 'పూర్వవాసన పిలిచిన'ట్లయ్యే నడంతోనే గురజాడవారు ప్రతిపాద్య విషయానికి బీజం వేశారు. రాజుకూ, ఆ సుందరికీ జన్మజన్మాల అనుబంధం వుందని ధ్వనింపజేశారు. రాజు కామైక దృష్టిగలవాడు కాడు. ఆవిడను చూడక ముందే ఆవిడ పాటవిని పరవశుడు కావడము, ఆకలిని మరచి పోవడము, జన్మాంతర వాసనలు మేల్కొనడము, ముందు జరగనున్న కథ కెంతో పోషకంగా వున్నవి. నాయికను ప్రవేశ పెట్టడములోనే కాక రూపవర్ణనంలో కూడా వీరు ఔచిత్యాన్ని చూపారు. మూలములోని శ్యామలాంగి 'తరళతారక నేత్ర', 'అగవలాంబర', దండాలరు నీలాంబరం ధరించడము ఆచారం. గురజాడవారు,ఆవిడ కట్టుకున్న పుట్టం గురించి వ్రాయడం అప్రసక్తమని వదిలేశారు. ఆవిడను చంచలనేత్రగా చిత్రించక, 'అరమోడ్చిన కన్నుగవతో చెదరి యాడెడి ముంగురులతో, బెదురు లేరగని బింక మెప్పిన జెడగు నడకలతో సాగుతూ పాట పాడినట్లు, ఆ పాటను 'చెట్టు చావుల' కోసం పాడినట్లు వర్ణించారు. ఆ పాటను విని 'తాటి వనమున సాగి చంద్రుడు, తాను చెవియొగ్గి వాడట' ఈ కల్పన ఎంతో ఉదాత్తంగా వుంది. నాయిక ప్రకృతి ఒడిలో పుట్టి పెరిగిన పరమ సాధుజీవనగా చిత్రింపబడింది. అందుకే ఆమె చెట్లచేమలకోసం పాడింది. ఆమె పాట ప్రకృతిని సైతం పారవశ్యంలో ముంచివేసిం. ఆమె అరమొగిడ్చిన కన్నుగవతో పాడిందనడంతో గాంభీర్యం ఇనుమడించింది. ఆమె ఎవరిని గూర్చి గానం చేసిందో కాని లవణుడనే మాట మధ్యలో వినిపించినట్లు రాజుకు తోచిందని వ్రాసి గురజాడవారు మరో మార్పు చేశారు. ఈ మార్పు కూడా పూర్వజన్మానుబంధాన్ని నొక్కి చెప్పడానికే ఉద్దేశింపబడింది.

5. మూలంలో రాజు పదేపదే ఆవిడను అన్నం పెట్టమని అడుగుతాడు. గురజాడవారీ సందర్భంలో, గతజన్మంలో సైతం ఆవిడను కోరిచి అన్నం తిన్నట్లు మనస్సుకు తోస్తుందని, తానన్యుణ్ణి కాను గాబట్టి అన్నం పెట్టమని రాజు ఆవిడను అడిగినట్లుగా మార్చి, పూర్వజన్మ సంబంధాన్ని మళ్ళీ ఉగ్గడించారు. తాను మాలెత కాబట్టి అతనికి అన్నం పెట్టటానికి అనర్హురాలనని ఆవిడ అన్న తరువాత 'సిబోటి ఉత్తమ లక్షణాలున్న స్త్రీ మాలెత యెలా అవుతుంది; పైగా గుణమున్నప్పుడు వర్ణప్రసక్తి లేదని' రాజు నిక్కచ్చిగా చెబుతాడు. రాజు కేవలం కామదృష్టితో అన్న మాటలు కావివి 'కొన్ని నియమములెన్ని యెనెన్నో కన్న విన్న ధర్మముల' నెన్నకుని, 'నిశ్చయ మాత్మదోపగ' పలికిన వాక్కులు.

'మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ రెండె కులములు
మంచి యన్నది మాలయైతే
మాల నే అగుదున.'

అని రాజన్న మాటలు అతని సంస్కార ప్రియత్వానికి పతాకల వంటివి.

6. మూలంలో మాలెత తండ్రి వర్ణన జుగుప్సాకరంగా వుంది. అతడు 'దురాకృతీ', భయప్రదుడు. 'అప్పక్షయ చక్షువు' రక్తనేత్రుడు. 'కృతాంత' సదృశుడు. గురజాడ వారు ఈపాత్ర భయంకరత్వాన్ని పరిహరించడమేగాక ప్రియంకరత్వాన్ని తెచ్చి పెట్టారు. అతడు పుట్టుకచేత మాలయైనా గురూపదేశం పొంది మలినవృత్తులు మానుకున్న ప్రాజ్ఞుడు. పశువుల్ని మేపుతూ పొట్టపోసుకునే కృషిజీవి. అహింసాశీలి. పండు గడ్డంతో, కళ్ళలో శాంతరసంతో, పలుకులలో కడలి గాంభీర్యంతో, ఒడలిన దివ్యతేజంతో తొల్లిటి ఋషులను తలపించేవాడు. ఈ పాత్ర చిత్రణద్వారా జ్ఞానానికి వర్ణప్రమేయం లేదని గురజాడ నిరూపించారు.

7. మూలంలో రాజు మాలతెను పెళ్ళిచేసుకొన్న తర్వాత వారికి దుఃఖదాయైన కన్య, 'అనర్థం'వంటి కొడుకులు కలిగినట్లుంది. గురజాడవారు వీనిని బొత్తిగా మార్చి వాళ్ళ చక్రవర్తులవంటి కొడుకులను కన్నట్లు చిత్రించారు. వారున్న పల్లెలో కరువు రాగా మూలంలో కడగొట్టు బిడ్డడు 'తాత దేహ్యాను మేమాంసం పాతుంచ రుధిరం క్షణాత్' అని ఆక్రందించినట్లుంది. ఇది జుగుప్సావహమైంది కాబట్టి గురజాడ వారు దీనిని పూర్తిగా వదిలేశారు. సంతానం దుస్థితిని చూడలేక లవణుడు చితి పేర్చుకొని దూకగానికి సిద్ధమైనట్లు మూలంలో వుంది. భార్యాభర్తలిద్దరూ కలిసి చితిని జొచ్చినట్లు చిత్రించి గురజాడవారు ఆ దంపతుల అన్యోన్య రాగబంధాన్ని దృఢపరచారు.

8. మూలంలో ఇంద్రజాలం ముగిసిన తర్వాత రాజు తాను స్వప్నంలో చూచిన భార్యాపుత్రులను వెదకడానికి వింధ్యపర్వత ప్రాంతానికి వెళ్ళిపోతాడు. అక్కడ తిరుగుతుండగా అత్తగారు కన్పడి తన కూతురూ, పిల్లలూ కనిపించడంలేదని తెలిపి రోదిస్తుంది. రాజు విస్మయచకితుడవుతాడు. అంతే కథ. ఆ తర్వాత, రాజే విధంగా రెండు లోకాలను చూచి, ఆ విద్యా స్వభావాన్ని తెలుసుకుని ఇల్లు చేరుకున్నాడని వుంది. మూలంలో చివరి శ్లోకమిది.

'త్యేవం రాఘవా విద్యా
మహతీ భ్రమదాయినీ
అసత్ సత్యాం నయత్యాశు
సచ్చాసత్వం నయత్యపి'

అవిద్యలేనిదానిని ఉన్నట్లు ఉన్నదానిని లేనట్లు భ్రమింపజేస్తుందనిదీనితాత్పర్యం. తెలుగులో అలా వుండదు. రాజు తన స్వప్నవృత్తాంతం చెప్పిన తర్వాత ఒక గుర్రంమీద తాపసి, కన్యా వచ్చి కొలువులో ప్రవేశిస్తారు. ఆ కన్య యవన దేశాధీశుని కూతురనీ, లవణుణ్ణి వలచిందనీ, అందుకే యవన రాజు కానుకగా పంపాడనీ, వచ్చిన తాపసి చెబుతాడు. లవణరాజు ఆవిడను చూచి ఆశ్చర్యానందాలతో సమీపించి చేకొని వచ్చితివా ప్రియసఖీ యని గద్దెమీద కూచోబెట్టుకుంటాడు. రాజు తాను కలలో చూచిన మాలెతయే ఈ యవనాధిపుని కూతురని ఈ మార్పులోని అంతర్యము. ఇక యీమార్పుల ఔచిత్యమేమిటో చూద్దాం.

ఔచిత్యం

ఈ ఖండకావ్యంలో శృంగార రసం అంగి, శాంతం, అద్భుతం అంగరసాలు. జన్మాంతరకాప్యాదం అవిచ్ఛిన్నమైనదని, దాని ముందు వర్ణాది కృత్రిమ బంధాలు పుటుక్కున తెగిపోతాయని నిరూపించడం దీని ముఖ్యోద్దేశ్యం. దీనిని సమర్థంగా నిర్వహించడానికి గురజాడవారు పై మార్పు లన్నింటినీ చేశారు. మూలవస్తువుకూ దీనికీ మౌలికంగానే ఎంతో తేడా వుంది. మూలంలో మనోవైలక్షణ్యాన్ని, చిత్తవికారాన్ని ప్రతిపాదించడానికే ప్రయత్నం జరిగింది. గురజాడవారలా కాక చిత్త సంబంధమైన బంధాలను సింహావలోకనం చేశారు.

మూలంలో జగత్తు మిథ్యయని, చిత్తవృత్తులనిత్యాలనీ సిద్ధాంతీకరింపబడింది. గురజాడవారు దీనికి భిన్నంగా అభిప్రాయపడ్డారు. వారి అభిప్రాయాన్ని వారి మాటల్లోనే చూడండి.

'యెప్పటికి అనుభూత మెద్దియొ
అప్పటికి అది నిక్కువంబే
యెప్పుడో లోకంబు కల్లగు
ననుట యెపుడెట్లో
'చిత్తమందున కీలితములై
నిత్యభేదము నిచ్చు తలపుల
నెత్తి వైచను - లేరె హా! యిది
చెప్పగల ప్రాజ్ఞుల్.'

ఈ చరణాల్లో ఇంద్రియ సన్నికర్షణజన్యమైన అనుభూతి జ్ఞానములు అసత్యమనే వేదాంతుల సిద్ధాంతాన్ని గురజాడ వారు ఖండించారు. వేదాంతులు సత్యాన్ని వ్యావహారికమనీ పారమార్థికమనీ ద్వివిధంగా పరిగణించారు. వ్యావహారిక సత్యమంటే ప్రత్యక్షాది ప్రమాణాల వల్ల కలిగిన జ్ఞానమని వారూ అంగీకరించారు. కాని పారమార్థిక జ్ఞానదృష్ట్యా సర్వ వ్యవహారాలూ, సర్వప్రమాణాలూ మిథ్యయని వారు నిర్ణయించారు. గురజాడవారు దైనందిన జీవితంలో పారమార్థిక సత్యానికి ప్రసక్తి లేదని భావించారు. చిత్తంలో కీలితములై భేదాన్ని కలిగించే తలపులు సత్యములు కావనే శూన్య వాదాన్ని విమర్శించారు. ముఖ్యంగా జన్మజన్మాంతర సంస్కారాన్ని బట్టి ఏర్పడిన అనురాగ బంధం అవిచ్ఛిన్నమూ ఆదరణీయమూ అని నిరూపించారు. స్వప్నం మిథ్యయని మూలంలో వుండగా స్వప్నం సైతం సత్యం కావచ్చునని ప్రతిపాదించారు. వ్యావహారిక సత్యమే జీవిత సత్యమని అభిప్రాయపడ్డారు. అందువల్లనే పుస్తకమాత్ర పరిజ్ఞానాన్ని ఈసడించారు. అనుభవానికే అగ్రతాంబూల మిచ్చారు. అనుభవైక ప్రమాణమైన దర్శనమే నిజమైందని చాటారు. ఇది ఒక రకంగా ప్రత్యక్షవాదమనవచ్చు. పాశ్చాత్య విజ్ఞాన సంపర్కంవల్ల కలిగిన మార్పులలో ఇది ఒకటి. జగన్మిథ్యాత్వమును ప్రతిపాదించే వేదాంతాన్ని త్రోసివేసి జీవిత సత్యమే. కాలే తత్సత్యమని ఈ విజ్ఞానం బోధించింది. బేకన్ అనే ఆంగ్ల తత్వవేత్త ప్రతిపాదించిన ఎంపిరిసిజం అనే సిద్ధాంతం ప్రత్యక్షానుభవాన్నే బలపరుస్తుంది. ఎంపిరిసిజం అంటే ప్రత్యక్ష ప్రమాణం మీద ఆధారపడ్డ దృక్పథం. ఈ సిద్ధాంతం గురజాడవారి దృక్పథానికి ఆలంబనమై వుంటుంది. అంతమాత్రాన వీరు జన్మాంతరవాసనలను విస్మరించలేదు. ఇదే అపూర్వమైన 'కొత్తపాతల మేలు కలయిక'.

స్వీకారం

తెలుగు హిందీ స్వయం శిక్ష
గ్రంథకర్త: విద్వాన్ చంద్రశేఖరం.
ప్రచురణ: బి. వి. జగన్నాథ్ అండ్‌కో, మద్రాసు-1. వెల రు. 1-50.

సచిత్ర వ్యాసం:

ఆధునిక చిత్రకళలో అసమాన చిత్రాలను రచించిన శ్రీ శిరందాసు వెంకట రామారావు

ఆధునిక చిత్రకళా శైలిని పూర్తిగా అవగతం చేసుకొని, నవ్యరీతులలో చిత్రకళాలంకరణ చేస్తున్న యువకళాకారుడు శ్రీ శిరందాసు వెంకటరామారావు కామన్వెల్తు స్కాలర్‌షిప్ పథకంక్రింద ఉన్నత విద్యాభ్యాసానికై ఈ నెల 17 న లండన్ వెళ్లారు. భారతదేశంలోని ప్రముఖుల ప్రశంసల నందుకొన్న వీరి చిత్రకళపై ఈ క్రింది వ్యాసాన్ని ప్రచురిస్తున్నాం. —సం.

శ్రీ వేలూరి రాధాకృష్ణ

ప్రకృతిలో నున్న నైజాన్ని తిలకింపజేసేది కళ. ప్రకృతిని తను అనుభవించిన రీతిగా ప్రతిబింబించే సాధకుడు నిజమయిన కళారాధకుడు కాగలడు. కళద్వారా దానిని సాటిగా చేయగలశక్తిని పొందగలడు మానవుడు.

అలాంటి దివ్యమైన కళకు ఎల్లలు ఏవి ఎల్లా వుంటాయి? కళ విశ్వజనీనమైంది. ప్రపంచానికంతకీ చెందింది. ప్రపంచంలోని పలుప్రదేశాలలో విశిష్టమైన కళాకారులుద్భవించి తమ సాధన ద్వారా శాశ్వతత్వాన్ని పొందారు. అల్లాటివారి కళాసాధన ద్వారా అసలు సృష్టి సార్థకత్వాన్నిచ్చారు. బాహ్యానికి అలాంటి కళా సృష్టి ఎక్కువ ఆనందాన్నిచ్చినా, యివ్వకపోయినా అంతర్యంగా తప్పక చిరంతనమైన అనుభూతి నివ్వగలదనేది నిర్వివాదాంశం.

"చిత్రం మొదట పంచేంద్రియాలకి ఆనందాన్ని కల్గించి ఆ తరువాత మానసికమైన అంతర్భావాలను చూపడంలో 'శేకెత్తించేసేది'" అని ఒక ప్రఖ్యాత విమర్శకుడన్నాడు. కాబట్టి అల్లాటి చిత్రరచనను పూర్తి చేసిన చిత్రకారుడు అంపెరికించే ముందుగా ఆ అంతర్భావాన్ని పొందియే, తను పొందిన ఆ అనుభూతిని తన చిత్ర సృష్టిద్వారా ప్రజలకు అందించగలుగుతున్నాడు తన యెదుటలేని ఒక విషయాన్ని తన మనఃఫలకంలో అవ్యక్తంగా రూపొందించియే కదా తను ప్రారంభం చేసుకున్న దానికి బాహ్యంగా త్రిరూపాన్ని కల్గిస్తున్నాడు అంగా, చిత్రకారుడు మరొక విధమైన తపస్వి అన్నమాట అల్లాంటి కళాతపస్విత్వాన్ని సాధకుడు, తన చిత్ర ప్రతిసృష్టి ద్వారా ప్రజల నానందింపజేసి తాను ధన్యుడు అవుతున్నాడు.

ప్రస్తుతంలో చిత్రకారుడు ఏ విధమైన సాధన చేస్తున్నాడో తెలుసుకుంటే దాని సాధన ఏ పంథాలో నడుస్తున్నదో తెలుసుకుంటే, అసలు చిత్రకళ యొక్క ధ్యేయమేదో తెలిసిపోతుంది. ప్రథమంలో కొంతకాలంవరకూ పాశ్చాత్య దేశాలలో ప్రకృతియందు చూచిన వాస్తవ విషయాలనే చిత్రఫలకాలలో అభివర్ణించి చూడం జరిగింది. అల్లాటి చిత్రాలలో నేమి, శిల్పాలలో నేమి ప్రకృతిలో నున్నదానిని అంతనీ ఉన్నదున్నట్లుగా అతి వాస్తవంగా చిత్రించి, మలచి చూపారు. దీనిని విమర్శకులు వాస్తవిక వాదమన్నారు. ఇపోతే ప్రకృతినుంచి గాక, మరే విషయాల నుంచిగాని స్వతంత్రంగా తనమటుక్కు ఒక విధమైన అనుభూతిని పొంది, లేదా ఎక్కడాలేని ఒక రహస్య విషయాన్ని, తను తద్వారా భావించి దానిని తన ప్రతిభాకల్పనద్వారా ప్రదర్శిస్తే, దానిని విమర్శకులు వ్యక్తిగత వాదమన్నారు. ఈ రెండవ వాదమే మన భారతీయ కళారంగానికి నాందిఅయింది. వాస్తవిక వాదం తాత్కాలికంగా ప్రజలకు రంజకంగా వున్నప్పటికీ, దానికి యెక్కువ ప్రాముఖ్యత ఏర్పడలేదు. పరాధీనతా సమయములో భారతదేశంలోని నలుమూలలా చిత్రకళాశాలలను నెలకొల్పి ఆంగ్లేయులు తమ వారినే ఆచార్యులుగా నియమించి మన భారతీయులచేత వాస్తవిక శైలిలో, చిత్రరచన చేయించినా అది ఎక్కువకాలం మనలేదు. ఆ సమయంలో తదనంతరం వాస్తవిక వాదం వెనకబడి ఆదర్శవాదం ముందుకు వచ్చింది.

ఈ పరిణామం ఎలా జరిగిందో క్లుప్తంగా తెలుసుకోవటం అత్యవసరం. జోషువారైనాల్డు, గైన్సుబరో, జార్జిరొమ్నీ, సర్ రోబర్టు, జార్జి మోర్లండు, జాన్ క్రోమ్, కాన్‌స్టబుల్, టర్నర్‌ల సాధన పూర్తిగా వాస్తవిక పద్ధతిని అనుసరించింది. దర్మిలా మరుగునపడిపోయింది.

"పూర్వ-రాఫెలైట్సు" అనే సమాజం ఒకటి ఏర్పడి అసలు వాస్తవిక వాదాన్ని నిరసించింది. ఈ సమాజంలో చేరిన సభ్యులు కళనూ, సారస్వతాన్ని విభిన్నమైన పంథాలో నడిపారు. ఈ పంథాలో సాధన కొనసాగించిన ముఖ్యులు మిల్లైట్, మెడాక్సు బ్రౌను, హోల్మన్‌హంట్, రోసెటీ మొదలైనవారు.

దర్మిలా పందొమ్మిదవ శతాబ్దపు చిత్రకళలో బహుముఖ్యమైన మార్పులు వచ్చినవి. యావత్తు పశ్చిమ యూరోప్ ఖండమున్నూ ఫ్రెంచి రినైజాన్సు విధానంతో అలుముకుపోయింది. పందొమ్మిదో శతాబ్దం అంతానూ, ఇరవయ్యో శతాబ్దంలో అర్ధభాగం వైబడ్డా ఈ పునర్జాగృతీ విధానాన్ని చరిత్రకారులు వీడనేలేదు.

ఈ చిత్రాలలో మామూలుగా ప్రజలనుకునే అందం ఉండనే ఉండదు. అందం లేకపోవడం ఒక ముఖ్యలక్షణం. సహజరూపాన్ని "అసంబద్ధం"గా రూపొందించటం (అనగా విశ్లేషించటం అన్నమాట.) ఒక విచిత్రమైన 'వర్ణకల్పనా' విధానంతో ఆకారాన్ని అభివర్ణించటం ప్రస్తుతపు చిత్రకారులు చేస్తున్న పని, ప్రథమ శతాబ్దిలో మానవుడూహించి చిత్రించిన ప్రాథమిక విధానానికి సరిపోలుతుండేది. అదే ఇప్పటి చిత్ర రచనా విధానంలో పునరావృతం అవుతున్నది. ఆ ఫ్రెంచి కాలంలో జనించిన నీగ్రో కళకు ఇప్పుడు నవ్యరూపం కలిగింది. ఫ్రెంచి చిత్రకారులలో ముఖ్యుడు పికాసో. ఈయన ప్రారంభదశలో ఒక సరియైన పద్ధతిలో సాధన చేసి తదనంతరం తానూహించిన నవ్య పథాన్ని ప్రజలకు చూపాడు. వాస్తవిక రూపాన్ని అసంబద్ధం చేయడం (అదే విశ్లేషింపచేయడం) వింత రంగుల నివ్వటం ఆయనకి అలవాటు అయింది. ప్రజలు, పూర్వపు వాస్తవిక చిత్రాలు చూచి చూచి విసుగు చెందడం మూలంగా పికాసో నూతన చిత్ర రచనా విధానం వారికి ఆనందాన్నిచ్చింది. కళకు నిజంగా ఎల్లలు లేనట్లే కళాకారుని నిరూపణా విధానానికి కూడా అవధులు లేవు. ఈ నవ్యచిత్ర రచనా విధానమే పలురీతులలో చిత్రకారుల చేతులలో రూపొందింది. ఆ పలురీతులకే పలువిధాలుగా పేర్లు పెట్టారు. మొదటగా సాధన చేసినదానిని 'ప్యూరిజ' మన్నారు. తరువాత కళను 'డడాయిజ' మన్నారు. అటుపిమ్మట 'క్యూబిజము'గా, అటుతరువాత సోషల్ సర్రియలిజంగా. తదనంతరం సర్రియలిజమ్‌గా, ఇటీవల 'అబ్‌స్ట్రాక్టిజమ్'గా పిలుస్తూ వచ్చారు.

ఈ ఇజాలలోనే మళ్ళా అనేక శాఖలూ, ఉపశాఖలూ వచ్చినవి. ఈ శాఖోపశాఖలలో కళయే అపరిమితంగా విశ్లేషించింది. చిత్రకారుని అసలు రచనా విధానంలోనే విప్లవం వచ్చింది. ఒక్కొక్క సమయానికి ఒక్కొక్క వింతను మనం చూడటం నిజమే కావచ్చు. కాలం నడుస్తున్న కొద్దీ మార్పు రావడం అనాదినుంచీ వచ్చు...

ఇక ఈ సాధనారీతి మన భారతదేశంలోకి కూడా ప్రాకింది. అనేకమంది నవ్య చిత్రకారులు పూర్వవిధానాన్ని మార్చి, భారత కళను నవ్యరీతులలో అలంకరిస్తున్నారు. ముఖ్యంగా ఆంధ్రదేశంలో యీ అధునాతన రీతిలో సాధన చేస్తున్న ముఖ్యులలో శ్రీ శిరందాసు వెంకట రామారావుగారు ఒకరు. ఈ వ్యాసోద్దేశం శ్రీ రామారావు చిత్ర రచనా విధానాన్ని ఉల్లేఖించటమే. అతడు అనేక ప్రశంసా పాత్రమైన చిత్రాలను రచించాడు.

శ్రీ శిరందాసు వెంకట రామారావుతో నా పరిచయం రెండేళ్ళ క్రిందట సంభవం అయింది. అతని చిత్రాలను రెండింటిని చూచి అతని నేర్పరితనానికి, కళాప్రతిభకూ

శైలి మాదిరి కాక, రామారావు వ్యక్తిత్వానికే వర్తించే నూతనత అతని జానపద శైలిలో గోచరమైంది.

నేను అభినందించిన వెంటనే ఆ రెండు అమూల్యమైన చిత్రాలనూ నాకు బహూకరించుటలో కూడా ఆయన వెనుదీయలేదు. చిత్రాలపై

అచ్చేయవందాము. ఒకటి 'స్టిల్ లైఫ్'. అందులోని మూడు ఆకృతుల పద్ధతి టెక్‌స్చర్ అనగా స్పర్శించదగినభాగం చాలా ప్రశంసనీయంగా తేబడింది. అన్ని కోణాలూ ఒక శిల్పంలోనే తేవడం ఇంతవరకూ మనం చూస్తున్నది. చిత్రంలో అనగా బల్లపరుపుగా వున్న కాగితంమీద ఆయతనం (Dimension) విధానాన్ని తీసికొని రావడం యిదే ప్రథమం. ఈ పద్ధతిని ఎంతో నేర్పుతో శ్రీ రామారావు ఈ 'స్టిల్ లైఫ్'లో చిత్రీకరించారు. రెండవ చిత్రం జానపద శైలిలో 'ఓంపరా' పద్ధతిని నీటిరంగులలో తయారుచేసిన స్త్రీమూర్తి చిత్రం మామూలుగా యిప్పుడు కొనసాగుతున్న జానపద

మామూలుగా చిత్రకారులు తమ స్వంత పేరును వ్రాసుకుంటారు. అలా కాక ఆ చిత్రాలపై 'ఆర్యదేవ' అని సంతకం చేయడంచూచి దానిని విషయమై తెలుసుకొనవలసినదిగా కోరగా ఆయన ఇలా వ్రాశారు.

"ఆర్యదేవ ఈయన నాగార్జునుని కాలంనాటివాడు. ఆయనలో కలిసి ఉన్న వ్యక్తి. బౌద్ధమతం అంటే నాకు ప్రేమ. అందుకే ఆ పేరు ఎన్నుకున్నాను. నా చిత్రాలన్నిటిమీదా అల్లాగే సంతకం చేస్తాను. విదేశాలలో ఉన్న వాటిమీద, ఇక్కడ గ్యాలరీలలో ఉన్న వాటిమీద "ఆర్యదేవ" అనే తెలుగు సంతకమే ఉంటుంది......" అని వివరించాడు.

శ్రీ శిరందాసు వెంకట రామారావు 1936 వ సంవత్సరం జూన్ 12 వ తేదీన గుడివాడలో జన్మించాడు. అతని తండ్రిగారు శిరందాసు గంగయ్యగారు. ఆయన పేరెన్నిక గన్న దారు శిల్పి. చెక్కటి లతలూ, డిజైన్లూ, నాలుగు ఆయతనాలలో ఏడు, ఎనిమిది అంగుళాల ఎత్తున ఒకే కర్రలో మలచి చెక్కగలరట. కర్రను మరొకదానితో జోడించడం అంటే - అలాంటి శిల్పంలో, ఆయనకసలు ఇష్టం వుండదుట. అంటే చిత్రలేఖనం, శిల్పం శ్రీ రామారావు స్వగృహంలో అతని పుట్టుకముందే ఉందని చెప్పాలి. తండ్రిగారు అతనికి మార్గదర్శి అయ్యారు. శ్రీ రామారావు చిన్నతనం నుంచీ, చిత్రలేఖనం అంటే, అవిధంగా ఇష్టం ఏర్పడింది. స్కూలు ఫైనలు వరకూ "బాటనీ" ముఖ్యమైన ప్రియమైన విషయంగా అధ్యయనం చేశాడు. ఆసబ్జక్టులో ఫస్టుక్లాసు మార్కులు తెచ్చుకున్నాడు. ఇంటర్మీడియట్‌లో గుడివాడ కాలేజీలో తెలుగులో ఫస్టుక్లాసు తెచ్చుకున్నాడు. ఆ కాలేజీలో నడుపుతున్న తెలుగు పత్రిక సంపాదకవర్గంలో ముఖ్యుడు జాగ్రఫీ అంటే కూడా ఎంతో యిష్టమని అందులో కొంత పరిశోధన చేద్దామనుకున్నానని ఒక ప్రసంగంలో ముచ్చటించారు. అవిధంగా బి. యే. ప్యాసు అవడంతో [illegible] శ్రీ

చెందిక బి. కాం కూడా పొందాడు. ఇన్నాళ్ళూ ఊరికే ఉండకుండా స్థానిక ప్రముఖ చిత్రకారుడు శ్రీ వేణుగోపాలరావు గారివద్ద చిత్రకళా విద్యనుకూడా అధ్యయనించాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు సాంకేతిక పరీక్షలన్నీ ప్యాసు అయ్యాడు. చిత్రలేఖనం వాస్తవిక శైలిలో నేర్చుకుంటూనే సాహిత్య పరిచయం కూడా చేసుకున్నాడు.

శ్రీ రామారావు మద్రాసులో కొంతకాలంపాటు ప్రముఖ చిత్రకారుడు శ్రీ క. శ్రీనివాసులువద్ద శుశ్రూషచేసి, కళలోని మెళుకువలను గూర్చి తెలుసుకున్నారు. తరువాత మద్రాసు ప్రభుత్వ చిత్రకళాశాలలో విద్యార్థిగా చేరి చిత్రకళా సాధన చేశాడు. కె. సి. యస్. పణిక్కర్ వద్దకూడా ప్రభుత్వ సాంస్కృతిక ఉపకారవేతనం పొందుతూ కళ నేర్చుకున్నాడు. ఎంతమంది వద్ద నేర్చుకున్నా కళలోని వైశిష్ట్యాన్ని తెలుసుకోవటానికి మాత్రమే పాటుపడుతూ, తన స్వకీయమైన శైలి నేర్పరుచుకుని అనేకమైన కళాఖండాలను సృష్టించాడు. శ్రీ రామారావు చిత్రాలనేకం భారతదేశంలోనే కాక విదేశాలలోకూడా అమ్ముడు పోయినాయి. అఖిలభారత కళా ప్రదర్శనలలో పారితోషికాలను పొందినవి. అంతర్జాతీయ కళా ప్రదర్శనంలో ప్రదర్శితమై మన్ననల నందుకొన్నది. 'పక్షితో స్త్రీ' 'చెట్లూ - పర్వతాలూ' 'పర్వతాలూ - చంద్రుడూ' 'స్టిల్ లైఫ్' అనే చిత్రాలు అతనికి పారితోషికాలను తెచ్చిపెట్టడమే కాక పెద్ద పెద్ద మొత్తాలకు అమ్ముడు పోయినవి.

శ్రీ రామారావు ఆధునిక చిత్రకళా శైలిని పూర్తిగా అవగాహన చేసుకొని చిత్ర రచన సాగిస్తున్నాడు, క్యూబిజం నుంచి "అబ్‌స్ట్రాక్టిజం" వరకూ తన చిత్రసరళిలో మనకు చూపించారు. "ఆసీనురాలు" 'నాద స్వరం' 'వాయివ్యగాల్లు' 'దీపావళినాటి' 'స్నానం చేస్తున్న స్త్రీ' 'బలియజ్ఞ' మొదలైన చిత్రాలు; ఈ వివిధ శైలులలో చిత్రించబడినవి.

శ్రీ రామారావు చిత్రాలపై భారతదేశంలోని అన్ని ప్రముఖ పత్రికలూ ప్రశంసాపూర్వక విమర్శలు చేసినవి.

శ్రీ రామారావు ఇటీవల కామన్వెల్తు స్కాలర్‌షిప్ స్కీము క్రింద ఉన్నత విద్యాభ్యాసానికై ఆంధ్రదేశం నుంచి ఎన్నుకొనబడినాడు.

ఈ 17 వ తేదీన విమానంలో బొంబాయి నుంచి లండన్ వెళ్ళారు. శ్రీ రామారావు లండన్‌లో స్లేడ్ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్సులో ఉన్నత విద్యాభ్యాసం ద్వారా విజాతీయ చిత్రకళ యొక్క ప్రముఖ్యాన్ని తెలుసుకొని అమూల్యమైనపరిజ్ఞానాన్ని పొంది ఇనుమడించిన అనుభవంతో ఆంధ్రదేశ చిత్రకళకేగాక మొత్తం భారతీయ కళకే వన్నె తెచ్చే అపరూప కళాఖండాలను సృష్టించగలడని నమ్ముతాను.

శిరందాసు వెంకట రామారావు

వధూవరులు



చిత్రం: శ్రీ యస్. వి. రామారావు

భోజన సమయం



చిత్రం: శ్రీ యస్. వి. రామారావు

చెఱసాల

(4 వ పేజీ తరువాయి)

కోటయ్యలు తేరుకొన్నారు.

"ఇప్పటికి తెలిసింది నాయాలుకు" అన్నాడు కోటయ్య.

"అదే పదేలు" అంది రమణమ్మ. రాజు మాత్రం ఏదో సుదీర్ఘమైన ఆలోచనల్లో మునిగి పోయినట్లు అతని ముఖ భంగిమలు తెలియజేస్తున్నాయి.

20

"రాజా! అయిపోయింది; అంతా బుగ్గిపాలయిపోయింది" రమణి గుండె బాదుకొంటూ పరిగెత్తి వచ్చింది.

"ఏమైంది?" రాజు హడావిడిపడ్తూ అడిగాడు.

రమణమ్మ యివ్వాళ వుదయాన్నే లేచి కుప్ప నూర్పించడానికి కళ్లం కోద్దామని వెళ్ళింది. ఇంకేముంది? కుప్ప రాత్రి ఎప్పుడు కాలిపోయిందో ఎఱ్ఱని నిప్పుల నుసిమట్టుకు మిగిలిపోయింది. ఇంక నిలువలేక పగిలి విచ్చే గుండెలు అదిమిపట్టి పరుగెత్తి వచ్చి, "కుప్ప తగలబడిపోయింది బూడిద కూడా గాలికి కానామట్టు ఎగిరిపోయింది" అని చెప్పింది. అది విని, రాజు నిశ్చేష్టుడయ్యాడు. క్షణకాలం అతని కేటూ తోచలేదు. అంతలోనే కనుబొమ్మలు ముడివడ్డాయి. కళ్లు చింత నిప్పులయ్యాయి.

రాందాసూ, ఏసోబును తీసుకొని వెళ్ళినప్పుడైనా అతనింత క్షోభపడలేదు. సంవత్సరం కష్టించి పండించుకొన్న పంట అగ్గిపాలైంది. ఇదికేవలం ఓంకారయ్య కావాలని చేయించినట్లుగా తెలుస్తుంది. ఇంకా యిందులో అనుమానం లేదు, యెంతకాలమని యిలా సహించేది? దీనికి విమోచనలేదా? న్యాయం ధర్మం అనేవి కనిపించవా? ఎంతకాలమిలా జీవచ్ఛవాలై నీటిపై చెండులా తేలియాడేది?

రాజు తన్నుతాను తమాయించుకోలేకపోయాడు.

గుండె కొట్టుకుంటున్న సవ్వడి వినే వాళ్ళను కలవరపెట్టేంత జోరుగా పైకి వినవస్తోంది.

"తాతా ఇంక మనం కళ్ళు మూసి వుంటే లాభంలేదు. తనువులు శాశ్వతం కాదు - నడవండి - మన పెల్లువను కదలించండి - మనలో చైతన్యం లేకపోబట్టే అడుగడుగునా మన జీవితాలు క్షుద్ర పీడితాలవుతున్నాయి - ఏమంటావ్"

రాజుగొంతు భయంకరంగా ధ్వనించింది.

తాతయ్య కూడా "పదండి" అన్నాడు. రమణమ్మకు ఒకరు చెప్పే పని లేకపోయింది. వీరనారి రుద్రమ్మలా కళ్ళ నిప్పులు చెరుగుతూ ఒక పదుగురు తోటి గ్రామిక స్త్రీలనందరినీ వెంటబెట్టుకొని వచ్చింది. గ్రామం కూడా పొలికేక పెట్టారు. అందరూ దూకులు దూకుతూ వచ్చిపడ్డారు. వాళ్ళిప్పుడు మానవులుగా కనిపించడంలా? పచ్చి మాంసానికి పరుగులుదోసే సింహాలా, రక్తాన్ని తోడిత్రాగే పెద్దపులుల్లా - వాళ్ల ప్రతి అవయవకదలికలో నూ రాక్షసత్వం స్ఫూర్తి చేస్తోంది. ఈ సమయంలో వీళ్ళనడ్డుకొనే వీలేదు. అడ్డినా నిలవగలిగేదిలేదు.

"మిత్రులారా! మనం ఆకలితో అలమటిస్తున్న సమయంలో కూలిరేట్ల కొరకు పోరాడాం. ఫలితం శూన్యం. కానీ అనేక యిబ్బందులకు గుర్తై ఎముకలగూళ్ళలా తయారయ్యాం. ఇవాళ అన్యాయాలూ-అక్రమాలూ మితిమీరిపోతున్నాయ్ యివీటిని ధైర్యంగా ఎదిరించకపోతే ఇక లాభంలేదు.

హుం, పదండి!
"మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది!
"పదండి ముందుకు:
పదండి త్రోసుక,
పోదాం పోదాం పైపైకి!
కదం త్రొక్కుతూ,
పదం పాడుతూ,
హృదంతరాళం గర్జిస్తూ,
దారిపొడుగునా గుండె నెత్తురులు
తర్పణ చేస్తూ పదండి ముందుకు!

అని ఆ జన ప్రవాహం ఓంకారయ్య ఆవరణలోకి వచ్చిపడింది. ప్రశాంతమైయున్న ఆ పల్లె వాతావరణం బీభత్సమై భీషణ ఘోష పెడుతోంది.

ఓంకారయ్య మేడపై అంతస్తులో వుండి యీ పెల్లువను పరికించాడు. భంగుతిన్నాడు; పిచ్చెత్తినట్లు అటూయిటూ పరుగు మొదలెట్టాడు. ప్రక్కనవున్న పాలేరు పుల్లిగాడు, కరణం కోరశాస్త్రి గడగడలాడిపోతున్నారు

"పదండి మేడెక్కి వాళ్ళని పట్టుకోండి!" అని రాజు ఆదేశించాడు.

జనం మేడ మెట్లెక్కడం ప్రారంభించింది.

చంద్రమతీ, లలితలుకూడా మేడ వరండాలో కొచ్చి యీదృశ్యం చూస్తూ బిత్తరపోయారు. లలిత ఉద్రేకంతో గంతువేసి జనంలో కలువబోయింది. ఓంకారయ్య పరుగెత్తివచ్చి, జూటుపట్టి, "దీన్ని యీడ్చుకువెళ్ళి గదిలోకి తోసి తాళం బిగించు" అంటూ కరణం కోరశాస్త్రి నుద్దేశించి హుంకరించాడు. కోరశాస్త్రి లలిత చెయ్యి పట్టుకొని యీడ్చుకుంటూ గదిలోకి నెట్టి తలుపులు బిడాయించాడు.

"రాజూ! దారుణం. లలితను యీడ్చుకు పోతున్నారు" అంటూ రమణమ్మ మేడమీదికి పరవళ్ళు తొక్కింది. అందరూ ఆమె వెంట పరుగెత్తారు. ఓంకారయ్య మేడమీద నేకో వేపుకువెళ్ళి నిలబడ్డాడు.

"పట్టుకోండి! పట్టుకోండి!! అని రాజు అరిచాడు. అందాకా ఓంకారయ్య పక్కనవున్న పుల్లిగాడికి ఏం పుట్టిందో, వెంటనే మహోరౌద్రంతో దాడుతీసి ఓంకారయ్యను పట్టుకోబోయాడు. "ధాం" అనే ప్రేలుడు శబ్దం వినబడింది. పుల్లిగాడు నెత్తురు కారుతున్న గుడ్డతో వెనకడుగు వేసి, "చాలు! యివక్కడ మళ్లండి, ఆయన దగ్గిర పిస్తోలుంది" అని రాజునూ, తతిమ్మా వాళ్ళనూ ఉద్దేశించి కేక వేశాడు. వాళ్ళకామాట వినిపించలేదు. పుల్లిగాడి భుజం వెంట రక్తం కారటం చూచి మరీ రెచ్చిపోయారు. రాజు దూకి పడుతున్నాడు. రమణి అంటికన్నా ముందే దూసుకుపోయి ఓంకారయ్యను పట్టుకోబోతుండగా మళ్ళీ పెద్ద మోత మేడ ప్రతిధ్వనించింది.

"రాజా!" అని రమణమ్మ కేక పెడుతూ దిక్కులేటుగా వెనక్కి విరుగ తీసుకొని పడిపోయింది రాజు పట్టుకోబోయాడు. కాని లాభంలేకపోయింది. రొమ్ములోనుంచి రక్తం వోనవడి కారుతూ నేలపై కాలువలు కట్టింది.

రాజు దుఃఖాన్ని అణచిపెట్టుకొని పళ్లు కొరుకుతూ, ఓంకారయ్యమీదికి దూకాడు. పిస్తోలు లాక్కొని గిరి పెట్టాడు. ఓంకారయ్య యెగిరి క్రిందికి దూకాడు.

జనం బెలబెలమంటూ క్రిందికి పరుగులు దోలింది. ఐతే తాతమాత్రం కదలేక పోయాడు.

"రాజా!" అని రమణమ్మ హీనస్వరంతో పిలిచింది. ఇంతలో తాత, లలితకూడా అక్కడికి వచ్చారు. రాజు రమణమ్మదగ్గరకు వెళ్ళాడు. ఆమె కళ్లు నిండా నీళ్ళు తిరుగుతున్నాయి. రమణమ్మ రాజు చేతిని విడువకుండా పట్టుకొని వుంది. కోటయ్య తాత నెత్తురు మాపలేక చేతో కళ్లుమూసుకొన్నాడు.

లలిత ఆ దృశ్యంచూచి శోకవివశ అవుతూ రమణమ్మమీద వాలిపోయింది.

"లలితా! నేనింకో క్షణంలో యీ లోకాన్ని విడిచిపోతుండగా! నీపట్ల నేనేమన్నా తప్పుగా ప్రవర్తిస్తే క్షమించు. నువ్వు నా చెల్లిలాంటి దానివి.

"... రాజా! ... యిట్లారా ... నీ మీద నేనెన్నో కలలు కన్నాను — నా కోరికొకటి మన్నింతువా ... ఏదీ నీ చెయ్యి ఇటివ్వు ... లలితా! నువ్వు కూడా చెయ్యి ఇవ్వాలి! ... ఆ ... మీ యిద్దరూ ... మీ యిద్దరూ ... సుఖంగా పెళ్ళి హఠాత్తుగా రమణమ్మ గొంతు ఆగిపోయింది

"రాజా, లలిత, కోటయ్య తాత అక్కడున్న వాళ్ళందరూ "రమణీ! రమణీ" అంటూ మేడ పగిలిపోయేట్టు భోరున ఏడ్చారు. ఇంతలో కొంతమంది గొంద్రుపెట్టి మూల్గుతున్న ఓంకారయ్యను కిందినుంచి పైకిలాక్కొచ్చారు.

అతన్ని చూచి చంద్రమతి ఏడుస్తూ, వచ్చి మీద పడబోయిందిగాని. ప్రక్కనున్న వాళ్ళు ఆమెను చేరనివ్వకుండా నెట్టివేశారు. మేడమీదనుంచి దూకేసరికి ఓంకారయ్య కాళ్ళిన్నీ విరిగి ఎముకల ప్రోవులా ఐపోయాడు.

అతని నోటినుంచి గోంద్రుగోంద్రుమన్న ధ్వని వినవస్తుంది.

ఇంతలోనే పుల్లిగాడు తనకి తగిలిన దెబ్బ లెక్క చెయ్యకుండా కొంతమందిని వెంటబెట్టుకుని కరణం కోరశాస్త్రిని పట్టించి అక్కడికి నెట్టించుకొచ్చాడు. అందరూ కోరశాస్త్రి మీద విరుచుకు పడబోయారు. రాజు వాళ్ళని గద్దించి ఆపాడు.

ఓంకారయ్య ఇదంతా చూశాడు. మూలుగుతూనే "రాజా! అతన్నేమీ అనకండి. అన్నిటికీ నేనే కారకుణ్ని. వెఱ్ఱి అహంకారంతో రాందాసు కుప్పకు అతనిద్వారా నేనే నిప్పుపెట్టించాను. ఆవేశంలో ఒక నిండు ప్రాణాన్ని కూడా బలిగొన్నాను. మీకు కూలి నాలీ లేకుండా బ్రతుకున్నన్నాళ్లు ఎన్నో హింసలు పెట్టాను. ఇక నా పని అయిపోయింది మీకు జయభేరి మ్రోగించుకోండి. నాసర్వస్వం మీకు దఖలుచేస్తున్నా... అంటూ ఇంకా ఏమో చెప్పబోతుండగా మధ్యలో ఆ మాంతం మాట పడిపోయింది గొంతు గుడగుడలాడటం మొదలుపెట్టింది. క్షణంలో అది కూడా మాయమయింది.

ఎన్నో బాధల్ని, ఎంతో బరువునూ దించేసుకొని తేలిగ్గా దాటిపోయినట్లు ముఖం తేటపడింది. ఎంతో హాయిగానూ, సంతృప్తిగానూ సాగిపోతున్నట్లు కనులు ప్రశాంతంగా మూతలుబడ్డాయి. గుండెలు పగిలి చీల్చుకొని వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక భార్య చంద్రమతి ఆ మృతకళేబరం పైన బడి 'హోరు'మని విలపించింది.

హృదయం అగ్నిపర్వతంలా పగల సిద్ధంగా వున్నా దుఃఖమంతా దిగమింగి నిండుకుండలా వుండిపోయింది లలిత. ఊహాకందని, భావాలకు దొరకని ఏదో, ఏదో వాడిన నవ్వొకటి రాజు పెదవులనుండి అలా గాలిలో కలసి తేలిపోయింది.

సమాప్తం

పశ్చిమ యూరప్‌లో భారత రాయబారులు

పారిస్‌లో నెహ్రూ భేటీ

పారిస్, సెప్టెంబరు 21

ప్రధాని నెహ్రూ నేడిక్కడ పారిస్‌లోని భారతరాయబారి ఆలీయావర్ జంగ్ బసవద్ద పశ్చిమ యూరోప్ దేశాలలోని భారతరాయబారుల్ని కలుసుకొన్నారు.

ఏజంట్లు కావలెను

ఆఫ్‌సెట్ క్యాలెండర్లకు ఆర్డర్లు బుక్ చేయుటకు ఏజంట్లు కావలెను. మనోహరమైన డిజైన్లు, లాభదాయకమైన కమీషను. వ్రాయుండి

ELITE CALENDAR Co.,
P. B. 1927, Madras-1



బాల శూలార్క

గ్రైప్ మిక్చర్

వాడుక పదముల పోటీ

బహుమతి పొందిన వారి జాబితా:

2 మొదటిబహుమతులు: నేషనల్ ఎకోరేడియో మోడల్ "A767"

(1) మిస్టర్ హాతిమ్ ఎ. షఫిక్,
సైఫీమొహల్లా, జపా బజార్, సూరత్.

(2) మిస్టర్ బి. యమ్. పోరవాల్,
C/o షా ఇంద్రమల్ భగవాన్‌జీ
పోస్టుబాగ్రా (మార్వార్) రాజస్థాన్.

3 ద్వితీయ బహుమతులు: ఝంకార్ ట్రాన్సిస్టర్ రేడియో

(1) శ్రీమతి అంజనాదేవిశర్మ,
పురానా ఖజానా ఛావనీ అగర్-మాల్వా, యం. పి.

(2) మిస్టర్ బి. వై. నాదకర్ణి,
హౌస్ 8 సి, 22-బి. చండీఘర్ (పంజాబు)

(3) మిస్ సుధా ఆర్ దేశముఖ్
10/495, డర్లేస్‌హౌస్ చిట్‌నావిస్‌వాడ వెనుక,
మహల్, నాగపూర్-2, ఎం. ఎస్.

5 తృతీయ బహుమతులు: ఉషా కుట్టుమిషను

(1) శ్రీ వి. యమ్. దేవ్,
C/o మెస్సర్సు శివరతన్ జి. మెహటా
చందపోల్ బజారు, జయపూర్ (రాజస్థాన్)

(2) శ్రీమతి ఆనందిభాయి ఆర్ కర్కారే
సతీష్‌వాడ, పరుత్తన్ హైస్కూలు వెనుక, అమరావతి (విదర్భ)

(3) శ్రీ రజనీకాంత్ యం కురావి,
C/o షా మోహన్‌లాల్ కాంజి,
తాజ్నాపేట, అకోలా మహారాష్ట్ర)

(4) శ్రీమతి కుసుమలత,
20, లక్ష్మణ్ చౌక్ డెహ్రాడూన్ (యు. పి.)

(5) శ్రీమతి మీరా జి. మనేల్,
3. 3/38 న్యూకాలనీ సెటికో, జంషెడ్‌పూర్-4 (బీహారు).

4 వ బహుమతి సంపుటి వంటకుక్కర్ విజేతలైన 15 మందికి మరియు కన్సొలేషన్ బహుమతి ప్రోగ్రెస్ పికిపిక్స్ విజేతలైన 125 మందికి ఈ సందర్భంలో వారికి వేరుగా తెలియపర్చబడును.

విజేతలందరకూ మా హృదయపూర్వక అభినందనలు
మరియు పోటీదారుల కందరకూ మా ధన్యవాదాలు

బాల శూలార్క

ఉపయోగించు వారిచే ఉత్తమోత్తమమైనదిగా
ప్రశంసించ బడినది.

జండూ ఫార్మాస్యూటికల్ వర్క్సు లిమిటెడ్
గోఖలే రోడ్ సౌత్, బొంబాయి - 28.

(ZPW-P-762.TE)

చిత్ర జగత్తు

సినిమాలలో సంఘర్షణ

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

కథల్లోనూ నవలల్లోనూ సంఘర్షణ ఉంటే ఉంటుంది, లేకపోతే లేదు. కాని నాటకాలలోనూ, సినిమాలలోనూ సంఘర్షణలేకుండా జరగదు. సంఘర్షణ లేకపోతే క్లయిమాక్సు ఉండదు, అదిలేకపోతే సినిమాకు కట్టదు. ఆ కారణం చేతనే సినిమా కథలలో సంఘర్షణ ప్రవేశ పెడుతున్నారు. అది ఎలువంటి సంఘర్షణ, ఎలాటి సాంఘిక వాతావరణంలో అది సాగుతుంది. అందులోగల రెండు పక్షాలగల ఆదర్శాలేవి, వాటికి గల తారతమ్యమేమిటి-ఇత్యాది ప్రశ్నలు చిత్ర నిర్మాతలను అంతగా బాధించవు.

నాటికి తొంభైపాళ్లు సినిమాసంఘర్షణ అన్నది నాయికా నాయకుల వివాహసమస్యను ఆశ్రయించివుంటుంది. సినిమాలలో ప్రేమ వివాహాలకు తప్ప, ఇతర వివాహాలకు గణ్యత లేకపోవటం గమనించతగినది. కారణాంతరాలవల్ల విధివశానో, ధర్మానికి కట్టుబడో, పెద్దలమాట తీసివెయ్యలేకనో నాయికా నాయకులలో ఒకరు ప్రేమేతర వివాహాలు చేసుకున్నప్పటికీ అది పూర్తిగా తృప్తికరమయిన వివాహంగా చిత్రించబడదు. ప్రేమేతర వివాహం చేసుకున్నది నాయకుడైతే, వాడి పెళ్ళాం చస్తుంది. చివరకు నాయికా నాయకుల మధ్య "మాంగల్యం తంతునానేన" అయి తీరుతుంది. కర్మకాలక ప్రేమేతర వివాహం చేసుకున్నది నాయిక అయిన పక్షంలో దానికి విమోచనం అంటూ ఉండదు. ఒకవేళ మొగుడుపోయినా కథానాయిక విధవగానే ఉండిపోతుందిగాని నాయకుణ్ని పెళ్ళాడదు.

అయితే మనం ఒకటి జ్ఞాపకంపెట్టుకోవాలి. ప్రేమ నిత్యం; అది నశించదు. పెళ్లికి దారితీసినా తీయకపోయినా అది వొత్తి, చమురు లేని దీపంలాగా వెలుగులోనే ఉంటుంది.

చారిత్రిక దృష్టితో చూస్తే ఈ పరిస్థితి మనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. సినిమాలో ప్రతిబింబించే సాంఘిక సంస్కృతిలో ప్రేమకూ, ప్రేమ వివాహాలకూ అగ్రస్థానం ఉండటమూ, వితంతు వివాహాలకు స్థానం లేకపోవడమూ ఆశ్చర్యకరం. ప్రేమ వివాహాలు భవిష్యత్తుకు సంబంధించినవి. అవి మన సమాజంలో ఇంకా పరిపాటిగా జరగటం లేదు. వితంతు వివాహాలు ఏనాడో ఆరంభమై పరిపాటిగా జరుగుతున్నాయి. ఈ భూత భవిష్యత్తులను సినిమా నిపుణులు ఎలా సమన్వయించగలిగారు ?

దీనికి కీలకం సినిమా ప్రేమలో ఉన్నది. సినిమా ప్రేమ మామూలు ప్రేమలాటిది కాదు. జంకూ, గొంకూ అనుమానమూ ఏమీ లేదు. ధన, ఋణ విద్యుత్తులనుమోసే మేఘాలమధ్యకొట్టే మెరుపులాగా అది నాయికానాయకుల మధ్య బ్రహ్మాస్త్రంలాగా ప్రయోగితమై పోతుంది. సినిమా ప్రేమికులు ఒకరినొకరు చూసి ప్రేమించుకుంటారా, ఒకరి కంఠధ్వని ఒకరు విని ప్రేమించుకుంటారా, ఈ ప్రేమ ఎలా ఏర్పడుతున్నది అని నేను చాలా పరిశోధించాను. నాకు సమాధానం దొరకలేదు. ఒకరి గుణశీలాన్ని ఒకరు ప్రేమిస్తున్నట్లు దాఖలా దొరుకుతుందేమోననికూడా పరిశీలించాను. అటువంటిది ఒకటి ఉన్నదని నిర్ధారణగా రుజువు కావటం లేదు. నేను గ్రహించగలిగినంతవరకు సినిమా ప్రేమకూ తారల స్థాయికీ మాత్రమే సంబంధం ఉంటున్నది. చిత్రంలోని ప్రముఖ స్త్రీ తార ప్రముఖ పురుష తారను ప్రముఖాలు కానిపక్షంలో నెగ్గలవుతోంది. అంతకన్నా రహస్యం ఏమీలేదు.

కథానాయకుడు తాను ప్రేమించలేని పిల్లను గురించి తండ్రితో ఘర్షణ పడి, "నాన్నగారూ, నా ప్రాణాలైనా వదిలేస్తానుగాని మీరు చెప్పే అమ్మాయిని వివాహంచేసుకోలేను. నన్ను అర్థం చేసుకోండి." అంటుంటే ప్రేక్షకుడికి "ఈ యబ్బాయికి ఆ పిల్లనటిని ప్రేమించటం యిష్టంలేదు కాబోలు," అనిపిస్తుంది. నాగేశ్వరరావు, రామారావు, జగ్గయ్యలు, సావిత్రి, జమున, కృష్ణకుమారిలను నిరాకరించటం మంచి తెలివి చూడదని రూఢిగా చెప్పవచ్చు.

ఇది ప్రబంధాలనాటి ప్రేమ, శకుంతలా దుష్యంతుల ప్రేమ, వరూధినీ ప్రవరాఖ్యుల ప్రేమ. కనీసం వరూధిని ప్రేమ మనం నిత్యజీవితంలో ప్రేమ అనుకునేది మాత్రం కాదు. కణ్వాశ్రమంలో శకుంతలతో చెంత ఉన్న అనసూయా ప్రియంవదలు అందంగా ఉంటే దుష్యంతుడు వాళ్లవెంటపడేవాడు. కాని అనసూయా ప్రియంవదలు పూర్తిగా "సపోర్టింగ్ ఆర్టిస్టులు..."

ఇంకొకందుకూడా సినిమా సంఘర్షణమునకు అభ్యుదయమార్గంలో, ముందుచూపు కలిగిఉన్నట్లు, భ్రమ కలిగిస్తుంది. సినిమా నాయికా నాయకులు ప్రేమించటంలో కులగోత్రాలనూ, తమ కుటుంబపు పరువు ప్రతిష్ఠలనూ తృణీకరించినట్టు కనబడతారు; ప్రేమకోసం వాటితో ఘర్షణ పడతారు. స్త్రీ పునర్వివాహాలు చిత్రించటానికి గుండె ధైర్యంలేని నిర్మాతలు యింత "విప్లవం" ఎలా చేస్తున్నారా అని మనం విస్తుపోతాం.

నిజానికి యిందులో విస్తుపోవటానికేమీలేదు. సినిమా తెరమీద కులాలేమీ లేవు. ఈసంగతి మనం "మాలపిల్ల"నాడే చూశాం. అందులో మాలపిల్లలేదు - కాంచనమాల మాత్రమే ఉన్నది. ఈ మాలపిల్ల పాత్ర తెరమీదికి వస్తూనే బసవరాజు అప్పారావుగారి గేయం "లల్లాయి పదం" కింద పాడేస్తుంది. అయిదు నిమిషాలు తిరిగేలోపుగా అష్టపదివిని, అర్థం చేసుకుని, ఆనందిస్తుంది! "మాలపిల్ల" చిత్రంలో నిజమయిన, వాస్తవమైన మాలపిల్లనే నాయికగా చేసివుంటే ఆచిత్రం ఊసూ పేరూ లేకుండాపోయి వుండేది.

నిన్న మొన్న విడుదలయిన "కులగోత్రాలు" చిత్రంలో నాయిక కృష్ణకుమారిఅయి, మంచి మంచి నైలానులు కట్టి, ఆకర్షవంతంగా కనపడటంమాట అటుంచి, ఆ నాయికకు కులగోత్రాలున్నాయి! ఆమెకోసం నాగేశ్వరరావు తనవారిని "త్యాగం" చేసినా, అది విధిలేక చేసిన త్యాగమని అడుగడుగునా చిత్రం రుజువుచేస్తూనే వుంది. తండ్రిని మరిచిపోనని నాయకుడు మాటయిచ్చాడు. తల్లిమీదా, చెల్లెలిమీదా ప్రాణాలు వుంచనే వుంచాడు. చిత్రం పూర్తి అయ్యేసరికి సంఘర్షణ అంతా అపోహలపై నడచినట్టు తేలిపోయింది!

ఈ విధంగా పచ్చి అబద్ధాలతో కృత్రిమ సంఘర్షణలు సృష్టించి, వాటికి అభ్యుదయపు రంగులు పూసి చిత్ర నిర్మాతలు ఆంధ్రదేశపు జన బాహుళ్యాన్ని రంజింపచేస్తున్నారు, జన బాహుళ్యం రంజిస్తున్నది!

'నువ్వా-నేనా'

కౌసల్యా ప్రొడక్షన్సువారి 'నువ్వా-నేనా' సెప్టెంబరు 28 న విడుదల అవుతున్నది.

ఇద్దరు మిత్రుల మధ్య ఒక అమ్మాయి కారణంగా వైరం జనిస్తుంది. ఈమిత్రుల్లో ఒకరిని ఆదేశపు రాకుమారి ప్రేమించింది. కాని చివరకు తాను మనసు మార్చుకోవలసి వస్తుంది. ఈవిధంగా కథ పొడవునా "నువ్వా-నేనా" అనే ఆత్రతను ప్రేక్షకుల్లో కలిగిస్తూ ఫైటింగ్సుతో, సంగీతంతో, వినోదమిచ్చే ఈ చిత్రంలో రాజనాల, కాంతారావు, రాజశ్రీ, దేవిక, కన్నాంబ మున్నగువారు నటించారు. దర్శకుడు ఎ. శేషగిరిరావు, నిర్మాత ఎస్. భావనారాయణ, విడుదల పూర్ణా.

'శివరాత్రి మాహాత్మ్యం'

'స్వర్ణగౌరి' నిర్మాతలు శ్యాంప్రసాద్ మూవీస్‌వారు 'శివరాత్రి మాహాత్మ్యం' అనే చిత్రాన్ని కన్నడంలో నిర్మిస్తున్నారు. దీన్ని తెలుగులో కూడా నిర్మిస్తారట. 'స్వర్ణగౌరి'ని కూడా ఇలాగే కన్నడంలో నిర్మించి తర్వాత తెలుగులో నిర్మించారు. రచన: వీటూరి; దర్శకత్వం: వై. ఆర్. స్వామి.

"జల్సారాయుడు" "పెళ్ళికాని పిల్లలు" చిత్రాలు నిర్మించిన హైదరాబాద్ మూవీస్‌వారు మరొక సాంఘిక చిత్ర నిర్మాణానికి "సారథి" స్టూడియోస్‌లో సన్నాహాలు జరుపుతున్నారు.

హరేన్ ఘోష్ వారి 'మెహందీ లగే మేరే హాథ్'లో నందా, శశికపూర్

చిత్ర సమీక్ష

పచ్చి ఫిలిమ్సు వారి

హాంగ్ కాంగ్

అందాలు చిందే సుందరీమణుల నృత్యాలు, నేత్ర పర్వం చేసే ప్రకృతి దృశ్యాలు, విమానాలనుండి ప్రయాణాలు సాగుతుండగా (అక్కడనుండి చిత్రించిన) గంభీరమయిన సముద్ర దృశ్యాలు, ఎత్తయిన పర్వతపంక్తులు, తీర్చి దిద్దినట్లుండి కన్నులపండువు చేసే నగరవీధుల చిత్రీకరణ, వీనులకు విందు చేసే పాటలు, ఇలాంటి వాటిని రంగు రంగులలో రంగరించిన చిత్రం పచ్చి ఫిలిమ్సువారి "హాంగ్ కాంగ్."

ఇంచుమించు ఇదేమో స్థలంలోనున్న "సింగపూర్" కంటే కూడా యిది మరింత హుషారుగా, మజాగా కాలక్షేపం చేయించే చిత్రమని చెప్పాలి.

ఇవి సేరకుఅపరాధ పరిశోధక చిత్రాలయినా, నిజానికి కథకంటే హెచ్చుగా పాటలు, సంగీతం, మనోహర దృశ్య చిత్రీకరణ, నృత్యాలు ప్రధానంగా వుంటాయి. అందువల్ల యివి మిగతా వారికికూడా యిష్టకరంగా వుంటాయి.

చెప్పటానికి కథ ఆట్టే వుండదు. ఇండియాలో సింగ్ (కె. ఎన్. సింగ్) అనే (బంగారు, వజ్రాలు, కరెన్సీల) దొంగ పారిపోతుంటాడు. బక్షీ (అశోక్ కుమార్) అనే పోలీసు ఇంటెలిజెన్సు ఆఫీసర్‌కు ఈ దొంగలముఠాను పట్టుకొనే బాధ్యత అప్పగించబడుతుంది. ఈ సందర్భంగా ఈ ముఠా వరుసగా రంగూన్, సింగపూర్, బాంకాక్, హొనలూలు, హాంగ్ కాంగ్‌లకుమకాం మారుస్తుంటుంది, ఆఫీసర్ కూడా వారిని వెంటాడుతాడు.

ఆ సందర్భంలోనే సింగ్ ముఠాస్వాధీనంలో ఉన్న రీటా అనే నర్తకి (బి. సరోజాదేవి) తో బక్షీకి స్నేహం కలిగి గాఢమౌతుంది. కడకు ఈముఠాహాంగ్ కాంగ్‌లో దొరుకుతుంది.

పట్టుబడే ముందు కొట్లాటు, స్టీమ్‌లాంచి, హెలికాప్టర్ల పోరాటాలు ఇత్యాదయిన డిటో డిటో అంతా మామూలే.

అశోక్ కుమార్, సరోజాదేవి, కె. ఎన్. సింగ్, హెలెన్, ఓంప్రకాశ్‌లు పాత్రోచితంగా నటించారు.

లిల్లీ, లియోల నాట్యాలు ఈ చిత్రానికి ఒక విశేషం. సరోజ నృత్యాలుకూడా బాగున్నాయి. ఓ.పి. నయ్యార్ మధురసంగీతం, ఈస్టమన్ కలర్ దృశ్య చిత్రీకరణ - వీటిని మరింత రసవంతం చేశాయి. ఫోటోగ్రఫీని ప్రత్యేకంగా మెచ్చుకోవలసి వుంది. విదేశ చిత్రాల ఫొటోగ్రఫీకి మనవారు ఏమీ తీసిపోరని చెప్పదగినంతగా చక్కగా ఫొటోగ్రఫీ వుంది.

సరోజాదేవివంటి తారతో జంటగా అశోక్ కుమార్ వంటి వయోధికుణ్ని వేశారంటే, అందుకు కారణం ఊహించుకోగలం. కాని, హెలెన్ కుజోడీగా ఓంప్రకాశ్‌ను వేయడం, సరసాలు చేయించటం రసయుక్తంగా యుండలేదు.

అయినా ఆగ్నేయాసియా దేశాలలోని సుందరదృశ్యాలను ఎంతో ముచ్చటగా చిత్రించిన ఈచిత్రం తప్పకుండా చూచి ఆనందించవలసిందే!

విడుదల: వాణీ ఫిలిమ్సు.

'సీమంతినీ కల్యాణం'

దేవిక, కాంతారావులు నాయికానాయకులుగా, బాలకృష్ణ, మిక్కిలినేని, సూరిబాబు, రఘురామయ్య, సత్యనారాయణ, జయలక్ష్మి, సుశీల, మణి, లక్ష్మి, కనకప్రభ ఝాన్సీరాణి మున్నగువారు నటీనటులుగా, 'సీమంతిని కల్యాణం' అనే పేరున తయారవుతున్న చిత్రం దాదాపు పూర్తి కావచ్చింది. నిర్మాత, దర్శకుడు ఆర్. ఎం. కృష్ణస్వామి.

"కలకత్తా మెయిల్"

కౌసల్యా ప్రొడక్షన్సువారు "కలకత్తా మెయిల్" అనే అపరాధ పరిశోధక చిత్రాన్ని నిర్మించటానికి అప్పుడే సన్నాహాలు ప్రారంభించారు. దీన్నే వారు తమిళంలో తీసే చిత్రానికి "త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్" అని పేరు పెట్టారట.

చిత్రనిర్మాణం ప్రణాళికా బద్ధంగా జరగాలంటే.........

జ్యోతిశ్రీ

చిత్ర నిర్మాణంలో చోటుచేసుకు పోయిన అవలక్షణాల్ని స్థూలంగా చాల వరకు వర్ణించుకున్నాం. అయితే ఫిలిం పరిశ్రమ పరిణామ దశల్ని సింహావలోకనం చేస్తున్నప్పుడు సందర్భశుద్ధి వున్నంతవరకు మాత్రమే వీటిని వివరించాను. కాని యీ వారం శేషించిన అవలక్షణాల్ని వివరించుతాను. అంతేగాక వీటి మూలకంగా చిత్రాలలో, సహజత్వం - వాస్తవికత ఏ విధంగా తుడిచిపెట్టుకుపోతున్నవో కూడా తెలుసుకుందాం!

అగ్రతారల జులుం

వెనుక ఒకమారు మిత్రులు శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారు "ప్రపంచములో కెమెరా వెళ్ళగలిగిన చోటికెల్లా సినిమా నటులు వెళ్ళాల్సి వుంటుంది. అంటే సినిమాల్లో జీవిత దృశ్యీకరణ, చాల విశాలంగా సహజంగా వుంటుందన్నమాట" అని ఒక వ్యాసంలో పేర్కొన్నారు. కాని మన తెలుగు సినిమా దర్శక, నిర్మాతలు కెమెరాను, మదరాసు స్టుడియోల నుండి కదిలిస్తే మీసు పెట్టిన ఒట్టు. ఒక విధంగా దర్శక, నిర్మాతల్ని నిందించి కూడా ప్రయోజనం అగుపించడంలేదు. ఈనాడు దక్షిణ భారత సినిమావారికి అవుట్‌డోర్ స్థలాలుగా మిగిలిపోయిన మైసూరు బృందావనం-తమిళ్ నాడులోని సాతానూరు డాము గార్డెన్సు - తిరుపతి కొండలు, యీ మూడుచోట్లకు కూడా సక్రమంగా వెళ్ళి షూటింగు పూర్తి చేసేందుకు మన అగ్రతారలు తయారుగా లేరు. ఏమంటే తమకు పని ఒత్తిడి ఎక్కువగా వుందని, మద్రాసు స్టుడియోల్లోనే వేసిన నిర్జీవమైన ప్రకృతిదృశ్యం కల్గిన సెట్టులో అయితే లేక, నిర్మాతలు కిమ్మనకుండా ఈ పాపాల్ని భరిస్తున్నారు.

అగ్రతారల జులుం కేవలం యిలాంటి విషయాల్లోనే గాక, సాటి నటీనటుల పట్లకూడా చాల అపచారం జరుగుతూ వుంది. ఇందుమూలకంగా, ఒకరి బాధ్యతల్లో మరొకరు తలదూర్చడం - పరిస్థితులు కలుషితం కావడం మనం చూస్తూనే వున్నాము. "ఫలానా తారను మీరు బుక్ చేస్తే మీ చిత్రంలో నేను నటించను" అనేవారూ వున్నారు. "ఫలానా తారను బుక్ చేస్తేనే నేను నటించుతాను" అనే మహానుభావులూ వున్నారు.

ఈ పోకళ్ళవలన చిత్ర పరిశ్రమ ఏ విధంగా, దిగజారిపోతున్నదో - పరిశ్రమలో ఏ విధంగా క్రమశిక్షణా రాహిత్యం అలుముకొంటున్నదో - ఎవ్వరూ ఆలోచించే పాపాన పోలేదు.

ఈలాంటి విషయాల్లో ఫిలింఛేంబర్ కూడా ఏమీ పట్టించుకొన్నట్టు అగుపించడంలేదు. ఇప్పటికే, పరిస్థితులు చేతులు దాటిపోయినాయి! ఇప్పటికైనా దక్షిణ భారత ఫిలిం ఛేంబరు తమకు తాముగా పరిశ్రమలో పునరుద్ధరించాల్సిన క్రమశిక్షణ, ప్రవర్తనా నిబంధనావళి విషయమై కొన్ని నిర్దిష్టమైన సూత్రాలు తయారొనర్చి, నిర్మాతలు, నటీనటులు తదితరులు, తప్పనిసరిగా, అమలుజరిపేట్టు చూడ్డం-తక్షణ కర్తవ్యం. ఈ ప్రతిపాదన ఇదివరలో చాలమంది చేసివున్నారు.

చిత్ర నిర్మాణంలో చేపరుపక్కా సాగేప్పుడు చిత్రానికి రంగ విభజన జరుగుతుంది. దీన్ని 'స్క్రీన్‌ప్లే' లేక 'సినాప్సిస్' తయారు చేయుటం అని అంటారు. ఇది పూర్తి కాకముందుగాని, తర్వాతగాని నటీనటుల, వివిధ సాంకేతిక శాఖాధిపతుల ఎన్నిక జరిగి, సెట్టుపైకి పోతారు. 'స్క్రీన్‌ప్లే' పూర్తికాగానే మాటలు, పాటలు కూడా పూర్తిగా రచింపబడ్డ తర్వాత పాటలు అవసరమైన మేర రికార్డింగు చేసుకొని-మరల పేపరుపైవున్న చిత్రాన్ని పూర్తిగా పునః పరిశీలించి సెట్టుపైకి పోవడం-సలక్షణమైన పద్ధతి. కాని తెలుగు ఫిలిం పరిశ్రమ, అదేమి దురదృష్టమోగాని, సెట్టుపైకిపోయి, 'టేక్'కు ఉపక్రమించే సమయంలో కూడా రచయితలు మాటలు వ్రాసివేసే చెడ్డ విధానం అమలులోవుంది. అంతే నిర్మాతల ఆర్థికలేమి, అనుభవశూన్యత ఇందుకు ప్రధాన కారణాలు. ఈ సందర్భములో ఇంకొక విషయం చెప్పకతప్పదు. ఈ నాడు సినిమా రంగాన్ని, యువ రచయితలను గురిచేస్తున్న పదం ఒక్కటే. అదే రెండక్షరాల పదం. "మూడ్". ఈ మూడ్ సరిలేకపోవటం మూలకంగా, అన్ని సిద్ధమైన ఎన్ని కాల్ షీట్స్ ఆగిపోయినాయో, ఎంతమంది నిర్మాతలు దివాలా తీసేందుకు ఆస్కారం ఏర్పడిందో ఫిలిం పరిశ్రమ క్షుణ్ణంగా తెలిసిన వారికి ఎంతో వ్యాకులం కల్గిస్తుంది.

కాల్ షీట్ రెండు మూడు రోజులుండగానే - అథవా డైలాగు అసిస్టెంటుపోయి - ఫలానా సీనుకు మాటలు వ్రాసివ్వమని రచయితను ప్రాధేయపడ్డా, ఆయాసం తనకుముట్టాల్సిన యిన్‌స్టాల్‌మెంటు పైకం ముట్టిందే గాని కలం కాగితంపై పెట్టనంటాడు. ఎక్కడో బాధలు పడి పూర్తిగా కాకున్నా కొద్దిగానైనా పంపేసరికి పుణ్యకాలం కాస్తా సమీపిస్తుంది. అపుడు ఆదరాబాదరాగా రచయిత ఒక గుమాస్తా లెక్కలు చేసినట్లుగా ఏవో డైలాగులు వ్రాసిస్తాడు. డైలాగు అసిస్టెంటు అవి పట్టుకొని ఎకాఎకిని సెట్టుపైకి పోతాడు! మరి అక్కడ అవి పొందేరూపు వూహించ నలవి కాకుండా వుంటాయ్! అగ్రతారలు కాల్ షీట్ యిస్తామని అంటారు. ఈ పని ఒత్తిడి అనే పదం ఏ కొద్దిమందికో అన్వయించవచ్చును. కాని మిగతావారికి వర్తించదు. రేస్ కోర్సులకు, విచ్చలవిడిగా మద్యపానానికి-బెంగుళూరు, బొంబాయి నగరాలకు వెళ్ళేందుకు 'పనిఒత్తిడి' వుండదు కాని, ఏ రంగంఅయితే తమకు ఇంత పేరు ప్రతిష్ఠలు, వేలకు వేలు ఆదాయం సమకూర్చుతూ వుందో- దాని తిరోగమనానికి దానివిచ్ఛిత్తికి, దారి తీస్తూ- ఏవేవో పదజాలంతో తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకుంటూ వున్నారు.

బాక్సాఫీసు సూత్రంగా చలామణి అవుతున్న తారాబలాన్ని స్టార్ వాల్యూ నిర్మాతలు విసర్జించిననాడుగాని, మన చిత్రాలలో సహజమైన వాస్తవికమైన ప్రకృతి దృశ్యాలను మనం చూడలేము. ఏక కాలంలో ఇరవై చిత్రాలకు మించి పనిచేస్తున్న అగ్రతార-ప్రొద్దున కాల్ షీట్ ఒకరికి-మధ్యాహ్నం కాల్ షీట్ మరొకరికి-రాత్రి కాల్ షీట్ యింకొకరికి యిచ్చే విధానం అమలులో వున్నపుడు యిలాంటి పని ఒత్తిడి నెలలో 30 రోజులు వున్నపుడు - కనీసం-మద్రాసు వదలివెళ్ళి సాతానూరు డాముదగ్గ కాల్ షీట్ యివ్వాలన్నా వీలుపడుతుందా? లేదు-కాబట్టే మన చిత్రాలలో సహజమైన ప్రకృతి దృశ్యాలు కొరవడి-నిర్జీవమైన సెట్టింగుల దృశ్యాలు మిగిలి పోతున్నాయి! అయితే మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం పుణ్యమా అంటూ విద్యుచ్ఛక్తిలో కోత విధించిన ఫలితంగా ఆ మధ్య రాత్రి కాల్ షీట్‌లు మానివేశారు.

చిత్రాలు కళాత్మకంగా వుండాలని, తాము నటించే చిత్రాలలో ప్రతి సన్నివేశం సజీవకళతో - నిండుగా, గాంభీర్యంగా, హుందాగా వుండాలని వుద్దేశం కల్గిన ఏ వుత్తమ కళాకారుడు కూడా తన నటనలో వైవిధ్యం తీసుకు వచ్చేందుకు, ఏక కాలంలో అధిక చిత్రాలలో నటించడు. పాప్యులారిటీలో నేగాక, పరిశ్రమలోకూడా అగ్ర తారలన్న ప్రాబల్యాన్ని అధిగమించ

ఆ మాటల వుచ్చారణ తమకే మాత్రం సంతృప్తిగా లేకున్నా ఇచ్చవచ్చినట్లు మాట్లాడుతుంటారు. మరీ హాస్యనటుల విషయంలో రచయితవ్రాసిన డైలాగులు పూర్తిగా పోయి - ఇతర విషయాంతరమైన చిత్రాలలోని మాటల కూర్పుగా వాక్యాలు మిగిలిపోతాయ్! మరీ చింతించదగ్గ విశేషమేమంటే వీరే గాక, దర్శక, నిర్మాత తాలూకు బంధుమిత్రులు ఎవరైనా సెట్టుపైన వుంటే వారిసలహా మేరకు కూడా మార్పులు జరిగే సంఘటనలు లేకపోలేదు. ఈ స్థితిలో చిత్రాలు కళాత్మకంగా వుత్తమంగా వుండాలని ఆశించడం కూడా ఒక విధమైన వెర్రేమో అనిపిస్తుంది.

అనుకరణ, అనువాద చిత్రాల అలజడి

ఇటీవల ఫిలిం పరిశ్రమలో వేసిన వెర్రితలలలో ఇదొకటి. వుత్తమ లక్ష్యాలను ప్రబోధిస్తూ-వివిధ ప్రాంతాల, భాషల ప్రజల మధ్య సమైక్యతనుపకరించే - పరభాషా చిత్రాలను అనువాదం చేసుకోవడం సమంజసమే. కాని కేవలం వ్యాపార దృష్టితో ప్రతిబింబిస్తూ - తామరతంపరగా అనువాద చిత్రాలు వెలువడటం [illegible] శోచనీయం. తమిళంనుండి అనువదింపబడే అధిక సంఖ్యాక చిత్రాలు - కేవలం నగర జీవితాన్ని చిత్రించేవిగా వుంటాయ్! కాని మన ఆంధ్రదేశంలో అలాంటి చిత్రాలలోని సంస్కృతి, సాంప్రదాయాలకు స్థానం అంతగా వుండదు. అసలు తమిళ నిర్మాతలసృష్టి అంతా కూడా నగర ప్రజల మనస్తత్వాన్ని చిత్రించేదిగా వుంటుంది. తమిళనాడులో "సిటీసన్" అనదగ్గ నగరాలు ఎక్కువ. అదీగాక, వారి చిత్రాల రాబడికూడా వారిపై ఆధారపడి వుంటుంది.

అలాంటి చిత్రాలు వాటి సంస్కృతికి భిన్నంగా జీవించే పల్లెప్రజలు అధిక సంఖ్యాకులుగా వున్న ఆంధ్రదేశంలో సరిపోతాయా? అందుకే అనువాద చిత్రాలలో కూడా జానపద, పౌరాణిక చిత్రాలు మాత్రమే విజయవంతమవుతున్నాయ్! సాంఘిక చిత్రాలు ఘోరంగా దెబ్బతింటున్నాయ్!

ఇక-అనుకరణ చిత్రాలు ఇటీవల కాలంలో ఎక్కువగా వుంటున్నాయ్. ఆంధ్ర ప్రజలు ఏలాంటి చిత్రాలను ఆదరిస్తారో, ఇదమిత్థమైన అభిప్రాయాలు ఏర్పరచుకోలేని తెలుగు దర్శక నిర్మాతలు - ఇతర భాషల్లో విజయవంతమైన చిత్రాల కథలను తీసుకొని చిత్రనిర్మాణం సాగిస్తున్నారు. కాని వీరి సిద్ధాంతరీత్యా కూడా, అలా నిర్మింపబడ్డ అన్ని చిత్రాలు విజయవంతం కాలేదే? ఈచెడ్డ విధానం మూలకంగా-రచయితల్లో గాక, ఒక విధంగా నటీనటుల్లో సృజనాత్మక శక్తి నశించిపోతూవుంది. రచయిత కేవలం గుమస్తాగా డైలాగులు వ్రాసేస్థితికి వచ్చేశాడు.

నేడు సాగుతున్న ఈపాడు పద్ధతిని పరిశీలిస్తే - తెలుగులోని కథా సాహిత్యాన్ని గురించి, తెలుగు దర్శక, నిర్మాతలకు ఇసుమంతైనా తెలిసినట్లు లేదు. అంతేగాక సినిమా రంగంలోనే జీవిస్తున్న శ్రీ సదాశివబ్రహ్మం లాంటి రచయితల కథా కల్పనా శక్తి ఎవ్వరికీ అర్థమగుచున్నట్లు గోచరించడం లేదు.

ఈ అరిష్టాలన్నిట్నీ సూక్ష్మంగా పరిశీలిస్తే ముందుచూపు గాని ప్రక్కచూపు గాని చూడనొల్లక, బాక్సాఫీసు సూత్రాలంగా అల్లుకొన్న చట్రంనుండి వేరు పడేందుకు యిచ్చగించక - కేవలం ఒక గాడిన పడిపోయిన గానుగఎద్దు బ్రతుకులా జీవిస్తున్నట్లు కన్పిస్తున్నారు. పాపం శమించుగాక!

వచ్చేవారం డిస్ట్రిబ్యూషన్‌లో వున్న లోపాలను తెలుసుకుందాం!

ఈ నెల 16 వ తేదీన 'కులగోత్రాలు' నిర్మాతలైన ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి గౌరవార్థం నవయుగ ఫిలింస్‌వారు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన తేనీటి విందు సందర్భపు చిత్రం. ఇందులో హేమలత, కృష్ణకుమారి, లక్ష్మీరాజ్యంగార్లను చూడవచ్చు.



రైల్వే టీ స్టాలు

చిత్రం: శ్రీ యస్. వి. రామారావు

'తల్లీ - బిడ్డా'

త్వరలో విడుదల కానున్న శోనా ఫిలిమ్సువారి 'తల్లీ-బిడ్డా' చిత్రం తర్వాత, నిర్మాతలు 'అమ్మా - నాన్నా' అనే చిత్రాన్ని ప్రారంభిస్తారట. 'తల్లీ - బిడ్డా' లో హరనాథ్, బాలయ్య, లింగమూర్తి, నాగయ్య, పేకేటి, శివరావు, కృష్ణకుమారి, రాజశ్రీ, మీనాకుమారి మున్నగువారు నటించారు. దర్శకుడు పి. యస్. శ్రీనివాసరావు.

కుటుంబ నియంత్రణ ఉద్యమంపై చలనచిత్రాలు

ఉత్తమ కథాచిత్రానికి రు. 25 వేల బహుమతి

1962 లో ప్రదర్శనకు అనుమతింపబడిన చిత్రాలలో కుటుంబ నియంత్రణోద్యమాన్ని ప్రచారంచేసే ఉత్తమ కథా చిత్రానికి రు. 25 వేల నగదు బహుమతిని ఇవ్వాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఒక పత్రికా ప్రకటనలో తెలియచేసింది. అందులో ఇంకా ఈ వివరాలున్నాయి :

"చలన చిత్ర ప్రమాణం తగు స్థాయిలో ఉండేటట్లు చూసేందుకుగాను, కేంద్ర సమాచార రేడియో మంత్రిత్వశాఖ పథకం క్రింద ప్రభుత్వ బహుమతిని పొందడానికి అర్హత పొందిన చిత్రాలు లేదా ఈ పోటీ తేదీ నాటికి 12 వారాలు నడిచిన చలన చిత్రాలు మాత్రమే ఈ బహుమతికి పరిశీలించబడతాయి.

ప్రభుత్వ బహుమతులకై చిత్రాలు పంపవలసిందని కేంద్ర సమాచార రేడియో మంత్రిత్వశాఖ చేసే ప్రకటనతో పాటు ఈ పోటీకికూడా ఒక ప్రకటన ద్వారా 1962 డిసెంబరు మొదటి వారంలో చిత్రాలు పంపవలసిందని కోరడమౌతుంది. ప్రభుత్వ బహుమతులకువచ్చే చిత్రాలలో ఉత్తమమైన వాటిని సిఫారసు చేసేందుకు బొంబాయి, కలకత్తా, మద్రాసులలో గల ప్రాంతీయ సంఘాలు ఈ పోటీకి వచ్చిన చిత్రాలనుకూడా మొదట్లో పరిశీలిస్తాయి. ప్రభుత్వ బహుమతులకు ఉత్తమ చిత్రాలను నిర్ణయించేందుకు ఏర్పడిన కేంద్ర సంఘం సిఫార్సుపై ఈ పోటీకి వచ్చిన చిత్రాలలో ఉత్తమ చిత్రాన్ని గురించిన తుది నిర్ణయం జరుగుతుంది. 1962లో నిర్మించబడిన ఉత్తమ చిత్రాలకు ప్రభుత్వ బహుమతులిచ్చేందుకు కేంద్రసమాచార రేడియో మంత్రిత్వశాఖ ఏర్పాటుచేసే ఉత్సవంలోనే ఈ బహుమతి కూడా ఇవ్వబడుతుంది.

పి. ఏ. పి. వారికి 'నవయుగ' విందు

"కులగోత్రాలు" నిర్మాతలు ప్రసాద్ ఆర్ట్ పిక్చర్సు వారికి డిస్ట్రిబ్యూటర్లు నవయుగవారు హైదరాబాద్‌లోని సారథీ స్టుడియోలో సెప్టెంబరు 16 న విందు చేశారు.

నిర్మాత ఎ. వి. సుబ్బారావు, దర్శకుడు ప్రత్యగాత్మ, నటీ నటులు నాగేశ్వరరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, కృష్ణకుమారి, లక్ష్మీరాజ్యం, నవయుగ మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీ కాట్రగడ్డ శ్రీనివాసరావు, అన్నపూర్ణా పిక్చర్సు అధిపతి శ్రీ డి. మధుసూదనరావు, శ్రీ సుందరలాల్ నహాతా, దర్శకుడు శ్రీ ఆదుర్తి సుబ్బారావు, "కులగోత్రాలు" సాంకేతిక నిపుణులు మున్నగు చాలమంది ఈవిందుకు హాజరయ్యారు.

రాష్ట్ర శాసనమండలి అధ్యక్షులు శ్రీ ఎం. హనుమంతరావుగారు సమావేశానికి అధ్యక్షతవహించారు.

అన్నపూర్ణా సంస్థవారు హైదరాబాదులోని సారథీ స్టూడియోలో తమ క్రొత్త చిత్ర నిర్మాణాన్ని ప్రారంభించడాన్ని హర్షిస్తూ, ఇతర నిర్మాతలు కూడా వారి ననుసరించగలరనే ఆశాభావాన్ని రచయిత శ్రీ దాశరథి వెలిబుచ్చారు.

శ్రీ నాగేశ్వరరావు మాట్లాడుతూ దర్శకుడు శ్రీ ప్రత్యగాత్మ ఫిలిం పరిశ్రమలో ముఖ్యుడుగా అభివృద్ధిపొందినందుకు అభినందించారు.

శ్రీ నరసయ్యగారు వందనసమర్పణ చేశారు.

ముగింపు కాబడిన "మదనకామరాజు కథ"

నిర్మాత, దర్శకుడు శ్రీ విఠలాచార్య దర్శకత్వంలో "మదన కామరాజు కథ" నిర్మాణం పూర్తి అయింది. దసరా పండుగకల్లా ఆంధ్రదేశంలో విడుదలఅవుతుంది.

మాయలు, మంత్రాలతో, సంగీత, నృత్యాలతో, ఫైటింగులతో కూడిన ఈ చిత్రంలో కాంతారావు, హరనాథ్‌లు నాయకులుగా, సుజాత, అనూరాధ, జయంతి, రాజశ్రీ లు నాయికలుగా నటించారు.

ఆంధ్ర ఫిలిం వాణిజ్య మండలి ఎన్నికలు

అధ్యక్షులుగా తిరిగి శ్రీ చంద్రశేఖరరావుగారి ఎన్నిక

ఆంధ్ర ఫిలిం వాణిజ్యమండలి అధ్యక్షులుగా తిరిగి శ్రీ పి. చంద్రశేఖర రావుగారు ఎన్నికయ్యారు.

గత ఆదివారంనాడు విజయవాడ గాంధీనగరంలోని కార్యాలయంలో ఈ సమావేశం శ్రీ చంద్రశేఖరరావుగారి అధ్యక్షతన జరిగింది

ఉపాధ్యక్షులు : శ్రీ పి. జి. బెనర్జీ; గౌరవ కార్యదర్శులు: శ్రీ పి. సుబ్బారావు, శ్రీ ఆర్. సత్యనారాయణ; కోశాధికారి: శ్రీ కె. జి. గంగ్వాల్ చలన చిత్రాల డిస్ట్రిబ్యూషన్ విభాగంనుండి శ్రీయుతులు డి. సత్యనారాయణ, జి. రామరాజు, ఎం. ఎస్. రాజు, ఎస్. రామచంద్రన్; చలనచిత్ర ప్రదర్శన విభాగం నుండి శ్రీయుతులు కె. కృష్ణ, పి. హనుమంతరావు; చిత్ర నిర్మాతల ప్రతినిధులు శ్రీ డి. వి. బి. కృష్ణచౌదరి గార్లు సభ్యులుగా ఎన్నికయ్యారు.

తెలుగు చిత్ర నిర్మాణానికి ప్రత్యేక ముడిఫిలిం కోటాను కేటాయించాలని, సెన్సార్‌కు సమంజసమైన సూత్రాలను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

సమగ్రమయిన సినిమాటోగ్రాఫ్ చట్టాన్ని తీసుకురావాలని, తాటాకు కప్పు టూరింగ్ టాకీస్‌లకు లైసెన్సు లివ్వాలని సినిమాహాళ్ళ వినియోగంలోని విద్యుచ్ఛక్తికి ఇండస్ట్రియల్ టారిఫ్ రేట్లను వర్తింపజేయాలని కూడా తీర్మానించారు.

సినిమాప్రదర్శకుల మహాసభను ఏర్పాటుచేయ నిర్ణయించారు.

మండలిలో సభ్యులు కానివారితో సభ్యులు ఎలాంటి వ్యాపారం చేయరాదని మరొక తీర్మానం చేశారు.

నిబంధనావళిని రచించడానికై మండలి అధ్యక్షులు శ్రీ చంద్రశేఖర రావుగారు ఛైర్మన్‌గా, ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్, ఎగ్జిబిషన్ శాఖలకు చెందిన 12 మందిసభ్యులుగాఒకకమిటీని కూడా నియమించారు.

బెంగాలీ చిత్రరంగంలో శ్రీ శాంతారామ్ ప్రవేశం

ప్రఖ్యాత హిందీ దర్శక - నిర్మాత శ్రీ వి. శాంతారామ్ కొత్తగా ఒక బెంగాలీ చిత్రాన్ని తీస్తున్నారు.

ఆ చిత్రం పేరు "పలాతక్". నాయికా నాయకులుగా బెంగాలీ నటులు రూమా గుహా తక్కుర్తా, జహార్ రాయ్‌లు నటిస్తున్నారు.

కిశోర్ కుమార్ తమ్ముడు అనూప్ కుమార్ కూడా ఈ చిత్రంలో ప్రముఖ పాత్ర ధరిస్తున్నారు.

ప్రముఖ బెంగాలీ దర్శకుడు శ్రీ యాత్రిక్‌కు దర్శకత్వ బాధ్యత అప్పగించబడింది.

ఒరిస్సా శాసనసభ సమావేశం సెప్టెంబరు 21 తేదీన వాయిదా పడింది. తిరిగి అక్టోబరు 22 వ తేదీన ప్రారంభమవుతుంది.

* * *

పాకిస్తాన్‌లో ఈ వారంలో జరిగిన ఒక బస్సు ప్రమాదంలో యిద్దరు మరణించారు.

హైద్రాబాదులో గాజుఫ్యాక్టరీ కార్మికులపై పోలీసు కాల్పులు

5 గురికి గాయాలు : ఒకరికి ప్రమాద పరిస్థితి :

హైద్రాబాద్, సెప్టెంబరు 21

కోహినూరు గాజు ఫ్యాక్టరీ కార్మికులపై గత రాత్రి 9 గంటలకు పోలీసులు కాల్పులు జరిపిన ఫలితంగా అయిదుగురికి గాయాలు తగిలాయి. ఒకరి పరిస్థితి ప్రమాదంగా వున్నదని తెలుస్తువుంది.

ఫ్యాక్టరీ యజమానుల వైఖరి మూలంగా కార్మికులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు. ముఖ్యమయిన విషయమేమంటే యజమానులు కార్మికుల వేతనంనుండి ప్రావిడెంటు ఫండుకని జమకట్టుకొన్న మొత్తాలను అనిధికి చెల్లించలేదు.

ఈ విషయం లేబరు కమీషనర్ కు కార్మికులయూనియన్ ఫిర్యాదు చేసింది. దానిపై డబ్బును ఈ నెల 20 వ తేదీ చెల్లించడానికి మేనేజిమెంటు అంగీకరించింది కాని నిన్న ఆ మొత్తం చెల్లించలేదు ఇదికాక తరువాత రావలసిన బోనసుకూడ చెల్లించాలని కార్మికులు పట్టు బట్టగా ఫ్యాక్టరి డైరెక్టరు శ్రీ నరేషచంద్ దీనిపై పోలీసులకుఫోను చేశారు

కార్మికులు కోరినట్లు ప్రావిడెంటు ఫండు డబ్బు చెల్లిస్తామని డైరెక్టర్లు వారికి వ్రాతమూలకంగా హామీ ఇవ్వ నిరాకరించారు.

దానిపై కార్మికులు డైరెక్టరును బయటకు పోనీయకుండా ఆఫీసులో ఘెరాయింపు చేశారు

ఈలోగా రెండు లారీలలో పోలీసులు వచ్చి కార్మికులను విపరీతంగా బాదారు, ముఖ్యంగా మొదటి వరుసలో వున్న స్త్రీలను నిర్దాక్షిణ్యంగాకొట్టారు

దీనితో కలిపోయిన కార్మికులు పోలీసులపై రాళ్లువిసిరారు పోలీసులు కార్మికులపై లాఠీఛార్జీ చేశారు కార్మికులు డైరెక్టరును దోవవిడువలేదనే ఆఫీసులో పోలీసు సూపరింటెండెంటు కార్మికులపై కాల్పులు జరపవలసిందిగా పోలీసులకు ఉత్తర్వు యిచ్చారు

కాల్పులవల్ల భీతావహులై పారిపోతున్న కార్మికులను పోలీసులు వెంటాడి దొరికినవాళ్ళను దొరికినట్లు లాఠీలతో బాదారు.

కార్మికుల ఇళ్ళల్లో ప్రవేశించి నానా బీభత్సం చేశారు.

బీభత్సదృశ్యం

నేటి ఉదయం విశాలాంధ్ర విలేకరి, ఇతర విలేకరులతో సహా కాల్పులు జరిగినప్రదేశాన్ని చూశారు. కార్మికులలో చాలాభీతావహం వ్యాపించివుంది. పోలీసు అమానుష చర్యల, హింసా కాండల గురించి అనేక ఉదంతాలను కార్మికులు చెప్పారు. దాదాపు మూడు గంటలసేపు పోలీసులు విచ్చలవిడిగా ప్రవర్తించి కార్మికుల నివాస గృహాలను చిందర వందర చేశారు. తలుపులు విరగగొట్టారు, నిద్రపోతున్న వారిని కూడా బైటకు లాగికొట్టారు. కొంతమంది తలుపు తీయ నిరాకరిస్తే కిటికీలగుండా కాల్చి చంపుతామని చెప్పి దౌర్జన్యంగా లోనికి ప్రవేశించి లోపల వున్న అందరినీ, స్త్రీలను, పిల్లలను విపరీతంగా కొట్టారు. స్త్రీలపై అత్యాచారాలు జరిపినట్లు విపరీతంగా హింసించినట్లు కూడా కార్మికులు ఫిర్యాదు చేశారు అంతేకాక పోలీసులతోబాటు చేరి దొరికిన సామానులనుపట్టుకుపోయారు తన మెడలో మంగళసూత్రాన్ని, దండను తెంపుకొని పోయారని ఒక కార్మిక స్త్రీ తగోడు చెప్పుకుంది

పోలీసులు జరిపిన ఈ దౌర్జన్యకాండలో సుమారు 50 నుండి 100 మందికి రక్తం స్రవించే గాయాలు తగిలాయి.

పోలీసుల దౌర్జన్య కాండ నుండి తప్పించుకోవడంకు కొంతమంది కార్మికులు, స్త్రీలు, దగ్గర పక్కల నున్న కొండలమీదకు, పొలాల్లోకి తప్పుకున్నారు.

ఒక కార్మికుని యింట్లో ఏదో శుభకార్యం జరుగుతూంది. అతిథులు వచ్చారు. పోలీసులు ఆయింట్లో చొరబడి వండిన అన్నమంతా క్రిందపారబోసి చిందరవందరచేశారు. అతిథులతోసహా కొట్టారు.

ఈ సంఘటనలపై మేజిస్ట్రేట్ విచారణ జరపాలని ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కలెక్టరు శ్రీ నారాయణ రెడ్డి విచారణ జరుపుతున్నారు.

హైదరాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంటు శ్రీ కె. ఎస్. శ్రీనివాసన్ సాయుధ పోలీసులతో వచ్చి కాల్పులకు ఉత్తర్వు జారీచేశారు.

కాల్పులవలన కనీసం అయిదుగురు గాయపడి ఉంటారని కార్మికులు తెలియచేశారు.

కానిపోలీసుఇన్స్పెక్టర్ జనరల్ నేడు పత్రికలవారితో మాట్లాడుతూ ఇద్దరు మాత్రమే కాల్పులవలన గాయపడ్డారని తెలిసిందని కాని ఆ తర్వాత మరొకరు కూడా గాయపడ్డట్లు తెలుస్తూందని అన్నారు. కార్మికులు రాళ్ళురువ్వడం వలన 27 మంది పోలీసులు, ఉద్యోగులు గాయపడ్డట్లు తెలిపారు. మేనేజిమెంటులో ఒకరికికూడా గాయాలు తగిలాయని అన్నారు.

(వి. వి.)

చర్చలకై చైనా ప్రతిపాదన

పెకింగ్, సెప్టెంబరు 21

అక్టోబరు 15 చైనా భారత దేశాలు మొదట పెకింగులోను, తర్వాత ఢిల్లీలోను జరపాలని సూచిస్తూ చైనా ప్రభుత్వం భారత ప్రభుత్వానికి కొత్త లేఖ పంపించింది. ఆ లేఖలో ఇలా ఇలా ఉంది:

(ఈ వార్త తొలి భాగాలు నిన్ననే ఇచ్చాము— సం.)

"సరిహద్దు సమస్యపై సంభాషణలకు ప్రాథమిక చర్యగా సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించేందుకు, యథాతథా స్థితి పునరుద్ధరించేందుకు తీసుకోవలసిన చర్యలనుగూర్చి చర్చించేందుకై చైనా ప్రభుత్వం తన ప్రతినిధిని ఢిల్లీకి పంపించవలసిందిగా భారత ప్రభుత్వం ఆగస్టు 22 వ చేసిన ప్రతిపాదన "పూర్తిగా అర్థరహితమైనది" అని చైనా తన లేఖలో విమర్శించింది.

సైన్యాల్ని ఉపసంహరించుకోవాలని సూచించిన తరువాత లేఖలో ఇలా చెప్పారు:

ముందుగానే ఎటువంటి షరతులు విధించకుండా ఉభయదేశాల అధికారుల నివేదికను ఆధారంగా చేసుకొని భారత–చైనా ప్రభుత్వాలు సత్వరమే చర్చలుప్రారంభించాలని చైనా నేటికీ అభిప్రాయ పడుతున్నది.

ఉభయ ప్రభుత్వాల ప్రతినిధులు అక్టోబరు15 నచర్చలుప్రారంభించాలనీ, ఇవి మొదట పెకింగ్ లోను, ఆతరువాత ఢిల్లీలోను జరగాలని సూచిస్తున్నాము.

చైనా భారత సరిహద్దు ప్రాంతాలలో దురాక్రమణ చర్యలు సాగిస్తూనే, సంప్రదింపులు ప్రారంభించడానికి భారత ప్రభుత్వం ఒక షరతును విధిస్తున్నది.

సంప్రదింపులు జరపాలని భారత ప్రభుత్వం చిత్తశుద్ధితో కోరడంలేదు. దీన్ని కప్పిపుచ్చుకోవడానికి భారత ప్రభుత్వం నిష్ప్రయోజనమయిన ఈ విధానం అవలంబిస్తున్నదని స్పష్టంగా చెప్పవచ్చు."

సిరియా పార్లమెంటు రద్దు

క్రొత్త ప్రభుత్వ నిర్ణయం

డమాస్కస్, సెప్టెంబరు 21

సిరియా క్రొత్త ప్రభుత్వం పార్లమెంటు రద్దుచేయాలని నేడు నిర్ణయించింది మూడు గంటలపాటు జరిగిన మంత్రివర్గ సమావేశం తరువాత సమాచార శాఖామంత్రి అబ్దుల్ హలీం కద్దూర్ ప్రకటించారు.

రద్దు అయిన పార్లమెంటు అధికారాలు మంత్రివర్గానికి పార్లమెంటు దఖలు పరిచింది. ఒక సంవత్సరంలోగా తిరిగి ఎన్నికలు జరగవలసి వుంటుంది.

అల్జీరియా ఎన్నికల సరళి

అల్జీర్స్, సెప్టెంబరు 21

అల్జీరియాలో జరిగిన ఎన్నికల తొలి ఫలితాలు బెన్ బెల్లాకు బలమైన కేంద్రమయిన ట్లైమెసెన్ నుండి వెల్లడయాయి. రాజకీయ బ్యూరో ప్రకటించిన అభ్యర్థుల జాబితాకు అనుకూలంగా 99.7 శాతం ఓట్లు పోలయ్యాయి.

వార్తా రవాణాఇబ్బందులు కారణంగానూ, ఓట్ల లెక్కింపు నెమ్మదిగా జరగవలసిన కారణంగానూ, ఇతర ప్రాంతాల ఫలితాల ప్రకటనను రేపటికి వాయిదా వేశారు.

దేశం మొత్తంమీద, రాజకీయ బ్యూరో అభ్యర్థుల జాబితాకు అనుకూలంగా 95 శాతం ఓట్లు పడతాయని అనుకుంటున్నారు.

ఈ జాబితాకు వ్యతిరేకంగా, అన్ని చోట్లకన్నా ఎక్కువ ఓట్లు పడింది, బెన్ బెల్లా వ్యతిరేకుల ప్రధాన స్థావరమయిన కాబిలియా రాష్ట్రంలోని టిజి ఔజూ ప్రాంతంలో అని తెలుస్తూంది. అక్కడ పోలయిన మొత్తం 2,79,208 ఓట్లలో 1,178 ఓట్లు వ్యతిరేకం.

ఆయుధ సామగ్రితో న్యూఢిల్లీలో అమెరికా కోటీశ్వరుని అరెస్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21

చట్ట వ్యతిరేకంగా అనేక ఆయుధాలు కలిగి వున్నందున న్యూఢిల్లీలోని ఒక హోటల్ నుండి నిన్న అరెస్టు చేయబడ్డ అమెరికన్ పౌరుడు డానియల్ వాల్కాట్ ను సెప్టెంబరు 25 వ తేదీవరకు రిమాండ్ చేస్తూ క్రొత్తఢిల్లీ మేజిస్ట్రేటు నేడు ఉత్తరువు చేశారు.

వాల్కాట్ తరపు హాజరయిన అతనిలాయరు, వాల్కాట్ పెద్ద కోటీశ్వరుడని, ఒక అమెరికా విమాన కంపెనీకి అధ్యక్షుడని తెలియచేశాడు.

వాల్కాటును నిన్న భారత ఆయుధాల చట్టం క్రింద అరెస్టుచేశారు. అతని వద్ద అనేక వందల తోటాలు ఆయుధాలు దొరికాయి.

పోలీసులు వాల్కాటును విచారణ చేసిన తరువాత, అతనిద్వారా తెలిసిన వివరాలనుబట్టి విమానాశ్రయంలో గల ఒక విమానంనుండికూడా చాలామందుగుండు సామగ్రిని స్వాధీనపరచుకున్నారు.

పోలీసు వర్గాలవారు చెబుతున్న దానిని బట్టి ఈ మందుగుండు సామగ్రి ఆయుధాలు డి. సి. 4 అనే విమానంలో పాలం విమానాశ్రయానికి చేరవేయబడ్డాయి. అక్కడినుండి వాటిని మరొక నాల్గుసీట్ల, రెండు ఇంజనుల విమానంలో సఫ్దర్ జంగు విమానాశ్రయానికి తీసుకొని వచ్చా.

వాల్కాట్ తో సహా విమానాశ్రయంలో దిగిన మరో ఇద్దరు విదేశస్థుల కొరకు పోలీసులు వెతుకుతున్నారు.

కోర్టులో నేడు అమెరికా రాయబార కార్యాలయపు కౌన్సిలర్ కూడా హాజరయ్యారు.

వాల్కాట్ తరఫున వకాల్తా పుచ్చుకున్న శ్రీ హెచ్. యల్. ఆనంద్ కోర్టుకు ఒక పిటీషన్ పెట్టుకుంటూ వాల్కాట్ గౌరవ ప్రవృత్తుల దృష్ట్యా అతనిని హామీమీద విడుదల చేయాలని అర్థించారు. అతనిని పోలీసు కస్టడీలో రిమాండ్ చేస్తేనేగాని లభ్యం కాదనే అవసరమేమీలేదన్నారు.

మేజిస్ట్రేటు ఆ కోర్కెను తిరస్కరించారు. వాల్కాట్ ను పోలీసు కస్టడీకి వప్పచెప్పారు.

డానియల్ వాల్కాట్ కు అమెరికా ప్యాస్ పోర్టు వున్నదని, అతను బీరూట్ నుండి భారతదేశపు వీసా సంపాదించాడని విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి ఒకరు నేటి సాయంకాలం అన్నారు.

పశ్చిమ జర్మనీలోని స్టత్ గార్టుకు న్యూఢిల్లీకి మధ్య ప్రయాణం చేస్తున్న ఒక ట్రాన్సు అట్లాంటిక్ విమానంలో వచ్చిన వారిలో వాల్కాట్ ఒకడు ఆ విమానం నికోసియా, డమాస్కస్, కరాచీలగుండా తిరుగుతుంది. ఈ సర్వీసును ఈ మధ్య బాంకాక్, హాంకాంగుల గుండా టోక్యోవరకు విస్తరించడం జరిగింది.

నాగార్జునప్రాజెక్టుపరిమాణాన్ని తగ్గిస్తే ఇబ్బందు లేర్పడతాయి

మద్రాసులో ముఖ్యమంత్రి సంజీవరెడ్డి ప్రకటన

మద్రాసు, సెప్టెంబర్ 21

కృష్ణా, గోదావరి నదీజలాల పంపిణీపై గుల్హాతీ కమిషన్ చేసిన సూచనలఫలితంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిమాణాన్ని తగ్గించవలసివస్తే అది అనేక ఇబ్బందులకు దారి తీయడమేగాక చాలా బాధాకరమయిన విషయం కాగలదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి నేడిక్కడ పత్రికా విలేకరులతో అన్నారు.

శ్రీ సంజీవరెడ్డి ఇంకా ఇలా అన్నారు:

"ఈ ప్రాజెక్టుపైన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 60, 70 కోట్లు ఖర్చు చేసింది. ఇదికాక, వడ్డీక్రింద 15 కోట్ల రూపాయలు చెల్లించింది.

ఈ ప్రాజెక్టు పరిమాణం, ప్రయోజనం ఏ మాత్రం తగ్గినా దీనివల్ల కలిగే లాభాలు కూడ అంటే ప్రాజెక్టు మూలంగా ఉత్పత్తి అయ్యే విద్యుచ్ఛక్తి దీనిక్రింద సాగయ్యే ఆయకట్టూ తగ్గుతాయి. ఇది అనేక వివాదాలకు దారి తీస్తుంది. ఈ ప్రాజెక్టు ప్రయోజనం తగ్గించే సమస్యే వస్తే కేంద్రమే దీన్ని నిర్మించే బాధ్యత తీసుకోవచ్చు.

కేంద్రంనుండి వచ్చిన గుల్హాతీ కమిషన్ నివేదికను ఆంధ్ర ప్రభుత్వం యిప్పుడు పరిశీలిస్తూందని శ్రీ సంజీవరెడ్డి తెలియచేశారు. విపులమైన నివేదిక 400 పేజీలుందనీ దానిని అచ్చు వేస్తున్నారనీ అన్నారు.

మద్రాసుకు త్రాగే నీరు సరఫరా చేసే విషయంలో ఎవరికి ఎటి అభ్యంతరమూ లేదనీ అయితే అది ఏ విధంగా చేయాలా అన్నదే సమస్యని అన్నారు.

మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ కామరాజ నాడార్ ప్రభుత్వ అతిథి గృహంలో శ్రీ సంజీవరెడ్డిని కలుసుకున్నారు.

నెల్లూరు కాంగ్రెసువారి హర్షం

గుల్హాతీ కమిషన్ సిఫార్సులపట్ల హర్షం ప్రకటిస్తూ నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడూ, శాసన సభ్యుడూ అయిన శ్రీ ఆనం సంజీవరెడ్డి, నెల్లూరుజిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ యస్. చంద్రశేఖర రెడ్డి నేడొక సంయుక్తప్రకటన చేశారు

కృష్ణానది నీటిలో నెల్లూరు జిల్లాకు, మద్రాసు నగరానికి భాగం ఇవ్వడం న్యాయమయినదేనని గుల్హాతీ కమిషన్ గుర్తించినందుకు వీరు తమ సంతోషం వెలిబుచ్చారు. కృష్ణలో వున్న అదనపు నీటినుండి మద్రాసు అవసరాలు తీర్చాలని కమిషన్ చేసిన సిఫార్సు సరియైనదనీ, మద్రాసు నగరానికి కావలసినదిల్లా ఒక వంద క్యూసెక్కుల నీరేనని వారు తమ ప్రకటనలో అన్నారు. ఈ నీటితో సాగు కాగల భూమి అయిదువందల ఎకరాలే గదా అని వీరన్నారు.

కృష్ణ నీటిని మద్రాసుకు తరలించాలంటే మునుపు రూపొందించిన కృష్ణా పెన్నారు ప్రాజెక్టును మార్చి దాన్ని అమలు జరుపవలసి వుంటుందనీ ఇందువల్ల నెల్లూరు జిల్లాలో కరవు ప్రాంతాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు.

ఎన్నోరు వద్ద ఢిల్లీడీలక్సుకు ప్రమాదం

మద్రాసు, సెప్టెంబరు 20

మద్రాసునుండి న్యూఢిల్లీకి వెళ్ళే ఎయిర్ కండిషన్డు డీలక్స్ ఎక్స్ప్రెస్ మద్రాసునుండి బయలుదేరిన తరువాత నేటి సాయంత్రం 4-40 గంటలకు ఇక్కడకు పది మైళ్ళ దూరంలోవున్న ఎన్నోరు స్టేషన్ వద్ద పట్టాలు తప్పింది. ప్రధాన వైద్యశాఖాధికారి డా॥ పి.పి. మోహన్, డిప్యూటీ సూపరింటెండెంటు, తదితర ఉన్నతోద్యోగులు ఘటనాస్థలం దగ్గరకు వెళ్ళారు.

భారత - చైనా సరిహద్దు పరిస్థితి

పీపుల్స్ డెయిలీ ప్రకటన

పెకింగ్, సెప్టెంబరు 21

భారత చైనా సరిహద్దు ప్రాంతంలో భారతదేశం కొత్తగా స్థాపించిన "దురాక్రమణ స్వభావంగల గస్తీ కేంద్రాలను" చూపే మ్యాపులను చైనా కమ్యూనిస్టుపార్టీ పత్రిక పీపుల్స్ డెయిలీ నేడు ప్రకటించింది.

భారతదేశం "కవ్వింపు చర్యల"కు "సరిహద్దు ఉల్లంఘనల"కు పూనుకొన్నదని ఆరోపిస్తూ చైనా వార్తా సంస్థ చేసిన ప్రకటనలకు పత్రికలో చాలా స్థలం కేటాయించారు.

కేంద్రం చేసేటట్టు అంగీకరించిన డి. యం. కె. వైదీలంపు దీక్షవల్లనే [illegible] మద్రాసు ప్రభుత్వం [illegible] లభిస్తున్నట్లు తెలుస్తున్నది.

క్లోరిన్ గ్యాస్ సిలెండరు ప్రేలుడువల్ల 300 మందికి స్పృహతప్పిన వైనం

ఉజ్జయిని రైల్వేస్టేషన్ లో దుర్ఘటన

ఉజ్జయిని, సెప్టెంబరు 21

క్లోరిన్ గ్యాస్ సిలెండరు ప్రేలిపోవడంవల్ల ఉజ్జయిని రైల్వే స్టేషనులో, రైలు బండిలో ఉన్నవారు, సుమారు 300 మంది నేడు స్పృహతప్పి పడిపోయారు.

ఇండోరు - బిలాసపూర్ ఎక్స్ప్రెస్ లో సిలెండర్లను వేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ మూడు వందల మందిలోను 150మందిని ప్రథమ చికిత్స అనంతరం ఆసుపత్రినుండి విడుదల చేశారు. మిగిలిన వారిని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచారు.

ఎనిమిది సిలెండర్లను రైలులో వేస్తుండగా అందులో ఒక సిలెండరు నుండి క్లోరిన్ వాయువు [illegible] కారుతున్నట్లు గార్డు [illegible] రైలు నుండి దింపివేయ [illegible] ఆ వెంటనే కార్మికులు ఆ సిలెండర్ ను ప్లాట్ ఫారం మీదికి దించారు. [illegible] ఆ సిలెండరు పేలి పోయింది. ఆ రైలులో ప్రయాణం చేస్తున్న అనేక వందల మంది యీ వాయువును పీల్చడం వలన స్పృహతప్పి పడిపోయారు. ఈ వార్త తెలియగానే నగరంలోని పోలీసు అధికారులు, మేజిస్ట్రేట్ వచ్చి స్పృహతప్పి పడిపోయినవారి నందరినీ ఆస్పత్రిలో చేర్చారు. [illegible] పోలీసులకు కాపలా [illegible] ఇండోర్, ఉజ్జయిని; నగ్దా-ఉజ్జయిని; భోపాల్ రత్లాం-ఉజ్జయిని బళ్ళలోని ప్రయాణీకులు కూడా దాదాపు స్పృహతప్పి పడిపోయారు. క్లోరిన్ వాయువు యొక్క [illegible] ప్రాంతాన్నంతా [illegible] వారికి కూడా పోయింది.

ఈశాన్య సరిహద్దులో చైనా కాల్పులు జరపగా, ముగ్గురు గాయపడ్డారని ప్రభుత్వ ప్రకటన

ఈ భారతీయ స్థావరం భారతదేశపు ధోలా స్థావరానికి రెండు మైళ్ళు తూర్పున వున్నది. ధోలా ఈ ప్రాంతంలో భారత చైనా సరిహద్దు మీదగల థగ్ లా రిడ్జికి రెండు మైళ్లు దక్షిణంగా వున్నది.

చైనా వారు ఆ స్థావరాన్ని గత రాత్రి 9-30 గంటలకు దాడి చేశారు. నేటి ఉదయంవరకు కాల్పులు సాగుతూనే వున్నాయి.

భారతీయ స్థావరం తిరిగి కాల్పులు సాగించవలసి వచ్చింది అని ఆ ప్రతినిధి తెలియచేశారు.

నిర్నిమిత్తంగా చైనావారు కాల్పులు సాగించినందుకు వ్యతిరేకంగా చైనా అధికారులకు భారత ప్రభుత్వం నేడు తీవ్రమయిన నిరసనను తెలియ చేసింది.

ఘటన వివరాలను తెలియచేస్తూ విదేశాంగ వ్యవహారాల శాఖ ప్రతినిధి ఇలా అన్నారు:

ఇద్దరు చైనా సైనికులు సెప్టెంబరు 20వ తేదీ సాయంత్రం 9 గం.ల 30 ని॥లకుధోలాస్థావరందగ్గరకు ప్రాకుకుంటూ వచ్చి మన స్థావరంపై చేతి బాంబులు విసిరారు. దానితో మన సైనికులు వెలుగు చేసి చూస్తే స్థావరానికి కొద్ది వందల గజాల దూరంలో చాలామంది చైనాసైనికులు కనపడ్డారు. చైనావారు మనస్థావరంపై కాల్పులు సాగించారు. మన స్థావరంకూడా కాల్పులుసాగించాలసి వచ్చింది.

చైనావారి కాల్పులు నేటి ఉదయం వరకు కొనసాగాయి. మన సైనికులు ముగ్గురు గాయపడ్డారు.

"నేడు నిరసన తెలియచేశాము."

నిన్న చైనావారు భారతదేశంతో యుద్ధప్రమాదం వున్నదని పంపిన పత్రంవిషయం ప్రస్తావించి ఆ ప్రతినిధి "పొద్దుటిపూట బెదిరించి సాయంత్రం దానిని అమలు జరపడం చాల ఆసక్తి దాయకంగా వున్నది." అని అన్నారు.

రు. 4 లక్షల వరకు దొంగ రవాణా

కావలి పోలీసులచే ముగ్గురు వ్యక్తుల అరెస్టు

కావలి, సెప్టెంబరు 19

నెల్లూరు జిల్లా రామయపట్నం సమీపంలో కావలి ఎక్సైజు సబ్ ఇన్స్పెక్టర్లు శ్రీ వెంకట్రామయ్య నాయుడు, శ్రీ పి. హెచ్. వేమయ్య గార్లు దొంగతనంగా లంకనుండి దిగుమతి కాబడిన సుమారు 4 లక్షల రూపాయలు విలువగల సుగంధ ద్రవ్యములను పట్టుకున్నారు.

ఇదికాక అంతకుముందు మరియొక స్టీమరు కావలికి 6 మైళ్ళలో వున్న తుమ్మలపెంట గ్రామ రేవువద్ద దించినట్లు దానిలోని సరకు రాత్రికి లారీలపై గుంటూరుకు రవాణా కాబడినదని తెలియుచున్నది.

ఈ రెండవ స్టీమరుకూడ వైప్రదేశములో దించుటకు ప్రయత్నించారని కాని, కస్టమ్సుశాఖవారికి యీ వార్త తెలియుటచే దానిని రామయపట్నానికి దగ్గరగా మార్చినట్లు తెలియుచున్నది. స్టీమరును గట్టునకు చేరవేయుటకు కాకినాడనుంచి ఒక స్టీమ్ లాంచీని ఏర్పాటు చేసినారు. ఈ విషయంలో స్టీమ్ లాంచీని సప్లయ్ చేసినాడని చెప్పబడుచున్నట్టి సోమయ్యను, కావలిలో గాజుల వ్యాపారం చేయుచున్న ఒక మార్వాడీని, మరియొకరినిఅరెస్టుచేసినట్లు తెలియుచున్నది.

ఈ దిగువ కనపరచిన వస్తువులను పట్టుకున్నారు. 135 బస్తాల లవంగాలు 6383 కి. గ్రా. 185 టన్నుల మెంతులు 138 లీటర్స్ సిరాలేని బాల్ పెంటు పెనాలు 81164 ఎరుపుబ్లూ 1087, 462 సిగరెట్ లైటర్లు 248 పాకెట్ థర్మామీటరు ఇవన్నీ కలిపి సుమారు 4 లక్షల రూపాయలు విలువ గలవి. (వి. వి.

గోదావరి వరద తగ్గే సూచన

భద్రాచలంవద్ద వరదమట్టం తగ్గుదల

(వి. వి.) రాజమండ్రి, సెప్టెంబరు 21

గోదావరి వరద నేడు రైలు వంతెనవద్ద 62 అడుగులకు, అనకట్టవద్ద 16 అడుగులకు హెచ్చింది భద్రాచలం నుండి వచ్చిన వార్తల ప్రకారం అక్కడ మధ్యాహ్నం 61.2 అడుగులున్న వరద మట్టం సాయంత్రానికి 55.8 అడుగులకు తగ్గింది. దీనినిబట్టి వరద ఇక తగ్గుముఖం పట్టవచ్చునని భావించ బడుతూంది.

అయితే రాత్రికిక్కడ అనకట్టవద్ద 16.5 అడుగుల వరకు వరద మట్టం హెచ్చుతుందని, ఇది ఈ పర్యాయం అత్యున్నత స్థాయి కావచ్చుననీ తెలుస్తూంది.

నేటి ఉదయం వరద బాధితుల సహాయక కమిటీ, కలెక్టరు శ్రీ రామ్. కె. జేసా అధ్యక్షతను సమావేశమైంది సహాయక కేంద్రాల ఏర్పాట్ల గురించి అత్యావసర చర్యల గురించి చర్చించారు. వైద్య సహాయంతో ఒక వాన్ ను ఏర్పాటు చేశారు. పల్లపు ప్రాంతాల ప్రజలకు మూడు బస్తాల బియ్యం పంచబడినాయి. నేటి ఉదయం జిల్లా కలెక్టరు, మున్సిపల్ తాత్కాలిక ఛైర్మన్ శ్రీ జి. ఎస్. బాలాజీదాసు, సబ్ కలెక్టరు శ్రీ మోహన్ లాల్, సూపరింటెండింగ్ ఇంజనీయరు శ్రీ కృష్ణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీయరు శ్రీ మోసెస్, మున్సిపల్ కమిషనర్ శ్రీ శాంతారాంలాల్ మున్నగువారు పట్టణంలో నీటిముంపునకు గురైన పల్లపు ప్రాంతాలుతుమ్మలావ, అల్కాట్ గార్డెన్స్ సీతంపేట మున్నగు ప్రాంతాలు తిరిగి చూశారు. తుమ్మలావలో 200 ఇళ్ళు, కుమ్మరాలపేటలో 40 గుడిసెలు, శేషాయిమెట్టవద్ద 60 యిళ్ళు వరద నీటితో, వర్షపునీటితో మునిగి పోయాయి.

గత రెండురోజులుగా వర్షాలు లేకపోవడంవలన పరిస్థితి కొంత మెరుగయ్యింది. మున్సిపాలిటీ అన్ని రకాల జాగ్రత్తలను తీసుకుంటూంది.

భద్రాచలంలో

హైదరాబాద్, సెప్టెంబరు 21

ఇక్కడి పోలీసు ప్రధాన కార్యాలయానికి అందిన వార్త ప్రకారం భద్రాచలంలో వరద, ప్రమాద స్థాయిని మించి రెండడుగులుంది. భద్రాద్రి గ్రామాలమీదకి నీళ్ళు వచ్చాయి. పట్టణంలో వరద ప్రమాదానికి గురైన ప్రాంతాల ప్రజలను సురక్షిత స్థానాలకు తరలించారు. [illegible] ఒక వ్యక్తి వరదలో కొట్టుకొనిపోయినట్టు కూడా ఇక్కడకు వార్త వచ్చింది.

భద్రాచలం నాగూరు బూర్గంపాడు ములుగుతాలూకాలలో నదికి ఇరువైపుల వరిచేలన్నీ మునిగిపోయినట్లు వార్తలు అందాయి.

సింహళంలో ప్రత్తి పెంపకానికి రష్యా సహాయం

కొలంబో, సెప్టెంబరు 21

సింహళంలోగల హంబన్ తోటా జిల్లాలో ప్రత్తి పెంపకం పథకానికి రష్యా సహాయంపై ఇరుదేశాలమధ్య నేడొకఒప్పందం కుదిరింది. ఈఒప్పందం ప్రకారం హంబన్ తోటా జిల్లాలో రెండువేల ఎకరాలను సాగుచేసి ప్రత్తి వేసేందుకు రష్యా యంత్రాలను, సాంకేతిక సహాయాలను అందచేస్తుంది.

క్యూబాకు సరుకులు మోస్తే అమెరికా సహాయంలో కోత

వాషింగ్టన్, సెప్టెంబరు 20

క్యూబాకు తమ ఓడలలో ఏ రకమైన సరుకులను తీసుకొనిపోయే ఏ దేశానికయినాఅమెరికాసహాయంలో కోతపెట్టాలని ప్రతినిధులసభ విదేశ సహాయబిల్లుకు ఒక సవరణను నేడు అంగీకరించింది.

మైసూరు మంత్రివర్గంపై అవిశ్వాస తీర్మానం

పి. యస్. పి. ప్రతిపక్షంచే

బెంగుళూరు, సెప్టెంబరు 21

రాష్ట్ర మంత్రివర్గంపై పి. యస్. పి. ప్రతిపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని చర్చించడానికి మైసూరు రాష్ట్ర శాసనసభ నేడు ఆమోదించింది.

తీర్మానంపై చర్చను ఏదో ఒక రోజు జరుపుదామని స్పీకరు శ్రీ బి. వై. కుంతబాలిగా అన్నారు.

స్క్రీనింగ్ ప్లాంట్ సింగరేణి కంపెనీచే నిర్మాణం

హైదరాబాద్, సెప్టెంబరు 20

మందమర్రి డివిజన్ లో సింగరేణి బొగ్గు గనుల కంపెనీ కొత్తగా నిర్మించిన స్క్రీనింగ్ ప్లాంట్ పని ప్రారంభించినట్లు తెలియవచ్చింది. రుద్రంపూర్ డివిజన్లో ఇసుక రవాణాకు ఏరియల్ రోప్ - వేకూడా నిర్మించబడింది

టైమ్సు ఆఫ్ ఇండియా పత్రికలలో సమ్మె

బొంబాయి, సెప్టెంబరు 21

నేటి ఉదయం నుండి కార్మికులు బైఠాయింపు సమ్మె చేస్తున్న కారణంగా టైమ్సు ఆఫ్ ఇండియా గ్రూపు పత్రికలలో ఒకటైన ఈవినింగ్ న్యూస్ ఆఫ్ ఇండియా నేటి సాయంత్రం వెలువడలేదు.

అదనపు కరువుభత్యం యివ్వాలని కోరుతూ కార్మికుల యూనియన్ ఇచ్చిన పిలుపు నందుకొని యీ సమ్మె జరిగింది.

కెన్నెడీతో శ్రీ మొరార్జీ భేటీ

వాషింగ్టన్, సెప్టెంబరు 21

భారత ఆర్థిక మంత్రి శ్రీ మొరార్జీ దేశాయి అమెరికా అధ్యక్షుని నిన్న సాయంత్రం కలుసుకొని ఉభయ దేశాల మధ్య ఉన్న అన్ని విభేదాలు గురించి చర్చించారు. అంతకు ముందు వివిధ అమెరికా ఉన్నతాధికారులతో కూడా సంభాషణలు జరిపారు. ఈ సంభాషణల ఫలితంగా ఉభయదేశాల సంబంధాలలో భారతదేశ వైఖరిని మరింతగా ఇక్కడ అవగాహన చేసుకోడానికి వీలైందనిఅనుకుంటున్నారు.

కెన్నెడీ - మొరార్జీ సంభాషణల్లో కాశ్మీర్ సమస్య, సోవియట్ మిగ్ విమానాలు, భారత - చైనా సరిహద్దు సమస్య మొదలైనవన్నీ వచ్చినట్లు తెలుస్తూంది. కెన్నెడీ, తదితర ఉన్నతోద్యోగులందరు శ్రీ మొరార్జీ చెప్పినదానిని చాల సానుభూతితో, విన్నారట. అయితే అంత మాత్రాన ఈ సమస్యలపై అమెరికా వైఖరిలో ఎట్టి మార్పు ఉండదనీ, భారతదేశ వైఖరిని మాత్రం ఎక్కువ అర్థం చేసుకోడానికి తోడ్పడుతుందనీ అంటున్నారు. ఉదాహరణకు సోవియట్ మిగ్ విమానాలు పాకిస్తాన్ సరిహద్దు ప్రమాదందృష్ట్యా కాక ఉత్తర సరిహద్దులో (చైనాతో) రక్షణకు కూడా కొనదలచుకొన్నట్లు శ్రీ మొరార్జీ దేశాయి వివరించారట. ఈ విషయాన్ని శ్రీ దేశాయి వ్యక్తిగత సంభాషణలలోను, పత్రికా గోష్ఠుల లోనుకూడా చెప్పారట.

విమాన అవశేషాలు దొరికినట్లు వార్త

ఎలిజబెత్ విల్లి, సెప్టెంబరు 21

ఉత్తర కాటంగాలో నిన్న కూల్చివేయబడ్డ ఐరాస డకోటా విమాన అవశేషాలను ఐరాస శోధకదళంవారు నేడు కనుగొన్నారు.

ఆ విమానంలో వున్నారని చెప్పబడుతున్న పదిమందిలోను ఒకరు మరణించారు. ఐదుగురు గాయపడ్డారు. మిగిలిన నలుగురు సురక్షితంగానే వున్నారు.

కామినాకు ఈశాన్యంగా మూడు వందల కిలో మీటర్ల దూరంలోవున్న కాముంజావద్ద అవశేషాలుకనపడ్డాయి.

ఐరాస హెలికాప్టర్లు, జెట్ విమానాలు ఈ వెదుకుటలో పాల్గొన్నాయి.

గూడ్సు బళ్ళకు డీసెల్ ఇంజన్లు

మద్రాసు విజయవాడల మధ్య

మద్రాసు, సెప్టెంబరు 20

మద్రాసు-విజయవాడ, మద్రాసు-కొచ్చిన్ల మధ్య వచ్చే సంవత్సరంనుంచి గూడ్సు రైళ్ళకు డీసెల్ ఇంజన్లు వేయనున్నారని రైల్వే ఉపమంత్రి శ్రీ యస్.వి. రామస్వామి నేడన్నారు.

ఆవిరి ఇంజన్లస్థానే డీసెల్ ఇంజన్లు ప్రవేశపెట్టే కార్యక్రమం క్రమక్రమంగా విస్తరిస్తున్నామని మంత్రి చెప్పారు.

ఇదివరకే 60 మీటర్ గేజ్ డీసెల్ ఇంజన్లు, 112 బ్రాడ్ గేజి డీసెల్ ఇంజన్లు విదేశాలనుండి వచ్చాయని మంత్రి అన్నారు.

సోవియట్ చే మరో అణ్వాస్త్ర పరిశీలన

స్టాక్ హోమ్, సెప్టెంబరు 21

సోవియట్ రష్యా మరో అణ్వాస్త్రాన్ని పేల్చి చూసిందని ఇది పది మెగా టన్నుల ప్రమాణం కల్గి వుండవచ్చునని ఇక్కడి సాంకేతిక శాఖాల యంత్రాలనుబట్టి తెలిసింది.

కంకిపాడునుండి మానికొండ మీదుగా గుడివాడ పోయే బస్సులను యీరోజు మధ్యాహ్నం నుండి తిరిగి ప్రారంభించమని రోడ్డు రవాణా సంస్థ అధికారులు తెలియచేశారు.

మానికొండవద్ద రోడ్డుకు గండి పడటం మూలకంగా బస్సులను ఆపిన విషయం పాఠకులకు విదితమే.

మనదేశంలో రాకెట్ ప్రయోగకేంద్రాలు

కేరళకు పరిశీలనకమిటీ సభ్యుల పయనం

బొంబాయి, సెప్టెంబరు 21

భూమధ్యరేఖ సమీపంలో వాతావరణం పైపొరల పరిస్థితిని పరిశీలించే నిమిత్తం రాకెట్ ప్రయోగాలు జరపడానికి రోదసీ పరిశోధన భారత జాతీయ కమిటీ సన్నాహం జరుపుతూంది.

ఐరాస అంతరిక్ష కమిటీ సహాయంతో భారత కమిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుతుంది. కమిటీలోని ముగ్గురుసభ్యులు, లోగడ కేరళ సందర్శించి అక్కడ రాకెట్ ప్రయోగానికి అనువైన స్థలాలను పరిశీలించారు. ఇప్పుడు ఈ అంతరిక్ష పరిశీలన కమిటీ అధ్యక్షుడు మరికొందరు సభ్యులు కేరళకు నేడు బయలుదేరుతున్నారు.

అయస్కాంతభూమధ్యరేఖ దక్షిణ భారతదేశం గుండా పోతూంది. ఇంతవరకు అమెరికా, రష్యాలు రోదసీలోకి పంపిన రాకెట్లు సముద్ర మట్టానికి చాలా ఎత్తు ప్రదేశాలనుండి పంపబడినాయి. ఇప్పుడు కేరళలోని వేదికలనుండి జరపబోయే ప్రయోగాల ప్రాధాన్యం కల్గినట్టివిగా భావించబడుతున్నాయి.

జిల్లా పారిశ్రామిక కమిటీలు

హైద్రాబాద్, సెప్టెంబరు 21

జిల్లా పారిశ్రామిక కమిటీలకు అక్టోబరు మొదటివారంలో ప్రారంభోత్సవం చేస్తామని పరిశ్రమలమంత్రి శ్రీ లక్ష్మీనరసయ్య నేడు విలేకరులతో అన్నారు.

జిల్లా పారిశ్రామిక కమిటీలు ఇంచుమించు జిల్లా పరిషత్తు పారిశ్రామిక స్థాయీసంఘాలే. పోతే ఇవి కొంత విస్తృతప్రాతిపదికపై ఏర్పాటుచేశారు.

జిల్లా పారిశ్రామిక కమిటీలకు జిల్లా కలెక్టరు అధ్యక్షుడు. జిల్లాలోని పారిశ్రామిక అసిస్టెంటు డైరెక్టరు సమావేశకర్త. జిల్లా పరిషత్తు అధ్యక్షుడు, జిల్లాలోని కొంతమంది పారిశ్రామిక యజమానులు కమిటీలో సభ్యులుగా వుంటారు.

బంగారు వెండి ధరలు

విజయవాడ, సెప్టెంబరు 22

[మధ్యాహ్నం 1 గంట]

మేలిమి పాట్లా 10 గ్రా.	రు. 125-00
మూస 10 గ్రాములు	రు. 124-50
నవరసు 8 గ్రాములు	రు. 97-00
వెండి 1 కిలోగ్రాం	రు. 216-00
వెండి 10 గ్రాములు	రు. 2-25

వ్యవసాయ వస్తు ధరలు

విజయవాడ, సెప్టెంబరు 22

విజయవాడ వ్యవసాయ మార్కెటింగ్ ఆఫీసరు నేడు అందజేసిన ఉత్పత్తిదారులనుండి కొనుగోలు చేయు టోకుధరలు. (ఒక క్వింటాల్: 100కిలోగ్రాములు లేక 220½ పౌనులు)

ధాన్యం		
కంబస్లు:	విజయవాడ	45-00
,,	కాకినాడ	43-09
అక్కుళ్ళు:	విజయవాడ	37-62
,,	తాడేపల్లిగూడెం	36-84
,,	కాకినాడ	37-98
,,	ఆముదాలవలస	39-33
సన్న కృష్ణకాటుకలు:		
	తాడేపల్లిగూడెం	40-13
సన్నాలు:	ఆముదాలవలస	40-66
ములగొలుకులు:	నెల్లూరు	43-50
మిల్లు బియ్యం		
సన్నాలు	విజయవాడ	64-00
,,	ఆముదాలవలస	64-77
అక్కుళ్ళు:	విజయవాడ	58-31
	తాడేపల్లిగూడెం	60-81
,,	కాకినాడ	57-42
,,	ఆముదాలవలస	60-22
సన్నకృష్ణ కాటుకలు:		
,,	తాడేపల్లిగూడెం	65-54
కంబస్లు	కాకినాడ కిచిడి	70-66
,,	చిత్తూరు	77-78
మొలగొలుకులు:	నెల్లూరు	71-00
వేరుశనగ		
కాయలు	విజయవాడ	62-37
,,	నంద్యాల	66-87
,,	విజయనగరం	55-81
పప్పు	విజయవాడ	84-00
,,	నంద్యాల	88-75
,,	ఆదోని	89-00
,,	విజయనగరం	86-67
నూనె	విజయవాడ	191-00
,,	నంద్యాల	173-50
,,	ఆదోని	118-30
,,	విజయనగరం	177-78
అపరాలు		
కందులు:	విజయవాడ	51-00
,,	గుంటూరు	53-00
,,	ఆముదాలవలస	47-85
మినుములు:	విజయవాడ	78-00
,,	గుంటూరు	92-00
,,	ఆముదాలవలస	72-03
పెసలు:	విజయవాడ	44-00
,,	గుంటూరు	42-00
,,	ఆముదాలవలస	50-58
శనగలు:	విజయవాడ	45-00
బెల్లం		
మొదటిరకం,	అనకాపల్లి	70-00
మూడవరకం	అనకాపల్లి	65-00
మొదటిరకం,	చిత్తూరు	62-68
మూడవరకం	,,	55-81
జీడిపప్పు		
వేటపాలెంలో:		
	ఆమెరికన్‌రకం	455-00
,,	దేశవాళీ	450-00
,,	బద్దలు	371-00
,,	ముక్కలు	290-00
మిర్చి		
దేశవాళీ	గుంటూరులో:	240-00
నెం. 2రకం	,,	220-00
[illegible] రకం	,,	235-00
నెయ్యి		
గుంటూరులో		600-00
పసుపు		
దుగ్గిరాలలో:	కొమ్ములు	రు 148-87
	[illegible]	149-94
కడపలో:	కొమ్ములు	రు 158-00
	దుంపలు	142-00
జనపనార		
ఆముదాలవలస:	మొదటిరకం:	58-66
,,	రెండవ రకం	53-83
,,	మూడవరకం	48-66
విజయనగరం	మొదటిరకం	61-62
,,	రెండవరకం	56-27
,,	మూడవరకం	50-93
కొబ్బరికాయలు		
1 000 కి	కొత్తవి:	పాతవి:
రాజమండ్రి.	145-00	190-00
పాలకొల్లు.	150-00	185-00
విజయవాడ	180-00	220-00

పార్లమెంటు సమీక్ష

(3వ పేజీ తరువాయి)

సభ్యుల స్వప్రయోజనాలకు ప్రత్యక్షంగా దెబ్బ తగిలే ప్రమాదం ఏర్పడ్డ సమస్య యిది. అందువల్ల కూడా ప్రభుత్వం పునరాలోచించుకొని వుండొచ్చు.

మూడో ప్రణాళిక

మూడో ప్రణాళిక మొదటిసంవత్సరం అభివృద్ధిపై చర్చ జరపడం ఈసారి పార్లమెంటు సమావేశ విశేషాలలో ఒకటి. ప్రణాళిక ప్రథమసంవత్సర అభివృద్ధిని గూర్చి ప్రభుత్వంగాని లేక ప్రణాళికా సంఘంగాని సరైన సమీక్ష అందజేయకపోవడంవల్ల చర్చకు ప్రతిబంధకం ఏర్పడింది.

చర్చకు ముందు ప్రభుత్వం అందించిన ప్రకటనలో పెద్దగా ఏమీ లేదు. అయినా చర్చలో పాల్గొన్న కమ్యూనిస్టుసభ్యులు స్పష్టమైన దృక్పథంతో వివరంగా తమ అభిప్రాయాలను తెలిపారు.

రాజ్యసభలో శ్రీ భూపేష్‌గుప్త, అభివృద్ధికి సంబంధించిన అన్ని దృక్కోణాలను తడిమి ప్రభుత్వ తీర్మానానికి 55 సవరణలు ప్రతిపాదించారు. ప్రణాళిక విజయవంతం కావడానికి శ్రీ గుప్త తన సవరణలలో అనేక నిర్మాణాత్మక సూచనలు చేశారు.

చివరకు లెక్కల రూపంలో చూసినా, సాధించిన అభివృద్ధి అంతగా లేదని శ్రీ గుప్త అన్నారు.

"ప్రణాళిక మొదటి సంవత్సరంలో జాతీయ ఆదాయం 3 శాతం మాత్రమే పెరిగింది. (అసలు అంచనా 5 శాతం కావాలని). ఈ సంవత్సరం ఈ ఆదాయం ఎంత పెరుగుతుందో తెలియదు. ఊపుమాత్రం చాల మందకొడిగా వుంది."

"అంతేగాదు, కొన్ని రంగాలలో మూడో ప్రణాళికా కాలంలో అభివృద్ధి తగ్గింది. ప్రత్తి ఉత్పత్తి 8 లక్షల టన్నులకు పడిపోయింది. ధాన్యోత్పత్తి తగ్గింది. సిమెంటు ఉత్పత్తి లక్ష్యం 10 లక్షల టన్నులయితే అంతకు చేరుకునేట్టులేదు. ఉక్కు ఉత్పత్తి ద్వితీయ ప్రణాళికా లక్ష్యం 46 లక్షల టన్నులయితే 29 లక్షల టన్నులే అయింది. విదేశీ మారకద్రవ్యం తెచ్చిపెట్టే, నూనె విత్తనాలు రెండో ప్రణాళిక లక్ష్యాన్ని చేరుకోలేదు." అని శ్రీ గుప్త తెలిపారు.

విదేశీ మారకద్రవ్య కొరతను గూర్చి చెప్పుతూ శ్రీ గుప్త, లోక్ సభలో శ్రీ ఇంద్రజిత్ గుప్తలు మన దేశంలో సామ్రాజ్యవాద దోపిడీ సమస్యను చాల వివరంగా చర్చించారు.

1960-61లో మనం రు. 1071 కోట్ల విలువగల సరుకులను దిగుమతి చేసుకున్నాం. ఇందులో యంత్రాల భాగం రు. 153 కోట్లు, మధ్యరకం సరుకుల భాగం రు. 503 కోట్లు, వినిమయ సరుకుల్లో రు. 200 కోట్లు మాత్రమే. మన ఆర్థిక వ్యవస్థపై నానాటి విదేశీ పెట్టుబడుల ఆధిక్యత పెరగడంవల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది.

భూ సంస్కరణలు

లోక్ సభలో శ్రీ వాసుదేవన్ నాయర్ (కమ్యూ) మాట్లాడుతూ భూ సంస్కరణలనుగూర్చి, అభివృద్ధికి అవసరమైన వనరుల సేకరణలో వాటి పాత్రను గూర్చి, నిరుద్యోగాన్ని తొలగించడంలోనూ, ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచడంలోనూ వాటి పాత్రనుగూర్చి నొక్కి చెప్పారు.

ప్రణాళికపై చర్చలో ప్రభుత్వ విధానాలపైన, వైఫల్యాలపైన సభలోని అన్ని వర్గాలనుండీ తీవ్రమైన విమర్శలు వచ్చాయి.

సామ్రాజ్య వాద దోపిడి అవకాశాల నిర్మూలన, కౌలు రక్షణ విషయంలో తరతరాలుగా వస్తున్న చిక్కులనుండి రైతాంగ రక్షణ, వడ్డీవ్యాపారుల దోపిడీ నిర్మూలన, భూస్వామ్య గుత్తాధికార నిర్మూలన భారత ఆర్థికాభివృద్ధికి చెందిన ఈ మూల సమస్యలన్నింటిపైనా కమ్యూనిస్టు సభ్యులు కేంద్రీకరించారు.

ఈ సమస్యలు పరిష్కారం కాకుండ జాతీయాభివృద్ధిలో చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏదీ రాదు.

ప్రణాళికామంత్రి శ్రీ నందా రాజ్యసభలో ఇచ్చినసమాధానమిస్తూ, కమ్యూనిస్టుసభ్యులు చూపిన ప్రభుత్వ వైఫల్యాలన్నింటిని ఆమోదించారు. అయితే ధరల విషయంలో మాత్రం ఆయన "ప్రభుత్వం పరిస్థితిని తెలుసుకుంది" అని మాత్రమే అన్నారు.

సభలు - సమావేశాలు

గూడూరు డివిజన్ కమ్యూనిస్టు కమిటీ సమావేశం 24-9-62 వ తేదీన గూడూరులో ఉదయం 10 గంటలకు జరుగుతుంది. ఈ సమావేశానికి జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ శంకరయ్యగారు హాజరగుదురు.

* * *

నల్లగొండ జిల్లా భువనగిరి తాలూకాలోని భువనగిరి ఆలేరు, తుర్కపల్లి బ్లాక్, భువనగిరి పట్టణ కమ్యూనిస్టు కమిటీల సంయుక్త సమావేశం సెప్టెంబరు 25, 26 తేదీల్లో భువనగిరిలో జరుగుతుంది. రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ రావి నారాయణరెడ్డి, శ్రీ దేవులపల్లి వెంకటేశ్వరరావు (జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి) గార్లు పాల్గొంటారు.

ధరల పెరుగుదలకు కారణం అధిక లాభాపేక్ష

ప్లానింగ్ కమిషన్‌కు భారత వాణిజ్య మండలి కమిటీ లేఖ

కలకత్తా, సెప్టెంబరు 20

వ్యాపారస్తులు విపరీతమయిన లాభాల కాసించటంవల్ల ఆహారధాన్యాలను దొంగతనంగా నిల్వలు చేయుటంవల్ల 1961 ఆగస్టు 5 నుంచి ఈ సంవత్సరం ఆగస్టు మధ్యకాలంలో ధరలు పెరిగిపోయాయని భారత వాణిజ్యమండలి కమిటీ ప్లానింగు కమీషన్‌కు పంపిన లేఖలో తెలియజేసింది.

ఆ కమిటీ ఈ లేఖను నేడు పత్రికలకు విడుదల చేసింది.

ధరల తగ్గింపుకు నివారణోపాయంగా, ఈ కమిటీ కొన్ని సూచనలు చేసింది. ఆహారధాన్యాల క్రయ విక్రయాలను ప్రభుత్వమే నిర్వహించటం, సహకార సంఘాల నిర్మాణం అవసరమని ఈ కమిటీ సూచించింది. అలాంటి చర్యలవల్ల ఆహారధాన్యాల పంపకంలో మధ్య దళారీలుగా వ్యవహరించే అసంఖ్యాకులైన వ్యాపారస్తుల ముఠాను ఈ రంగం నుంచి తొలగించేయుడానికి వీలు చిక్కుతుంది.

ఆహారధాన్యాల విషయంలోనే ఈ కాలంలో సాధారణ ధరలసూచీ పెరిగిందనీ అది 1961 ఆగస్టులో 132.9 కి పెరిగిందని ఈ లేఖలో తెలియజేశారు.

పారిశ్రామిక ముడి పరికరాల ధరల సూచీ 1961 ఆగస్టు 5న 150.5 వుండగా ఆగస్టు 4న 139 5కు పడిపోయిందనీ, ఉత్పత్తిదారులకు ధరల సూచీ ఇదే కాలంలో 127.9 నుంచి 129 కి పెరిగిందనీ ఈ లేఖలో చెప్పారు.

గోధుమ, పంచదారల నిల్వలను అధికంగా విడుదలచేసినందువల్ల ఆహారధాన్యాలు, పంచదార, హోల్ సేల్ ధరలు ఈ మధ్య అదుపులో వున్నట్టుగా అధికార వర్గాలద్వారా నేడు తెలియవచ్చింది.

గుంటూరు టీచర్సు గిల్డు మహాసభ

గుంటూరు, సెప్టెంబరు 20

గుంటూరు పట్టణ టీచర్సు గిల్డు ప్రథమ మహాసభ ఇటీవల యల్. యమ్. పి. హైస్కూలు ఆడిటోరియమ్‌లో జిల్లా కలెక్టర్ శ్రీ శ్రావణ్ కుమార్ గారి అధ్యక్షతను ప్రారంభమైంది. మునిసిపల్ స్పెషలాఫీసరు శ్రీ బి. సూర్యనారాయణరావు గారు జాతీయపతాకం యెగుర వేశారు. పట్టాభిపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ యం. రామచంద్రరావుగారు స్వాగతం చెప్పారు.

ప్రాంతీయ విద్యాశాఖ డిప్యూటీ డైరక్టరు శ్రీ పి. ఆదినారాయణగారు ప్రారంభోపన్యాసం చేశారు.

స్థానిక శాసనసభ్యులు శ్రీ కనపర్తి నాగయ్యగారు ప్రసంగిస్తూ, ప్రస్తుత విద్యావిధానంలో అనేక లోపాలున్నవనీ, వాటిని సవరించడానికి తీవ్రమైన చర్యలు అవసరమని చెప్పారు.

తర్వాత మునిసిపల్ స్పెషలాఫీసర్, శ్రీ కె. రాజగోపయ్యగార్లు కూడా ప్రసంగించారు. అనంతరం, గిల్డు కార్యదర్శి శ్రీ జగన్నాథంగారు తమ నివేదికను సమర్పించారు. శ్రీ యం. రామచంద్రరావుగారి వందనములతో ఉదయంపూట కార్యక్రమంముగిసింది.

మధ్యాహ్నం సభకు శ్రీ యం. రామచంద్రరావు గారు అధ్యక్షత వహించారు. తర్వాత జిల్లా టీచర్సు గిల్డు కార్యదర్శి శ్రీ బాపయ్యగారు, జిల్లాలోని ఉపాధ్యాయుల కార్యకలాపాలను, కర్తవ్యాలను వివరించారు.

అనంతరం శ్రీ చెన్నుపాటి లక్ష్మయ్య (ఎం. ఎల్. సి) గారు ప్రసంగిస్తూ, ఉపాధ్యాయుల జీతాల పెంపకం, రిటైరింగ్ వయస్సు, బి. ఇ. డి. ఉపాధ్యాయుల కొరత, జాయింటు స్టాఫ్ కౌన్సిల్ యేర్పాటు మొదలైన సమస్యలవిషయంలో జరిగిన, జరుగుతూన్న కృషిని వివరించారు.

తర్వాత శ్రీసింగరాజు రామకృష్ణయ్య (ఎం.ఎల్.సి) గారు ప్రసంగిస్తూ, జీతాల పెంపకంలో జరిగిన అవకతవకలను, వాటిని సరిదిద్దడానికి జరిగిన కృషిని, పాఠశాలల గ్రాంట్లను, 3వ తరగతి నుండి ఆంగ్లం ప్రవేశపెట్టడం మొదలైన విషయాలనుగురించి ప్రసంగించారు. విద్యార్థులమీద ప్రయోగాలు చేసి చూడడం తగదనీ, విద్యాశాఖాధికార్లు ఇలాంటి విషయంలో అనుభవంగల ఉపాధ్యాయుల సలహాలను విధిగా తీసుకొని నిర్ణయాలు చేయాలని కోరారు. తర్వాత శ్రీ పి. శ్రీరామమూర్తిగారు (ఎం. ఎల్. సి, ప్రసంగిస్తూ విదేశాలలోని విద్యా విధానాలను, మనదేశంలోని విద్యా విషయాలను పోలుస్తూ, మన విధానాలలోని లోపాలను వెల్లడించారు. అనంతరం ముగ్గురు శాసనమండలి సభ్యులకూ సన్మానం జరిగింది.

తర్వాత వినోద కార్యక్రమాలు, సంగీతం, నృత్య ప్రదర్శన, "ఉపాధ్యాయ" నాటిక ప్రదర్శన, జరిగాయి.

కేంద్ర ఇరిగేషన్ మంత్రి హాఫీజ్ మహ్మద్ ఇబ్రహీం ఢిల్లీనుండి మద్రాసు చేరుకున్నారు.

బంజర్ల నుంచి రైతుల బేదఖల్‌కు అధికారుల యత్నం

అదిలాబాద్ జిల్లాలో

హైదరాబాదు, సెప్టెంబరు 20

అదిలాబాదు జిల్లాలోని ఆసిఫాబాదు, లక్సెట్టిపేట, సిర్పూర్ తాలూకాలలో తమ స్వాధీనంలో ఉండి, 20 ఏళ్లకు పైనుండి సాగుచేసుకుంటున్న ప్రభుత్వ బంజరు భూములనుంచి గిరిజనులను, ఇతర వెనుకబడినజాతులవారిని తొలగిస్తామని ఫారెస్టు రెవిన్యూ అధికారులు బెదిరిస్తున్నారు.

రిజర్వు ఫారెస్టు ప్రాంతం సరిహద్దు లోపల ఈ భూములు ఉన్నాయని వారు సాకు చూపిస్తున్నారు. అధికారుల బెదిరింపుల మూలంగా ఈ తాలూకాలలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ప్రజలు చాలా ఆందోళన చెందుతున్నారు.

మాజీ యం. యల్. ఏ. అదిలాబాద్ జిల్లా కిసాన్ సభ ఉపాధ్యక్షుడు అయిన శ్రీ బి. గంగారాం, జిల్లా కిసాన్ సభ ఆర్గనైజర్ శ్రీ పి. నరసయ్యలతో కూడిన ప్రతినిధివర్గం నేడు చీఫ్ ఫారెస్టు కన్సర్వేటర్‌ను కలుసుకొని రైతుల సమస్యను నివేదించారు. పై భూముల విషయంలో ప్రభుత్వ విధానం మారలేదని, భూములనుంచి ఎవరినీ తొలగించడం జరగదని చీఫ్ ఫారెస్టు కన్సర్వేటర్ ప్రతినిధివర్గానికి హామీ యిచ్చారు. (వి. వి.)

తూర్పు పాకిస్తాన్ యాత్రనుంచి వినోబాభావే తిరిగిరాక

రాధికాపూర్, సెప్టెంబరు 21

భూదానోద్యమ నాయకుడు ఆచార్య వినోబాభావే తూర్పు పాకిస్తాన్‌లో తన 15 రోజుల పాదయాత్రానంతరం పశ్చిమ బెంగాల్, పశ్చిమ దినాజ్‌పూర్ జిల్లాలో ఇక్కడికి 250 గజాల దూరంలో నేటి ఉదయం 6-45 గంటలకు భారత సరిహద్దుల్లోకి ప్రవేశించారు.

ఈ పాదయాత్ర సందర్భంగా ఆచార్య భావే తూర్పు పాకిస్తాన్ ప్రజలకు సర్వోదయ సిద్ధాంతాలను గూర్చి ప్రబోధించారు.

ఆచార్యవినోబాభావే ఈయాత్రలో తన్ననుసరించిన శ్రీమతి ఆశాదేవి ఆర్యనాయకం, ఇతరు 4గురు సర్వోదయ కార్యకర్తలతో పాటు తూర్పు పాకిస్తాన్ సరిహద్దును దాటి భారత భూభాగంలోకి చేరుకున్నారు.

భారతసరిహద్దుల్లో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి శ్రీ పి. సి. సేన్, సర్వోదయ నాయకుడు శ్రీ చారుచంద్ర భండారీ, వేలాది ప్రజలు ఆచార్య భావేకు స్వాగతం యిచ్చారు.

పాకిస్తాన్ అధికారులు, అశేష ప్రజానీకం అవతలివైపునుంచి ఆచార్య భావేకు క్షేమాభిమానాలు, సౌహార్ద్రతలతో వీడ్కోలిచ్చారు.

అటునుంచి వీడ్కోలు, ఇటువైపు స్వాగతాల సందడిలో రెండు దేశాల ప్రజలు 'సరిహద్దు గోడ' విషయం మరచిపోయి స్నేహపూరిత వాతావరణంలో కాలంగడిపారు.

చైనాలోని సోవియట్ కాన్సలేట్లు

మూయవలసిందిగా చైనా కోరినట్లు వచ్చిన వార్తలపై ఖండన

మాస్కో, సెప్టెంబరు 21

చైనాలోని షాంఘై, హార్బిన్, డైరెన్ పట్టణాలలోని సోవియట్ కాన్సలేట్ (వాణిజ్య కార్యాలయాలు)ను మూసివేయవలసిందిగా చైనా ప్రభుత్వం సోవియట్ యూనియన్‌ను కోరినట్లు వెలువడ్డ వార్తల్ని గూర్చి తన కేమీ తెలియదని ఇక్కడి ఫోన్‌లో ఇంటర్వ్యూ చేయగా చైనా రిపబ్లిక్ రాయబార కార్యాలయం ప్రతినిధి అసోసియేటెడ్ ఫ్రెంచి ప్రెస్ విలేకరికి చెప్పారు.

సంపాదకవర్గం: మోటూరు హనుమంతరావు (అధ్యక్షుడు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్రఆర్టుప్రింటర్సు, విజయవాడ-4

బందరు ముదికి పేటల్లోని ప్రజల నరకయాతన

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

బందరు, సెప్టెంబరు, 20

బందరులో ఈ మధ్య కురిసిన వర్షాల వల్ల ముదికిపేటల నరక స్థితిని వర్ణిస్తూ, ప్రభుత్వమూ, మున్సిపల్ అధికారులూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ బందరు కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ ఎం. శ్రీహరిరావుగారు క్రింది ప్రకటన చేశారు.

"ఈమధ్య కురిసిన అధిక వర్షాలకు బందరు పట్టణంలో పల్లపుప్రాంతాలు జలమయమయినాయి. పేటలకు పేటలు నీటమునిగి మొలలోతు నీటిలో నివసించుటకు సాధ్యంకాని పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతాలకు చేరి కాలక్షేపం చేస్తున్నారు.

పట్టణం చివరవున్న బలరామన్నపేట, నారాయణపురం, నిజాంపేటలలో హరిజనులు, వడ్డెరలు, యానాదులు వగైరా పేద ప్రజానీకం నివసించే ప్రాంతం యావత్తూ జలమయమయింది. వీరు నివసించే ప్రాంతంలోనే మునిసిపాలిటీ చెత్త, మైల, చచ్చిపోయిన కుక్కలు వగైరాలను తెచ్చి పడవేస్తారు. మామూలు రోజులలోనే యీ ప్రాంతంలో నివసించేవారు మానవులేనా అని అనుమానం కలుగుతుంది.

వీరి గోడు మునిసిపల్ అధికారులకుగాని, ప్రభుత్వ అధికారులకుగాని పట్టలేదు. ఈ ప్రాంతం యావత్తు జలమయం అవటంతోనే యీ మైల డిపోసిట్లలో తేలి, సీధులలోనికి యిండ్లలోనికి ప్రవహించింది. కుక్కలు కుళ్ళి, కాకులు గ్రద్దలుపొడిచి ఆ ప్రాంతం యావత్తూ నరకంగా తయారయింది. కాని మునిసిపల్ అధికారులు నీరు పోవుటకు మార్గాలు కాని యీ ప్రాంతంలో ఆరోగ్య రక్షణకు యేర్పాట్లుగాని యింతవరకూ ఏమీ చేయలేదు. ఈ ప్రాంతంలో 1200 కుటుంబాలు నివసిస్తున్నాయంటే, యింకా 400 కుటుంబాలు ఇళ్ళకు చేరలేదు. 200 కుటుంబాలు మట్టల సావిడిలోను, మిగిలినవారు పట్టణంలో అక్కడక్కడ కాలం వెళ్ళబోస్తున్నారు. 13 రోజులు గడచినా ప్రతిరోజూ జోర్లో గొప్ప వర్షం చినుకులు పడుతూనే వున్నాయి. పనులు లేవు. ఇండ్లు పడిపోయినాయి. పైగా జ్వరాలు వ్యాపించుతున్నాయి.

పట్టణంలో పల్లపు ప్రాంతాలు సర్కార్‌తోట, మలకాపట్నం, ముస్తాఖాన్‌పేట, ఉల్లింగుపాలెం వగైరా పీడిత ప్రజలు నివసించే ప్రాంతాల పరిస్థితి యావత్తు యించుమించు యిదేవిధంగా వున్నది. పట్టణంలో రోడ్లు సరిగాలేవు. రోడ్ల మీద పెద్ద పెద్ద గోతులు మురుగు పోయే యేర్పాటులేదు. పలు ప్రాంతాలలో సుమారు 1500 యిండ్లు పడిపోయాయి.

రివెన్యూ, మునిసిపల్ అధికారులు 400 యిండ్లు మాత్రమే పడినా యంటున్నారు. వీరు వేసిన లెక్కలు సరికావు. నీరు తగ్గినకొద్దీ యిండ్లు యింకా పడిపోతున్నాయి. మునిసిపాలిటీ 3 వేలు, కలెక్టరు నిధినుండి వెయ్యి మొత్తం నాలుగువేలుమాత్రం మురుగునీటి బాధితులకు సహాయమంటున్నారు. ఇది యే మాత్రం చాలదు. దానినిబట్టే ప్రభుత్వ, మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం బోధపడుతుంది.

ఆరోగ్య రక్షణకు హెల్తు సిబ్బంది కదలి వెంటనే తగుచర్యలు తీసుకోవాలి. భూగర్భ మురుగునీటి పథకాన్ని బందరుకు వర్తింపచేయుటకు యిప్పటికైనా గుర్తించాలి."

స్టాక్ మార్కెట్ పనివిధానాన్ని బాగా అధ్యయనం చేయాలని రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ శ్రీ హెచ్. వి. ఆర్. అయ్యంగారు మద్రాసులో అన్నారు.



హైద్రాబాదులోని చిక్కడపల్లిలో గుడిసెలు మునిగిపోయిన దృశ్యం.

హెలికాప్టర్ ద్వారా మందు చల్లకం

ఉయ్యూరులో నేడు ప్రారంభం

విజయవాడ, సెప్టెంబరు 22

తెల్లకంకి తెగులునుండి వరిపైరును రక్షించడానికిగాను కృష్ణాజిల్లా వ్యవసాయశాఖ నేడు క్రిమిసంహారక కార్యక్రమం ప్రారంభించింది.

వచ్చే రెండు వారాలలో జిల్లాలో 15 వేల ఎకరాలకు పైగా పంట భూముల్లో హెలికాప్టర్ ద్వారా మందు చల్లించడానికి జిల్లా వ్యవసాయ శాఖ పథకం వేసుకున్నది.

జిల్లా కలెక్టరు శ్రీ యస్. ఏ. కరీం ఇక్కడికి 20 మైళ్ళదూరంలో వున్న ఉయ్యూరులో విమానంద్వారా పంట పొలాలపై మందు చల్లే యీ కార్యక్రమానికి నేటి ఉదయం ప్రారంభోత్సవం జరిపారు.

ఈ నాడు ఉయ్యూరులో 5 వందలు, కేపు తోట్లవల్లూరులో 5 వందలు, 24న మొటూరు సమితిలో 2 వేల ఎకరాల పొలాల్లో ఈ మందు చల్లబడుతుంది.

విద్యార్థులు కులతత్వాన్ని విడనాడాలని ఆలీఘర్ విద్యార్థుల సభలో ప్రసంగించుతూ ప్రధాని బక్షీ గులాం మహమ్మద్ అన్నారు.

జూనియర్ హిందీ పండిత శిక్షణతరగతులు

పామర్రు, సెప్టెంబరు 18

విద్యావనం పబ్లిక్ ట్రస్టు పామర్రు కార్యదర్శి శ్రీ యలమంచిలి వెంకటేశ్వరరావుగారు ఇలా వ్రాస్తున్నారు:

"ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు జూనియర్ హిందీపండిట్ ట్రైనింగ్ కోర్సు సాగించుటకు మా సంస్థకు అనుమతి నిచ్చినారు. తరగతులు సెప్టెంబరు 15న ప్రారంభమైనాయి. విశారద లేక భూషణ్ ప్యాసై మూడవఫారము కూడ ప్యాసైనవారు తమ సర్టిఫికెట్లతో సహా వెంటనేవచ్చి విద్యాలయంలో చేరవచ్చును. వివరాలకు 'ప్రిన్సిపాల్ విద్యావనం పబ్లిక్ ట్రస్టు పామర్రు కృష్ణా' అని వ్రాయవలెను."

సార్వత్రిక,
సంపూర్ణ నిరాయుధీకరణ
సకలదేశాల శాంతిభద్రతలకు హామీ
ఎన్. ఎస్. కృశ్చేవ్

ప్రపంచ శాంతి,
నిరాయుధీకరణ మహాసభలో
(జులై 10, 1962) ప్రసంగం
సోవియట్ భూమి ప్రచురణ - వెల : 0-10 న. పై.

★

ప్రతులకు:
విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ-4
విశాలాంధ్ర సేల్స్‌డిపో, బీసెంటురోడ్, విజయవాడ-2
పీపుల్సుబుక్ హౌస్, నెహ్రూరోడ్, హైద్రాబాద్.

ఆంధ్ర : ప్రభాత్ పిక్చర్స్ (ప్ర) లిమిటెడ్, విజయవాడ
నైజాం : వాణీ ఫిలిమ్స్, సికింద్రాబాద్; సీడెడ్ : వెంకటేశ్వర ఫిలిమ్స్, గుంటకల్.


3వ వారం
శ్రీకృష్ణసాయి ఫిలింస్ వారి
మాయామోహిని
నిర్మాత... యర్రా అప్పారావు + దర్శకత్వం... హున్సూరుకృష్ణమూర్తి.